
నిష్పక్షపాతం.. సత్యనిష్ఠ..
అంకితభావం..
ప్రజల మేలు కోసం చూపే తెగువ
పత్రికలకు అవశ్యం.

# ఆంధ్రపత్రిక

స్వాతంత్ర్య సమరానికి అక్షరాయుధాలు అందించిన ఏకైక దినపత్రిక - స్థాపితం 1914

విజయవాడ సంపుటి : 60 సంచిక : 282 • పేజీలు : 8 • గురువారం 4 జూలై 2024 • వెల : రూ. 5.00 Published from : Vijayawada| Visakhapatnam |Srikakulam | Rajahmundry|Kurnool|Guntur|Ongole| Nellore Tirupati

## ఉప్పాడ తీరం కోతలపై అధ్యయనం




◆ ఉప్పాడ తీరాన్ని పరిశీలించిన పవన్ కళ్యాణ్
◆ కారణాలను అధికారులతో చర్చించిన డిప్యూటీ సిఎం
◆ ఉప్పాడకు చేరుకున్న పవన్ కళ్యాణ్‌కు ఘనంగా స్వాగతం

**కాకినాడ,జూలై 3 (ఆంధ్రపత్రిక):** ఉప్పాడ తీరం భారీగా కోతకు గురవుతోంది. గత ఏడాదిన్నర కాలంగా ఏకంగా ఎకరం మేర భూభాగం సముద్రంలో కలిసిపోయింది. తీరం తీవ్రంగా ధ్వంసమైంది. ఈ కోతను ఆపేందుకు చర్యలు తీసుకుంటామని పవన్ కళ్యాణ్ ఇప్పటికే చెప్పారు. చెన్నై నుంచి వచ్చే నిపుణుల బృందం ఉప్పాడ తీరాన్ని పరిశీలించి మిగతా 7లో

## అవినీతిపై కఠినంగా ఉంటాం

- కేంద్ర దర్యాప్తు సంస్థలకు పూర్తి స్వేచ్ఛను ఇచ్చాం
- అవినీతి పరులు చట్టం నుంచి తప్పించుకోలేరు
- మణిపూర్ అల్లర్ల బాధ్యులపై కఠిన చర్యలు
- రాజ్యసభలో రాష్ట్రపతి ప్రసంగంపై చర్చలో ప్రధాని
- నిరసనగా రాజ్యసభలో విపక్షాల వాకౌట్

7లో







## ఐదేళ్ల పాలనలో అమరావతి విధ్వంసం

### అమరావతి విధ్వంసంపై శ్వేతపత్రం విడుదల చేసిన సిఎం చంద్రబాబు

**అమరావతి,జూలై 3 (ఆంధ్రపత్రిక):** ప్రపంచంలోనే అతిపెద్ద భూ సేకరణ ప్రాజెక్టు అమరావతి అని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. ప్రపంచం మెచ్చేలా రాజధాని నిర్మించాలని సంకల్పించి, అతిపెద్ద భూసేకరణ చేశామని, కానీ గత ఐదేళ్ల కాలంలో జగన్ దానిని విధ్వంసం చేశారని అన్నారు. ఇప్పుడు ఎన్ని కష్టాలు ఎదురైనా పునర్నిర్మాణం చేసి తీరుతామని ప్రకటించారు. ఇది ఏ ఒక్కరి రాజధాని కాదు.. యావత్ రాష్ట్ర ప్రజలదని తెలిపారు. ప్రతి తెలుగు బిడ్డ అమరావతి నాది అని గర్వంగా గుర్తించాలి.. చెప్పుకోవాలన్నారు. కొత్తగా ప్రణాళికలు ఏమీ లేవని, పాత వాటినే కొనసాగిస్తూ నిర్మాణం చేస్తామని తెలిపారు. రాజధాని అమరావతిపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బుధవారం శ్వేతపత్రం విడుదల చేశారు. ఉద్యోగ, ఉపాధి కోసం తాను అమరావతిని నిర్మించాలని చూస్తే జగన్ విధ్వంసం సృష్టించారని పూర్తి వివరాలు ప్రకటించారు. జగన్ ప్రభుత్వం చేసిన అరాచక పనుల కారణంగా వరల్డ్ క్లాస్ క్యాపిటల్‌గా మారాల్సిన మిగతా 7లో

◆ అమరావతి విధ్వంసం... ఓ కేస్ స్టడీ
◆ మళ్లీ అమరావతికి ప్రాణప్రతిష్ట చేసి తీరుతాం
◆ ప్రతి తెలుగు బిడ్డ అమరావతి గర్వంగా చెప్పుకునేలా చేస్తాం..
◆ మళ్లీ పెట్టుబడిదారుల విశ్వాసం చూరగొంటాం
◆ దేశంలోని పవిత్ర జలాలు, మట్టి ఇక్కడ చేరుకున్నాయి..
◆ అందుకే మహిమాన్విత ప్రాంతాన్ని ఏమీ చేయలేకపోయారు..
◆ గోదావరి, కృష్ణా నదుల మధ్యలో ఉండేలా అమరావతికి శ్రీకారం
◆ త్వరలోనే నిర్మాణ పనులు చేపట్టి..అద్భుత నగరంగా తీర్చిదిద్దుతాం..
◆ రాజధాని రాష్ట్రం మధ్యలో ఉండాలని జగన్ ఆనాడు చెప్పారు..

## 132 సీట్లతో కూడిన బస్సులు



◆ ప్రజా రవాణా మెరుగుపరిచేందుకు నూతన మార్గాలు
◆ కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ

**న్యూఢిల్లీ,జూలై 3 :** దేశ వ్యాప్తంగా కాలుష్యం ప్రధాన సమస్యగా మారిందని ఈ నేపథ్యంలోనే వ్యక్తిగత, ప్రజా రవాణాను మరింత మెరుగుపరిచేందుకు నూతన మార్గాలను మిగతా 7లో

## కవిత కస్టడీ పొడిగింపు

- మనీష్ సిసోడియాకు కూడా అదే వర్తింపు
- 25 వరకు పొడిగించిన కోర్టు



**న్యూఢిల్లీ,జూలై 3 :** బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత జ్యుడిషియల్ కస్టడీ పొడిగించారు. ఢిల్లీ లిక్కర్ పాలసీ మనీలాండరింగ్ కేసులో జులై 25వ తేదీ వరకు కవిత, మనీష్ సిసోడియా కస్టడీ పొడిగిస్తున్నట్లు రౌస్ అవెన్యూ కోర్టు వెల్లడించింది. ఈడీ కేసులో బుధవారంతో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత, మిగతా 7లో

## వైఎస్ఆర్ జయంతి వేడుకలకు హాజరుకండి

**బెంగళూరు,జూలై 3 :** కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డి కే శివకుమార్‌ని, ఏపీ సీసీ చీఫ్ వైఎస్ షర్మిలా ఇవ్వాళ ఉదయం ఆయన నివాసంలో కలిశారు. ఈ నెల 8న విజయవాడలో నిర్వహిస్తున్న వైఎస్ఆర్ 75 జయంతి వేడుకలకు హాజరవ్వాలని కోరారు. అదేవిధంగా ఏపిలో కాంగ్రెస్ పార్టీ బలోపేతంపై ఇరువురి మధ్య చర్చ జరిగింది.



## తీర్మానాలతో హోదా అసాధ్యం



◆ ప్రత్యేక హోదా ముగిసిన అధ్యాయం..
◆ పోలవరం పూర్తికి కేంద్రం పూర్తి సహకారం
◆ కేంద్రమంత్రి శ్రీనివాస వర్మ

**న్యూఢిల్లీ,జూలై 3 :** ఏపీ అభివృద్ధికి ఎలాంటి సహకారం కావాలో ఆలోచించి ముందుకు వెళ్తామని కేంద్రమంత్రి భూపతిరాజు మిగతా 7లో

## నదుల అనుసంధానంతోనే నీటి సమస్యకు చెక్

◆ పోలవరంతోనే నదుల అనుసంధానం సాకారం
◆ పట్టిసీమ ఎత్తిపోతల ద్వారా కృష్ణాడెల్టాకు నీరు విడుదల
◆ వెల్లడించిన జలవనరులశాఖ మంత్రి నిమ్మల




**ఏలూరు,జూలై 3 (ఆంధ్రపత్రిక):** దేశాన్ని కరవు రహితంగా మార్చాలంటే నదుల అనుసంధానమే మార్గమని ఏపీ జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. ఆ ప్రక్రియకు శ్రీకారం చుట్టింది సీఎం చంద్రబాబేనని చెప్పారు. పోలవరం ప్రాజెక్టుతోనే నదుల మిగతా 7లో

## అభ్యర్థులకు సమయం కావాలి



◆ టెట్, మెగా డీఎస్సీలపై ప్రభుత్వం కీలక నిర్ణయం
◆ పరీక్షలకు సన్నద్ధమయ్యేందుకు అభ్యర్థులకు సమయం
◆ అధికారులకు ఆదేశాలు ఇచ్చిన మంత్రి లోకేశ్

7లో

## తెలంగాణ హైకోర్టు కీలక ఆదేశాలు

◆ వైసీపీ అధినేత జగన్మోహన్‌రెడ్డికి భారీ షాక్
◆ సీబీఐ, ఈడీ కేసులపై ఇక రోజువారీ విచారణ
◆ కేసు మూడు వారాలకు వాయిదా వేసిన హైకోర్టు

**హైదరాబాద్,జూలై 3 (ఆంధ్రపత్రిక):** వైసీపీ అధినేత జగన్మోహన్ రెడ్డికి భారీ షాక్ తగిలింది. ఆయనపై నమోదైన సీబీఐ, ఈడీ కేసుల విచారణలను రోజువారీగా చెపట్టాలని తెలంగాణ హైకోర్టు ఆదేశించింది. జగన్‌పై నమోదైన సీబీఐ, ఈడీ కేసులను రోజువారీ విచారణ చేపట్టి తేల్చేసేలా హైదరాబాద్ సీబీఐ కోర్టుకు ఆదేశాలివ్వాలంటూ హరిరామ జోగయ్య తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. ఈ మేరకు పిల్ దాఖలు చేశారు..సీబీఐ, మిగతా 7లో



## ఎపిలో మళ్లీ ఉచిత ఇసుక విధానం..!

◆ ఉచిత ఇసుక విధానానికి బాబు గ్రీన్‌సిగ్నల్
◆ ఉచిత ఇసుక విధానం శుభపరిణామం..
◆ 8 నుంచి అమల్లోకి ఉచిత ఇసుక విధానం
◆ గత ఐదేళ్లు ఇసుక పేరుతో వైసిపి నేతలు దోపిడి



**అమరావతి,జూలై 3 (ఆంధ్రపత్రిక):** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇటీవల ఇసుక పాలసీపైన అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించిన విషయం తెలిసిందే. ఇక తాజాగా ఆయన ఏపీలో ఇసుక పంపిణీ విధానంపై కీలకనిర్ణయం మిగతా 7లో

## భక్తులకు టిటిడి హెచ్చరిక

◆ ఇలాంటి తప్పుడు ప్రచారాలు నమ్మవద్దు
◆ తిరుమల ప్రసాదాల్లో మార్పు లేదు..
◆ వివరణ ఇచ్చిన టిటిడి అధికారులు



**తిరుమల, జూలై 3 (ఆంధ్రపత్రిక):** శ్రీవారికి నివేదించే అన్న ప్రసాదాల తయారీలో మార్పు లంటూ తప్పుడు ప్రచారం జరుగుతోందని టిటిడి తెలిపింది. సేంద్రియ బియ్యం మిగతా 7లో

## ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపిక లాంఛనమే..



◆ నామినేషన్లు సక్రమంగా ఉన్నట్లు గుర్తింపు..
◆ నామినేషన్ల ఉపసంహరణకు 5 వరకు తుది గడువు
◆ ఇప్పటివరకూ రెండు నామినేషన్లు మాత్రమే దాఖలు
◆ ఎమ్మెల్సీ ఉపఎన్నిక ఏకగ్రీవం అయ్యే అవకాశం..

**అమరావతి,జూలై 3 (ఆంధ్రపత్రిక):** టీడీపీ, జనసేన ఎమ్మెల్సీ అభ్యర్థులుగా మంగళవారం దాఖలు చేసిన సి.రామచంద్రయ్య, పి.హరిప్రసాద్ నామినేషన్లు సక్రమంగానే ఉన్నట్లు తేలింది. ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఉపఎన్నికకు జారీ చేసిన నోటిఫికేషన్‌కు ఇప్పటివరకూ మిగతా 7లో

## ఎన్టీఆర్ భవన్‌పై దాడి కేసు..

◆ ఎమ్మెల్యే ఆర్కే అనుచరులుగా గుర్తింపు..
◆ సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా నిందితులను పోలీసులు గుర్తింపు..
◆ ఈ ఘటనకు సంబంధించి 150 మందిపై కేసులు నమోదు!

**అమరావతి, జూలై 3 (ఆంధ్రపత్రిక):** టీడీపీ సెంట్రల్ ఆఫీస్‌పై దాడి కేసులో పోలీసులు వేగం పెంచారు. వైసీపీ పార్టీ చెందిన మిగతా 7లో



ఒరులేయవి యొనరించిన నరవర యప్రియము తన మనంబున కగు దా
నొరులకు నవి సేయకునికి పరాయణము పరమ ధర్మపథములకెల్లన్

ఆంధ్రపత్రిక

వ్యవస్థాపకులు: దేశోద్ధారక విశ్వదాత శ్రీ కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు


# నిన్నటి మంత్రి మాట తప్పారు

అవధానానికి ఒకరోజును అంకితం చేసి,సరికొత్త సత్ సంప్రదాయాన్ని నెలకొల్పి, భాషాభిమానాన్ని చాటుకుంటామని గత ప్రభుత్వంలో మంత్రిగా వున్న ధర్మాన ప్రసా దరావు మాట ఇచ్చి తప్పారు. 2022 డిసెంబర్ 18 వ తేదీనశ్రీకాకుళంలో జరిగిన అవధాన వేదికపై,అవధాన కవుల సాక్షిగా ఇది జరిగింది.అది కార్యరూపమే దాల్చలేదు. తెలుగువారి సంతకంగా భావించే ఉత్కృష్ణ సాహిత్య ప్రక్రియ 'అవధానం'.తెలుగువారి ఆస్తిగాపేరుమోసిన పద్యం మూలంగా, సర్వంగా సాగే ఈ సారస్వత క్రతువు సర్వ సౌందర్య శోభితం.వందల ఏళ్ళ ఘన చరిత కలిగినఈ ప్రక్రియకు సాహిత్య సమాజంలో గొప్ప గౌరవం ఉన్నదన్నది వాస్తవం.కానీ,ప్రభుత్వాలలో విస్మరించబడిన కళాప్రక్రియగానే భావించాలి.కేంద్ర ప్రభుత్వం ఇటీవల ఇద్దరు అవధానకవులకు 'పద్మశ్రీ'పురస్కారం సమర్పించి గౌరవించింది.అది తెలుగు వారికి ఆనందాన్ని ఇచ్చే అంశమే.అయితే ఆ పురస్కారం పొందిన ఆశావాది ప్రకాశరావు,గరికిపాటి నరసింహారావు అందుకున్నది కేవలంఅవధాన ప్రక్రియకు చేసిన సేవ,చూపిన ప్రతిభకు కాదు.సాహిత్య సేవా విభా గంలో మాత్రమే వారికి ఆ గుర్తింపు వచ్చింది.కేంద్ర ప్రభుత్వానికి,ఉత్తరాదివారికి తెలుగు వారి అవధాన విద్యా విశిష్టత గురించి పెద్దగా తెలిసిఉండదు.అది నిజం కూడా. ప్రధాన మంత్రిగా పనిచేసినమన పీవీ నరసింహారావును వారిలో మినహాయించి చూడాలి.వారి పాలనా కాలంలోనైనా అవధానానికి కేంద్ర ప్రభుత్వంలో గుర్తింపు రాలేదా అంటే? అప్పు డున్న దేశ పరిస్థితులు వేరు.మాడుగుల నాగఫణిశర్మ హైదరాబాద్ లో చేసిన అవధాన ప్రదర్శనకు ప్రధానమంత్రి హోదాలో ముఖ్య అతిధిగా వచ్చితన భాషాభిమానాన్ని, పద్యానురక్తిని,అవధాన ప్రక్రియ పట్ల తన అభినివేశాన్ని,అభివ్యక్తిని పీవీ నరసింహారావు హృదయపూర్వకంగా చాటుకున్నారు.మరో సమయంలోమేడసాని మోహన్ నిర్వహించిన అవధానంలోనూ పాల్గొని పీవీతన భాషానురక్తిని చూపించారు. ఇక ఎన్టీఆర్,బెజవాడ గోపాలరెడ్డి వంటి వారు సరే సరే!వారు ఉఛ్వాస నిశ్వాసలలో తెలుగుతనాన్ని నింపుకొని సాగారు. అవధాన రంగంలో,కొప్పరపు కవుల కుమారులను బెజవాడ గోపాలరెడ్డి ఎంత గానో ప్రోత్సహించారు.టంగుటూరు ప్రకాశంపంతులు,కాసు బ్రహ్మానందరెడ్డి వంటి నాయకులు అవధానానికి చూపిన గౌరవం అంతాఇంతాకాదు.ఐతే! ఇన్నేళ్ల పాలనా వ్యవస్థల్లో,కేంద్రంలో ఏ పార్టీ,ఏ నాయకుడు అధికారంలో ఉన్నా! అవధానానికి పద్మపు రస్కారం ప్రకటించిన సందర్భం ఇంతవరకూ లేదు.కనీసం రాష్ట్ర ప్రభుత్వాలైనా అవధా నానికి ప్రత్యేక పురస్కారం స్థాపించి ఉండాల్సింది.అదీ జరుగలేదు.గతంలోరాష్ట్ర ప్రభు త్వం అవధాన విద్యా వికాసం కోసం మాడుగుల నాగఫణిశర్మకు హైదరాబాద్ లో పెద్ద స్థలాన్ని కేటాయించింది.అది మంచి విషయమే.ఈ విషయంలో చంద్రబాబు,వై ఎస్ రాజ శేఖరరెడ్డి ఇద్దరూ ముందు నిలిచారు.ఇద్దరూ మాడుగుల, మేడసాని సభల్లో అనేకసార్లు పాల్గొన్నారు కూడా.ఆ తర్వాత అవధాన విద్యా వికాసం దిశగా ప్రభుత్వాల నుంచి అడుగులు పడిన దాఖలాలు లేవు.ఆంధ్రవిశ్వవిద్యాలయంవైస్ ఛాన్సలర్ గా జీ ఎస్ ఎన్ రాజు ఉన్న సమయంలో అవధాన విద్య కోసం విశ్వవిద్యాలయంలో ప్రత్యేకమైన విభా గాన్ని ప్రారంభించారు.అది మూన్నాళ్ళ ముచ్చటగానే మిగిలిపోయింది. వారి పదవీ కా లం ముగిసాకఆ విభాగం అటకెక్కింది.తర్వాత వచ్చిన వైస్ ఛాన్సలర్స్ ఎవరూ దాని గు రించి పట్టించుకోలేదు.బహుశా! వారికి ఎవరైనా గుర్తు చేశారో లేదో కూడా తెలి యదు.అలా అవధాన ప్రాశస్త్యానికి ప్రభుత్వాలలో గుర్తింపు కనుమరుగైంది. 2022 డిసెంబర్ 18 వ తేదీ శ్రీకాకుళంలో లలితాదిత్య అవధాన సభకు ముఖ్య అతిధిగా అప్ప టి మంత్రి ధర్మాన ప్రసాదరావు పాల్గొన్నారు.తన ప్రసంగంలో భాగంగా గొప్ప ప్రకటన చేశారు.ఇక నుంచి ప్రతి ఫిబ్రవరి 22 వ తేదీని 'ప్రపంచ అవధాన దినోత్సవం'గా చూస్తాం అన్నారు.వేదికపై వున్న కవిపండితుల ప్రతిపాదనకు ప్రతిస్పందనగామంత్రి ధర్మాన ఆ ప్రకటన చేశారు.వారు కేబినెట్ మంత్రి కాబట్టి దానిని ప్రభుత్వ ప్రకటనగానే చూడాలి. నిజానికి వారి మంత్రిత్వ శాఖఅది కాకపోయినా,అవధానంపై ఉండే అభిమా నంతో ఈ ప్రకటన చేసినందుకు ధర్మాన ప్రసాదరావుకు అభినందనలు కూడా వెల్లువె త్తాయి. అప్పుడు భాషా సాంస్కృతిక శాఖకు ఆర్ కె రోజా మంత్రిగా ప్రాతినిధ్యం వహిస్తు న్నారు.ఆ అంశాన్నిధర్మాన ప్రసాద రావు ప్రభుత్వం దృష్టికి,సంబంధిత మంత్రి రోజా దృష్టికి తీసుకెళ్ళారో లేదో కూడా తెలి యదు. ఆ దిశగా ప్రభుత్వంనుంచి జీవోగానీ, ప్రకటన కానీ వెలువడలేదు.మంత్రిగారు చేసిన ప్రకటనకు సత్వరమే ఆమోద ముద్ర లభిస్తుందని అందరంఎంతగానో ఆశించారు.' అవధాన దినోత్సవం'గాఫిబ్రవరి 22 ను ఎంచుకోడానికి ఒక చారిత్రక కారణం,ఔచిత్యం కూడా ఉన్నాయి.1872 ఫిబ్రవరి22న కృష్ణా జిల్లా ఆగిరిపల్లిలో శ్రీమాన్ మాడభూషి వేంకటాచార్యులవారుతొలి అవధానం చేసినరోజు.అందుకని ఈ రోజును ఎంచుకున్నట్లు భావించాలి.నిజంగా ఇది చాలా మంచి ఆలోచన.నిజానికి తెలుగునాటఅవధాన విద్య ప్రారంభమై వందల ఏళ్ళు అయ్యిం ది.చరిగొండ ధర్మన, కోలాచాల మల్లినాథసూరి, రామరాజభూషణుడు మొదలైనవారి కాలంలోనేఅవధాన కళ అద్భుతంగా వికసించింది. ఆధునిక కాలంలో సరిగ్గా 150 ఏళ్ళ క్రితం గుంటూరుకు చెందినమాడభూషి వెంకటా చార్యులు అవధాన విద్యకు కొత్త సిలబస్ ను తయారుచేసి,వారే ప్రదర్శించి సాహిత్యలో కానికి అందించారు. దాన్ని అందిపుచ్చుకొని తిరుపతి వెంకటకవులు,కొప్పరపు కవులు అవధాన సాహిత్య సామ్రాజ్యంలో విజృంభిం చారు.ఈ రెండు జంటలకు తోడు మరికొం దరు కవులు కలిసి అవధాన విద్యకు సుస్థిరమైన పునాదులు వేశారు.ఈ ప్రక్రియకు బంగారుబాటలు వేసి, పద్యరత్నాలు పండించిన వారిలో తిరుపతి వెంకటకవులు,కొప్పరపు కవుల స్థానం అమేయం, అపూర్వం.ఇంతటి అవధానకళను రేపటి తరాలకు అద్భుతంగా అందించడం జాతి కర్త వ్యం. ఇప్పటికీ మాడుగుల నాగఫణిశర్మ, మేడసాని మోహన్, గరికిపాటి నరసింహా రావు, వద్దిపర్తి పద్మాకర్,పాలపర్తి శ్యామలానంద ప్రసాద్ వంటివారు అద్భుత రీతిన అవధాన ప్రక్రియకు విశేష ఖ్యాతిని కలిగిస్తున్నారు.బులుసు అపర్ణ, లలితాదిత్య, ఉప్పలదడియం వంటి యువతరం అవధాన యాత్ర చేస్తున్నారు.అది సరిపోదు.అవధాన విద్యకు విశ్వవి ద్యాలయాల్లోప్రత్యేక విభాగాలను స్థాపించాలి. నెల్లూరులోని తెలుగు ప్రాచీన హోదా కేంద్రంలోనూ ప్రత్యేక శాఖను ఏర్పాటుచేయాలి. దూళిపాళ మహాదేవమణి, కడిమళ్ళ వరప్రసాద్ వంటివారు వ్యక్తిగత స్థాయిలో అవధాను లను తయారు చేస్తున్నారు.నేటి ప్రసిద్ధ,ప్రతిభావంతులైన అవధానులందరినీ అవధాన విద్యా వికాసం కోసం కొత్త తరాలకు తర్ఫీదు ఇచ్చేలా సద్వినియోగం చేసుకోవాలి. అవధానకళకుప్రతి ఏటా ఒక పద్మపురస్కారం కేంద్ర ప్రభుత్వం ప్రకటించాలి.ఆ దిశగా మన తెలుగు నాయకులు, ప్రభుత్వాలు కృషి చేయాలి.రెండు తెలుగు ప్రభుత్వాలు అవధాన విద్యకు ప్రతి సంవత్సరం ప్రత్యేక పురస్కారం అందించాలి.అంతటి అవధానానికి వెలుగులు ప్రసరిం చిన తిరుపతి వెంకటకవులు, కొప్పరపు కవుల వంటి మహనీయుల జయంతి ఉత్స వాలను రాష్ట్ర ప్రభుత్వాలు క్రమం తప్పకుండా నిర్వహించాలి.అవధాన మహాకవుల విశేషా లు, అవధాన విద్యా విశిష్టతలను పాఠాల్లో పెట్టాలి.ఇలాంటివి ఎన్నో చేయాల్సిన బాధ్యత ప్రభుత్వాలది,నడిపే పాలకులది.కొత్త ప్రభుత్వం ఈ దిశగా అడుగులు వెయ్యా లి.చంద్రబాబు,పవన్ కల్యాణ్ ద్వయంలో సాగుతున్న పాలనలో తెలుగుకు మంచిరోజులు రావాలి, తేవాలి. వాళ్ళు మాట తప్పారు.వీళ్ళు మాటతప్పరని అనుకుందాం.

# జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య

భారతీయులు సగర్వంగా, సగౌరవంగా తలెత్తి వందనం చేసే, భారత సార్వభౌమాధికారానికి ప్రతీక అయిన త్రివర్ణ పతాక రూపకర్త పింగళి వెంకయ్య. స్వాతంత్ర్య సమరయోధునిగా, వ్యవ సాయ, భూగర్భ ఖనిజ శాస్త్రవేత్తగా, జపనీస్ భాషా బోధకునిగా, చిత్రకారునిగా, వివిధ దేశాల పర్యాటకునిగా, బహుముఖ ప్రజ్ఞ కలిగిన వెంకయ్యను భారతీయులంతా గుర్తు చేసుకోవాల్సిన సందర్భం అనివార్యం. 1878 ఆగస్టు 2న కృష్ణాజిల్లా పెద్ద కళ్ళే పల్లెలో, జన్మించిన వెంకయ్య, భట్లపెనుమర్రిలో విద్యాభ్యాసం ముగించుకొని, తన 19 వ ఏట ముంబై వెళ్లి సైన్యంలో చేరారు. మద్రాసులో ప్లేగు ఇనస్పెక్టరు శిక్షణ పూర్తి చేసి, కొంతకాలం బళ్లారిలో ప్లేగ్ ఇనస్పెక్టరుగా పనిచేసారు. అతని జ్ఞాన దాహం అంతులేనికి. శ్రీలంక వెళ్ళి కొలంబోలోని సిటీ కాలేజీలో పొలిటికల్ ఎకనమిక్స్ ప్రత్యేక విషయంగా చదివి కేంబ్రిడ్జ్ సీనియర్ పరీక్షలో ఉత్తీర్ణుడయ్యారు. కొంతకాలం రైల్వేలో గార్డుగా పనిచేసాడు. ఆ ఉద్యోగానికి రాజీనామా చేసి లాహోర్ లోని డి.ఎ.వి. కాలేజీలో చేరి, సంస్కృతం, ఉర్దూ, జపాన్ భాష ల్లో మంచి పాండిత్యం సంపాదించారు. జపాన్ భాషలో అనర్గ ళంగా మాట్లాడే వెంకయ్య గారిని "జపాన్ వెంకయ్య" అని పిలి చేవారు. 1899 - 1902 మధ్య డచ్ సైన్యానికి వ్యతిరేకంగా, దక్షిణాఫ్రికాలో బోయర్ యుద్ధంలో పాల్గొన్నారు. అక్కడే ఆయనకు స్వాతంత్రోద్యమ నిర్దేశకులు, భావిభారత జాతిపిత మహాత్మా గాంధీతో పరిచయం ఏర్పడింది. దక్షిణాఫ్రికాలో ఉం డగా మహాత్మా గాంధీని కలిశారు. గాంధీతో వెంకయ్యకు ఏర్పడి న ఈ సాన్నిహిత్యం అర్ధశతాబ్దం పాటు నిలిచింది. భూగర్భ ఖనిజ శాస్త్రవేత్తగా మైకా, వజ్రాలపై ఆయన విస్తృత పరిశోధ నలు జరిపారు. స్వదేశం వస్తూ అరేబియా, ఆఫ్ఘనిస్థాన్ లు చూచి వచ్చారు. గాంధీజీ పరిచయం అయిన నాటి నుండి జాతీయ జెండా ఎలా ఉండాలనే సమస్యనే తన అభిమాన విషయంగా పెట్టుకొని, దాని గురించి దేశంలో ప్రచారం ప్రారంభించారు. 1913 నుండి ప్రతి కాంగ్రెస్ సమావేశానికి హాజరై, నాయ కులందరితోనూ జాతీయ పతాక రూపకల్పన గురించి చర్చలు జరిపారి. 1916లో "భారత దేశానికి ఒక జాతీయ పతాకం" అనే ఆంగ్ల గ్రంథాన్ని రచించారు. 1916 లో "నీడ్ ఫర్ నేషనల్ ఫ్లాగ్" పేరున 30 నమూనాలతో జాతీయ పుస్తక రచన గావిం చారు. ఈ గ్రంథానికి అప్పటి వైస్రాయ్ కార్యనిర్వాహక సభ్యుడై న కేంద్రమంత్రి సర్ బి.ఎన్.శర్మ ఉత్తేజకరమైన పీఠిక రాశా రు.1916లో లక్నోలో జరిగిన భారత జాతీయ కాంగ్రెస్ సమావేశంలో వెంకయ్య తయారు చేసిన జాతీయ జెండానే ఎగుర వేశారు. 1919లో జలంధర్ వాస్తవ్యులైన "లాలా హన్స్ రాజ్" మన జాతీయ పతాకంపై రాట్న చిహ్నముంటే బాగుంటుందని సూచించగా గాంధీజీ దాన్ని అంగీకరించారు.



1921లో అఖిల భారత కాంగ్రెస్ సమావేశాలు బెజవాడలో జరిగాయి. గాంధీజీ వెంకయ్యను ఆ సమావేశానికి పిలిపించి కాషాయం, ఆకుపచ్చ రంగులు కలిగి, మధ్య రాట్నంగల ఒక జెండాను చిత్రించమని కోరారు. మహాత్ముడు సూచించిన ప్రకా రంగానే, ఒక జెండాను సమకూర్చాడు వెంకయ్య. అనంతరం వచ్చిన ఆలోచనల మేరకు, సత్యం, అహింసలకు ప్రత్యక్ష నిదర్శ నమైన, తెలుపు రంగు కూడా ఉండాలని గాంధీజీ అభిప్రాయ పడగా, వెంకయ్య ఆ జెండాలో అదనంగా తెలుపు రంగును చేర్చి, నేటి త్రివర్ణ పతాకాన్ని దేశానికి ప్రసాదించారు. "మడత పెడితే పిడికెడే కానీ, కోటానుకోట్ల భారతీయుల ప్రియ వస్త్రం"గా "గాంధీజీ"చే, వెంకయ్య రూపకల్పన చేసిన జాతీయ పతాకం ప్రశంసా పాత్రమైంది. 1947, జూలై 22 వ తేదీన భారత రాజ్యాంగ సభలో నెహ్రూ జాతీయ జెండా గురించి ఒక తీర్మానం చేస్తూ, మునుపటి త్రివర్ణ జెండాలోని రాట్నాన్ని తీసేసి, దాని స్థానంలో అశోకుని ధర్మచక్రాన్ని చిహ్నంగా ఇమిడ్చారు. చిహ్నం మార్పు తప్పితే పింగళి వెంకయ్య రూపొందించిన జెండాకు నేటి జెండాకు తేడా ఏమీ లేదు. అశోకుని ధర్మచక్రం మన పూర్వ సంస్కృతికి సంకేతం.పింగళి వెంకయ్య 1906 నుంచి 1922 వరకు భారత జాతీయోద్యమం లోని వివిధ ఘట్టా లలో పాల్గొన్నారు. వందేమాతరం, హోమ్‌రూల్ ఉద్యమం, ఆంధ్రోద్యమంలాంటి ప్రసిద్ధ ఉద్యమాలలో ప్రధాన పాత్రధారిగా ఉన్నారు. భారతదేశానికి తిరిగి వచ్చిన తర్వాత ఆయన బెంగుళూరు, మద్రాసు లలో "రైల్వే గార్డు"గా పనిచేశారు. ఆ తరువాత కొంత కాలము బళ్లారిలో "ప్లేగు అధికారి"గా ప్రభుత్వ ఉద్యోగము చేశారు. వెంకయ్యలో ఉన్న దేశభక్తి ఆయనను ఎంతో కాలము ఉద్యోగము చేయనివ్వలేదు.1906 నుండి 19 22 వరకు జాతీయోద్యమాలతో పాటు మునగాల పరగణా నడి గూడెంలో జమీందారు రాజా బహదూర్ నాయని రంగారావు కోరిక మేరకు, నడిగూడెంలో నివాసముండి, పత్తి మొక్కలలోని మేలు రకముల పరిశోధనలో వినియోగించారు. నడిగూడెంలో వ్యవసాయ క్షేత్రాన్ని నిర్మించాడు. ఈ పరిశోధనలలో "కంబో డియా పత్తి" అను ఒక ప్రత్యేక రకమైన పత్తి మీద విశేష కృషి చేశారు. ఆయన కృషిని ఆనాటి బ్రిటీషు ప్రభుత్వముకూడా గుర్తించడముతో ఆయనకు "పత్తి వెంకయ్య" అని పేరు వచ్చింది.తరువాత నెల్లూరు చేరి, 1924 నుండి 1944 వరకు అక్కడే ఉంటూ మైకా (అభ్రకం) గురించి పరిశోధన చేశారు. వజ్రకరూరు, హంపిలలో ఖనిజాలు, వజ్రాలు గురించి విశేషంగా పరిశోధనలు జరిపి ప్రపంచానికి తెలియని వజ్రపు తల్లిరాయి అనే గ్రంథం రాసి 1955లో దాన్ని ప్రచురించారు. దేశానికి స్వాతంత్ర్యం లభించిన తరువాత ప్రభుత్వం వెంకయ్యను ఖనిజ పరిశోధక శాఖ సలహాదారుగా నియమించింది. ఆ పదవిలో ఆయన 1960 వరకు పనిచేసారు.అయితే వెంకయ్య జీవిత చర మాంకం దయనీయ స్థితిలో ముగిసింది.1960 లో భారత ప్రభు త్వం భూగర్భ ఖనిజాలు సంస్థ సలహాదారునిగా వెంకయ్యకు ఇచ్చే గౌరవ వేతనాన్ని సైతం నిలిపి వేసింది. వృద్ధాప్యంలో ఆర్థిక బాధలు ఆయనను చుట్టు ముట్టాయి. మిలటరీలో పని చేసినందుకు విజయవాడ చిట్టినగరులో ప్రభుత్వం ఇచ్చిన స్థలంలో, ఆయన గుడిసె వేసుకొని దారిద్ర్య జీవితాన్ని గడపవలసి వచ్చింది. జీవితాంతం దేశం కొరకు, స్వాతంత్ర్యం కొరకు పోరాడిన వెంకయ్య చివరి రోజుల్లో తిండికి కూడా మొ హం వాచి, నానా అగచాట్లు పడినట్లు ' త్రివేణి ' సంపాదకులు డా. భావరాజు నరసింహారావు పేర్కొన్నారు. అంతిమదశలో విజయవాడలో డా. కె.ఎల్.రావు, డా.టి.వి.ఎస్.చలపతిరావు, కాట్రగడ్డ శ్రీనివాసరావు మున్నగు పెద్దలు 1963 జనవరి 15న వెంకయ్యను సత్కరించి, కొంత నిధిని అందించారు. కన్నుమూసే ముందు ఆయన చివరి కోరికను వెల్లడిస్తూ " నా అంత్య దశ సమీపించింది. నేను చనిపోయిన తర్వాత త్రివర్ణ పతాకాన్ని నా భౌతిక కాయంపై కప్పండి. శ్మశానానికి చేరిన తర్వాత ఆ పతాకం తీసి అక్కడ ఉన్న రావి చెట్టుకు కట్టండి. ఇది నా తుది కోరిక " అన్నారు. ఆత్మాభిమానానికి మారుపేరైన వెంకయ్య, కడు పేదరికాన్ని అనుభవిస్తూ, 1963 జూలై 4న విజయవాడలో తుది శ్వాస వదిలారు. 1964 లో జూలైలో నాటి ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి, వెంకయ్య చిత్రపటాన్ని ఆవిష్కరించినా, విజ యవాడ గాంధీ హాల్ నందు విగ్రహావిష్కరణ జరిగినా, భారతీ యులు ఆచంద్ర తారార్కం గుర్తుంచు కోవలసిన పింగళి వెంక య్యకు... రావలసిన గౌరవం రాకపోవడం నిజంగా బాధాకరం. గత ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం హైదరాబాదులో ట్యాంక్ బండ్ పై ఆయన కాంస్య విగ్రహాన్ని ప్రతిష్ఠింపజేసి ఆయన దర్శన భాగ్యం ప్రజలకు లభింపజేసి, కొంతలో కొంతైనా ప్రజలకు గుర్తుండేలా చేసింది.

రామ కిష్టయ్య సంగనభట్ల

# "విశ్వోదయ" నిర్మాత దొడ్ల రామచంద్రారెడ్డి

'విద్యాదానం' కన్నా మించిన దానం లేదంటారు విజ్ఞులు. అన్న దానం ఒక పూట కడుపు నింపుతుంది. ధన దానం కొంత కాల మే అవసరాలు తీరుస్తుంది. భూదానం కొందరికే పరిమితంగా ఉంటుంది. రక్తదానం, శక్తిదానంలు కూడా అలాంటివే. విద్యా దానం అలా కాదు. ఒకరికి విద్యాదానం చేస్తే, ఆ విద్య ద్వారా అతనికి సమాజంలో ఆ గొప్ప గుర్తింపు వస్తుంది. స్వరాష్ట్రంలోనే కాదు, విదేశాల్లో కూడా రాణించే శక్తి సమకూరుతోంది. ఉద్యోగాలు సంపాయించుకోవాలంటే విద్య అత్యవసరం. దాని ద్వారా ఆదాయం, ఆస్తులు కూడా సమకూరుతాయి. ఒక మనిషి విద్యావంతుడైతే అతని సంతతి తరతరాలుగా విద్యావంతులుగా తయారు కావటానికి అవకాశాలు కల్పించబడతాయి. ఒక్కరికి చేసిన విద్యాదానం వల్ల ఇన్ని సత్ఫలితాలు సమకూరితే, లక్షలాది మందిని విద్యావంతులను చేసిన దాతల వల్ల ఎన్ని ఉత్తమోత్తమ ఫలితాలు సమకూరుతాయో అంచనాక్కూడా అందదు. లక్షలాది మందిని విద్యావంతులుగా తీర్చిదిద్దిన మహనీయుని ఏ విధంగా ప్రశంసించాలో మానవ మాత్రులకు అంతుపట్టదు. అలాంటి ప్రశంసలకు అందని ప్రజ్ఞాశాలి డి.ఆర్.దొడ్ల రామచంద్రారెడ్డి 'డి.ఆర్' గా చరిత్రలో స్థిరపడిపోయారు. నెల్లూరు జిల్లా- కావలి వీరి జన్మస్థలం. 1929 జూలై 4వ తేదీన వీరు జన్మించారు. తల్లి ఆదిలక్ష్మమ్మ, తండ్రి వెంకట రామిరెడ్డి. వ్యవసాయ కుటుంబం వారిది. తండ్రి మంచి సాహితీ సంపన్నుడు. దొడ్ల రామాయణం, దొడ్ల భాగవతం లాంటి గ్రంథాలు రాశారు. రామచంద్రారెడ్డి బాల్యం మొత్తం కావలిలోనే గడిచింది. ప్రాథమిక, ప్రాథమి కోన్నత విద్యతో పాటు, ఇంటర్మీడియట్ కూడా కావలిలోనే పూర్తి చేశారు. అనంతరం మద్రాసు వెళ్ళి పచ్చాయప్ప కళాశా లలో డిగ్రీ చదివి, 1949లో డిగ్రీతో పాటు ఆంగ్లంలో 'గోల్డ్ మెడల్' అందుకున్నారు రామచంద్రారెడ్డి. మద్రాసులో చదివే రోజుల్లోనే మనిషికి చదువు అవసరమేనని జ్ఞానోదయమైంది ఆయనకు. మద్రాసు పేవ్మెంట్ల మీద ఆకలితో అలమటించే అన్నార్తులను చూశాక ఆయన మనసు ద్రవించింది. వారు చదువుకొని ఉంటే, ఈ దుస్థితికి దిగజారవలసిన అవసరం వుండదు కదా ! అని అభిప్రాయపడ్డారు. డిగ్రీ పూర్తయ్యాక ఉద్యోగం కోసం వెంప ర్లాడకుండా, బీదవాళ్ళు కూడా మంచి విద్య నందించే విద్యాలయం ఏర్పాటు చేయాలనే నిర్ణయానికి వచ్చారు. అది ఆదర్శప్రాయంగా వుండాలని కూడా తలంచారు.ఉన్నత ప్రమాణాలు కలిగిన విద్యాలయం ఏర్పాటు చేయటం ఆషామాషీ విషయం కాదు. 1951 జూలై 1న 92 మంది విద్యార్థులతో,



కావలిలో ఒక జూనియర్ కళశాల ప్రారంభించారు. దీని ప్రారంభంకు ముందు పెద్దలతో పెద్ద కసరత్తు చేశారు కూడా. తండ్రి వెంకట రామిరెడ్డి, పి.వి. రాజమన్నార్, యస్.వి. భుజంగరాయ శర్మ, కందుకూరి మల్లిఖార్జున, డా? బెజవాడ గోపాలరెడ్డి, బెజవాడ రామచంద్రారెడ్డి లాంటి ప్రముఖులతో చర్చించిన అనంతరమే కళాశాల ఏర్పాటు జరిగింది. "విశ్వోదయ" అన్నది ఆ విద్యాసంస్థ పేరు. అటు తర్వాత కావలి-నెల్లూరుల మధ్య డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేశారు. 1953 నాటికి డిగ్రీ కళాశాలతో పాటు బాల, బాలికలకు వేరు వేరుగా పాఠశాలలు ఏర్పాటు చేశారు. విడివిడిగా విద్యార్థులకు వసతి గృహాలు కూడా ఏర్పాడ్డాయి. సుమారు 100 ఎకరాల విస్తీర్ణానికి ఈ 'విశ్వోదయ' విద్యాసంస్థ విస్తరించింది.విద్యార్థి దశలోనే రామచంద్రారెడ్డి గోల్డ్మిత్, చార్లెస్ డికెన్సు, థామస్ హార్డీ, విల్లీ బ్రాంట్, విక్టర్ హ్యూగో లాంటి విదేశీ ప్రముఖుల రచనలతోపాటు, చలం, కృష్ణశాస్త్రి, శ్రీల తెలుగు రచనలు చదివి పలు అంశాలు అవగతం చేసుకున్నారు. తాను ఏర్పాటు చేసిన కళాశాలకు జవహర్లాల్ నెహ్రూ పేరు పెట్టాలన్నది రామ చంద్రారెడ్డి ఆశయం. భారత ప్రధాని నెహ్రూని స్వయంగా కలిసి, తన అభిప్రాయం వెలిబుచ్చితే, ఆయన సున్నితంగా తిరస్కరించారట. సరోజనీనాయుడు కమలా నెహ్రూల పేర్లలో ఒకటి పెట్టుకోమని సూచించారు. రామచంద్రారెడ్డి అలా చేయ లేదు. 1965లో అప్పటి ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధీని కలిసి, తన మనసులో మాట చెప్పటం, ఆమె అంగీకరించటంతో, అప్పటి భారత ఉపరాష్ట్రపతి జాకీర్ హుస్సేనన్ను కావలి రప్పించి, 1965 నవంబరు 14న కావలి కళాశాలకు జవహర్ భారతి కళాశాలగా నామకరణం చేయించారు. (నవంబరు 14 నెహ్రూ జయంతి).తన విద్యాసంస్థల్లో వేలాదిమందికి సకల సదుపాయాలు కల్పిస్తూ, వారిని ఉ న్నతులుగా తీర్చిదిద్దుతూ, పి. హెచ్.డి.ల సైతం ఇప్పించిన డి.ఆర్.కి తన విషయంలో ఒక కొరత వుందని తరచు బాధపడేవారట. ఎందరో పి.హెచ్.డి.లు అందుకోటానికి దోహదపడిన తను పి. హెచ్.డి. అందుకోలే కపోవటం ఎవరికైనా బాధాకరమే'. కావలిలో విద్యాసంస్థలు నిర్వహిస్తూనే, 1967లో మద్రాసులోని క్రిష్టియన్ కళాశాలలో యం.ఎ. చదివి, ఫిలాసఫీలో పోస్టుగ్రాడ్యుయేషన్ చేశారు. పోసు గ్రాడ్యుయేషన్ పూర్తయిన అనంతరం కావలి వచ్చి కళాశాల ప్రిన్సిపాల్గా బాధ్యతలు స్వీకరించి, 8 నెలలపాటు కొనసా గారు.'విశ్వోదయ' సంస్థ కేవలం విద్యార్థులకు విద్యనందిం చటానికి పరిమితం కాలేదు. విశ్వోదయ సేవాసమితి, విశ్వో దయ లలితకళా సమితి లాంటి వాటిని స్థాపించి, ఆ సంస్థల ఆశయాలకు అనుగుణమైన అంశాలన్నీ పొందుపరచి, వాటన్నిం టినీ తు.చ. తప్పకుండా అమలుపరచి, ప్రజలకు మేలు చేస్తూ, సమాజాన్ని తీర్చిదిద్దే ప్రయత్నం చేశారాయన. 'డి.ఆర్ కేవలం స్వాప్నికుడే కాదు, తన కలలను సాకారం చేసుకొన్న గొప్ప ఆచరణ కర్త' అని ఋజువు చేయగలిగారు. సమాజంలో కుల, మత, జాతి విభేదాలు అనాదిగా వున్నాయి. దారిద్ర్యం, అవిద్య, అసూయలాంటివి కూడా అనాదిగా ఉంటున్నాయి. వీటిన్నంటినీ నిర్మూలించాలన్న సదాశయంతో, సత్ సంకల్పంతో ముందు కుసాగారు డి.ఆర్. కు నిరుపేద విద్యార్థుల సంక్షేమానికి, సంస్కరణల అలుపెరగ కుండా శ్రమించారు. తన ఆశయాలకు అనుగుణంగా విద్యా ప్రయోగాలు. సెమినార్లు నిర్వహించటంతో పాటు, మత, రాజకీయ, సామాజిక గోష్ఠులు అనేకం నిర్వహిం చారు.డి.ఆర్. సంస్థలో విద్య నభ్యసించిన ఎందరో ఉన్నత పదవులనధిరోహించ గలిగారు. 1951లో 100 కన్నా తక్కువ మంది విద్యార్థులతో, ప్రారంభించబడిన విద్యాసంస్థ, 70 ఏళ్ళ వ్యవధిలో ఎందరో మేధావులను సమాజానికి అందించింది. తన ఆశయాలకు తగిన విధంగా రూపకల్పన చేసి, సమాజానికి అత్యంత ఉపకారం చేసిన 'విశ్వోదయ' రూపకర్త దొడ్ల రామ చంద్రారెడ్డిని ఆంధ్ర విశ్వ విద్యాలయం గౌరవ డాక్టరేట్తో సత్కరిం చింది. 2010 జనవరి 15న స్వర్గస్తులయ్యారు.

దాసరి ఆళ్వారస్వామి

# బడ్జెట్ కూర్పులో సాటిలేని మేటి కొణిజేటి

ఆయన సీనియర్ రాజకీయ నాయకుడు. అవిభక్త ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర వివిధ కీలక శాఖల మంత్రిగా, ముఖ్యమంత్రిగా, కర్ణాటక, తమిళ నాడు గవర్నర్ గా విధులు నిర్వర్తించిన అరుదైన అవకాశాలు పొందిన రాజకీయ దురంధరుడు. బడ్జెట్ తయారీ స్పెషలిస్టుగా, తన వాగ్ధాటితో శాసన సభ్యులను, మండలి సభ్యులను ఆకట్టుకున్న ప్రత్యేక శైలిని కలిగి ఉన్న ఘనుడు. విపక్షాలకు శాసన సభలో, మండలిలో ధీటైన సమాధానాలు చెప్పి ఒప్పించిన చతురుడు. 15సార్లు రాష్ట్ర బడ్జెట్ ప్రవేశ పెట్టిన అరుదైన గౌరవం పొందిన మంత్రి. ఆయనే కొణిజేటి రోశయ్య. ఆచార్య ఎన్జీ రంగా శిష్యుడిగా రాజకీయ రంగ ప్రవేశం చేసిన రోశయ్య అనేక పదవులు నిర్వహించారు. ఎమ్మెల్యేగా ..ఎమ్మెల్సీగా..ఎంపీగా చట్ట సభల్లో సుదీర్ఘ కాలం పని చేసిన ఘనత ఆయనకే దక్కింది. 1968-85: శాసనమండలి సభ్యుడుగాబీ 1978-79: శాసన మండలిలో ప్రతిపక్ష నేతగాబీ 1979-83: రాష్ట్ర మంత్రిగా 1985-89: తెనాలి శాసన సభ్యునిగా 1989-94: మంత్రిగా 2004-09: చీరాల శాసన సభ్యునిగా 2004 : మంత్రిగా 2009 : రాష్ట్ర శాసన మండలి సభ్యునిగా 2009, సెప్టెంబరు - 2010 నవంబరు 24: ఆంధ్ర ప్రదేశ్ ముఖ్య మంత్రిగా 3 సెప్టెంబరు 2009 - 25 జూన్ 2011 వరకు, కర్ణాటక గవర్నర్‌గా 28 జూన్ 2014 - 31 ఆగస్టు 2014 వరకు, తమిళ నాడు గవర్నర్ గా 31 ఆగస్టు 2011 - 30 ఆగస్టు 2016 వరకు పని చేశారు. వివిధ పద వులు అనుభవించిన, సమర్థ వంతంగా నిర్వహించిన సుదీర్ఘ రాజకీయ అనుభవ శాలి రోశయ్య. 1933, జూలై 4న గుంటూరు జిల్లా వేమూరు గ్రామములో జన్మించారు. గుంటూరు హిందూ కళాశాలలో కామర్స్‌లో డిగ్రీ పూర్తి చేశారు. రోశయ్య



విద్యార్థి దశలోనే ఎన్జీ రంగా శిష్యుడిగా రాజకీయ రంగ ప్రవేశం చేసారు. ఆయన 1968,1974, 1980,2009 లో ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. 1979లో టంగుటూరి అంజయ్య ప్రభుత్వంలో రవాణ, గృహ నిర్మాణం, వాణిజ్య పన్నుల శాఖలు, 1982లో కోట్ల విజయ భాస్కరరెడ్డి ప్రభుత్వంలో హోం శాఖ, 1989లో మర్రి చెన్నారెడ్డి ప్రభుత్వంలో ఆర్థిక, రవాణ, విద్యుత్తు శాఖలు, 1991లో నేదురుమల్లి జనార్ధనరెడ్డి ప్రభుత్వంలో ఆర్థిక, ఆరోగ్య, విద్య, విద్యుత్తు శాఖలు, 1992లో కోట్ల విజయ భాస్కర రెడ్డి ప్రభుత్వంలో ఆర్థిక, ఆరోగ్య, విద్య, విద్యుత్తు శాఖలకు మంత్రిగా పనిచేసారు. 1994 నుంచి 1996 వరకు ఆయన పీసీసీ అధ్యక్షుడిగా పని చేసారు. 1998లో నరసరావుపేట నియోజక వర్గం నుండి లోక్‌సభకు ఎన్నికయ్యారు. 2004, 2009లో వై.యస్. రాజశేఖర రెడ్డి ప్రభుత్వములో ఆర్థిక మంత్రిగా బాధ్య తలు నిర్వర్తిం చారు. ఆయన ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బడ్జెట్ (ఆర్థిక ప్రణాళిక)ను ఇప్పటికి 15 సార్లు ఆంధ్ర ప్రదేశ్ శాసనసభలో ప్రవేశపెట్టారు.ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వంలో సుదీర్ఘకాలం పాటు ఆర్థికమంత్రిగా పనిచేసిన రోశయ్య 2009-10 బడ్జెటుతో కలిపి మొత్తం 15 సార్లు రాష్ట్ర బడ్జెటును ప్రవేశ పెట్టారు. ఇందులో చివరి 7 సార్లు వరుసగా ప్రవేశ పెట్టడం విశేషం. అలా బడ్జెట్ కూర్పులో రోశయ్య సాటిలేని మేటి గా పేరు పొందారు.ముఖ్యమంత్రిగా వై.ఎస్. రాజశేఖరరెడ్డి హెలికాప్టర్ ప్రమాదంలో మృతి చెందడంతో 2009, సెప్టెంబర్ 3 న రోశయ్య ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసారు. పద్నాలుగు నెలలు అధికారంలో కొనసాగిన అనంతరం 2010 నవంబరు 24 వ తేదీన తన పదవికి రాజీనామా చేసారు . 2011 ఆగస్టు 31న రోశయ్య తమిళనాడు రాష్ట్ర గవర్నరుగా ప్రమాణ స్వీకారం చేశారు. 2016 ఆగస్టు 30 వరకూ గవర్న రుగా తన సేవలు అందించారు.2007లో ఆంధ్ర విశ్వ విద్యాల యం రోశయ్యకు గౌరవ డాక్టరేట్‌ను ప్రధానం చేసింది. 2018 ఫిబ్రవరి 11 నాడు టి.సుబ్బి రామిరెడ్డి లలిత కళాపరిషత్ ఆధ్వర్యంలో ఉమ్మడి ఏపీ మాజీ ముఖ్యమంత్రి, తమిళనాడు మాజీ గవర్నర్ కొణిజేటి రోశయ్యను గజమాలతో సత్కరించి జీవన సాఫల్య పురస్కారం అందించారు. ఈ వేడుకలో ముఖ్య అతిథిగా వెంకయ్య నాయుడు... రోశయ్యకు స్వర్ణ కంకణం బహుకరించారు. అనారోగ్యంతో బాధపడుతూ రోశయ్య (88) 2021 డిసెంబర్ 4న ఉదయం రక్త పోటు తగ్గి, ఆస్పత్రికి తరలించ బడి, మార్గమధ్యలోనే మృతి చెందారు. రోశయ్య తెలుగు ప్రజల హృదయాలలో సుస్థిర స్థానాన్ని సంపాదిం చుకున్నారు.

# రక్షిత మంచినీటి పథకాలపై ప్రత్యేక దృష్టిపెట్టండి

## - అధికారులతో జిల్లా కలెక్టర్ డా. జి.సృజన



**విజయవాడ , జూలై 3, (ఆంధ్రప్రత్రిక):**రక్షిత తాగునీరు, పారిశుద్ధ్యంతో ప్రజల ఆరోగ్య రక్షణ తద్వారా జీవన ప్రమాణాల మెరుగుకు దోహదం చేస్తాయని... దీన్ని దృష్టిలో ఉంచుకొని రక్షిత, సమగ్ర రక్షిత మంచినీటి పథకాలపై ప్రత్యేకంగా దృష్టిసారించాలని జిల్లా కలెక్టర్ డా. జి.సృజన అధికారులను ఆదేశించారు.బుధవారం కలెక్టర్ సృజన.. కలెక్టరేట్‌లోని ఛాంబర్‌లో పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా, ఇరిగేషన్‌బీ రహదారులు, భవనాలుబీ ప్రజారోగ్యం, ఏపీఈడబ్ల్యూఐడీసీ సూపరింటెండింగ్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లతో సమావేశం నిర్వహించారు. వివిధ ఇంజనీరింగ్ విభాగాల పరిధిలో మంజూరైన పనులు, చేపట్టిన పనులు, వాటిలో పురోగతి తదితరాలపై చర్చించారు. ఈ సందర్భంగా గ్రామీణ నీటి సరఫరా శాఖ అధికారులు.. 7,917 చేతిపంపులతో పాటు 868 రక్షిత మంచినీటి పథకాలు/డైరెక్ట్ పంపింగ్, 19 సమగ్ర రక్షిత మంచినీటి పథకాలు ఉన్నట్లు వివరించారు. అదే విధంగా రక్షిత, సమగ్ర రక్షిత మంచినీటి పథకాల నిర్వహణ, ఆర్‌వో ప్లాంట్ల స్థితిగతులు, తాగునీరు చెరువుల పరిస్థితి, వివిధ పథకాల ద్వారా పురోగతిలో ఉన్న పనులు, జల్ జీవన్ మిషన్ (జేజేఎం) పనుల పురోగతి తదితరాలకు సంబంధించిన అంశాలను వివరించారు. ఇదే విధంగా మిగిలిన ఇంజనీరింగ్ విభాగాల అధికారులు తమ పరిధిలోని మానవ వనరులు, కార్యకలాపాలు తదితరాలను వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సృజన మాట్లాడుతూ తాగునీరు ఎట్టిపరిస్థితుల్లోనూ కలుషితం కాకుండా అప్రమత్తతతో ప్రణాళిక ప్రకారం చర్యలు తీసుకోవా లని స్పష్టం చేశారు. పైపులైన్ల లీకేజీలు లేకుండా చూసుకోవాలని.. క్షేత్రస్థాయి అధికారులతో సరైన సమన్వయంతో తాగునీటి సరఫరా వ్యవస్థల రక్షణపై ప్రత్యేకంగా దృష్టిసారించాలన్నారు. తాగునీటి నమూనాలను పరీక్షించేందుకు విజయవాడలోని డిస్ట్రిక్ట్ ల్యాబ్‌తో పాటు నందిగామ సబ్ డివిజన్ ల్యాబ్ ఉన్నందున.. వీటిని సమర్థవంతంగా ఉపయోగించుకోవాలన్నారు. ఎప్పటికప్పుడు బ్యాక్టీరియలాజికల్ కెమికల్ టెస్ట్‌లు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు.సమావేశంలో పంచాయతీరాజ్ ఎస్ఈ ఎ.వెంక టేశ్వరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ డీవీ రమణ, ఇరిగేషన్ ఎస్ఈ ప్రసాద్‌బాబు, ఆర్ అండ్ బీ ఎస్ఈ వీకే విజయశ్రీ, ప్రజారోగ్యం ఈఈ డి.భూషణం, ఏపీఈడబ్ల్యూఐడీసీ బి.అనిల్ కుమార్ పాల్గొన్నారు.

**పారిశ్రామిక రంగంపై సమీక్ష:** జిల్లా కలెక్టర్ డా. జి.సృజన జిల్లా పారిశ్రామిక రంగంపైనా సమీక్ష నిర్వహిం చారు. జిల్లాలోని వివిధ పరిశ్రమలు, వాటి పురోగతిపై చర్చించారు. ప్రతి నెలా క్రమంతప్పకుండా జిల్లా పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ (డీఐఈపీసీ) సమావేశాల నిర్వహణకు చర్యలు తీసుకోవాలన్నారు. పీఎంఈజీపీ క్రెడిట్ లింక్డ్ రాయితీ పథకంపై సరైన విధంగా అవగాహన కల్పించి.. అర్హులు సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. పరిశ్రమల ఏర్పాటుతో తాము ఉపాధి పొందడంతో పాటు మరో పదిమందికి ఉపాధి కల్పించేలా యువతను ప్రోత్సహించాలన్నారు. జిల్లాలో ఎంఎస్ఎంఈల అభివృద్ధి, ఫ్యాక్టరీల్లో ప్రమాదాలు జరక్కుండా పటిష్ట భద్రతా ఏర్పాట్లు, తనిఖీల నిర్వహణ, విపత్తు నిర్వహణకు సంబంధించి మాక్ డ్రిల్స్ నిర్వహణ తదితరాలపై కలెక్టర్ సృజన సూచనలిచ్చారు. సమావేశంలో జీఎం డీఐసీ ఎ.సుధాకర్, పీసీబీ ఈఈ పి.శ్రీనివాసరావు, ఫ్యాక్టరీల డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఎం.శివకుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రోటరీక్లబ్ ఆఫ్ విజయవాడ ఈస్ట్ ప్రెసిడెంట్ బాయన బాబూజీకి డైమండ్ అవార్డు




**విజయవాడ పశ్చిమ, జూలై 3, (ఆంధ్రప్రత్రిక):** విజయవాడలోని ఎం కన్వెన్షన్ హాలు నందు రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఆర్.వి.సుబ్బారావు (దత్తా) ఆధ్వర్యంలో రోటరీ క్లబ్ తరపున చేసిన సేవలకు గుర్తింపుగా "రోటరీ డిస్ట్రిక్ట్ 3020 అవార్డ్స్ 2023-24" కార్యక్రమము నిర్వహించటం జరిగింది. ఈ కార్యక్రమములో "రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ ఈస్ట్" ద్వారా చేసిన సేవా కార్యక్రమాలకుగాను క్లబ్ ప్రెసిడెంట్ బాయన బాబూజీ(బాబ్జి)కి డైమండ్ అవార్డును రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఆర్.వి.సుబ్బారావు చేతుల మీదుగా అందుకోవటం జరిగింది. అలాగే వివిధ విభాగాలలో క్లబ్ తరుపున నిర్వహించిన కార్యక్రమాలకుగాను మొత్తం 18 అవార్డులను అందుకోవటం జరిగింది. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ ఈస్ట్ ప్రెసిడెంట్ రొ?? శ్రీ బాయన బాబూజీ(బాబ్జి) గారు మాట్లాడుతూ సహచర రోటరీ సభ్యులందరి సహకారంతో తమ క్లబ్ తరుపున నిర్వహించిన సేవా కార్యక్రమాలకు గుర్తింపుగా, అవార్డులను అందుకోవటం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ అవార్డులతో క్లబ్ సేవా కార్యక్రమాలు మరింత విస్తృతంగా నిర్వహించాలనే దృఢ సంకల్పంతో ఉన్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పి.డి.జి. జి.వి. రామారావు , డిస్ట్రిక్ట్ సెక్రటరీ మాలపాక భాస్కర్, అసిస్టెంట్ గవర్నర్ పిళ్ళా మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## పోతిన మహేష్..వాస్తవాలు తెలుసుకుని మాట్లాడు

### జనసేన నాయకురాలు తిరుపతి అనూష



**విజయవాడ పశ్చిమ, జూలై 3, (ఆంధ్రప్రత్రిక):** కొత్తగా వైసీపీలో చేరిన ఉద్యోగి పోతిన మహేష్ ఏ విషయంలోనైనా వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలని జనసేన 42వ డివిజన్ అధ్యక్షురాలు తిరుపతి అనూష హెచ్చరించారు. బుధవారం తన కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడుతు ఫేస్‌బుక్‌లో వచ్చిన ఫోటోలను డౌన్‌లోడ్ చేసి ఆ ఫొటోల ఆధారంగా జనసేన, తెలుగుదేశం, బిజెపి నాయకులపై అసత్య ఆరోపణలు చేయడం సరికాదని అన్నారు. ఉన్మాద ప్రేమికుడు మణికంఠ చేసిన హత్యవిషయంలో ఎన్డీయే కూటమి నాయకులపై అసత్య ప్రచారం చేయడం సరైంది కాదని, ఈ విషయాన్ని మహేష్ గుర్తుంచుకోవాలని సలహాఇచ్చారు. దారెంట పోతున్నవాళ్లు రాజకీయ నాయకులను కలసి ఫోటోలు దిగడం షరా మామూలేనని, అలా రాజకీయనాయకులతో దిగిన ఫోటోల ఆధారంగా హంతకుడు తెలుగుదేశం పార్టీకి చెందిన వాడని ప్రచారం చేయడం దారుణమని అన్నారు.

అదీకాక గత అయిదేళ్లుగా అల్లాడిన ప్రభుత్వ సిబ్బంది ఎన్డీయే కూటమి ప్రభుత్వంలో ఇన్నాళ్లకు నెల మొదటితేదీనే జీతాలు అందుకోవడం పట్ల ప్రభుత్వ ఉద్యోగులు హర్షం వ్యక్తంచేస్తున్న విషయం పోతిన గమనిస్తే మంచిదని అన్నారు. చంద్రబాబు ఇచ్చిన హామీ ప్రకారం పెంచిన ఫించన్లను ఈనెల ఒకటోతేదీనే 95శాతం ఇవ్వడాన్ని ప్రజలు హర్షిస్తున్న విషయం పోతిన మహేష్‌కు తెలియడం లేదా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో అదృశ్యమైన యువతులు, మహిళలను పట్టించుకోని గత వైసీపీ ప్రభుత్వ వైఫల్యాన్ని గుర్తుచేస్తూ నేడు ఎన్డీయే ప్రభుత్వం, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ మహిళల పట్ల ఎంతో శ్రద్ధతో వ్యవహరిస్తూ మహిళల భద్రత పట్ల భరోసా ఇస్తున్నారని అన్నారు. తప్పిపోయిన వారిని ఇళ్లకు చేర్చిన విషయాన్ని వైసీపీ నాయకులు గుర్తుంచుకుని మాట్లాడాలని అనూష స్పష్టంచేసారు. ఈకార్యక్రమంలో జనసేన నాయకులు ఆదిత్యరెడ్డి, పసుపులేటి నాగకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## శివశక్తినగర్‌లో విద్యుత్ సమస్యల నివారణకై ఏఈకి వినతి



**విజయవాడ పశ్చిమ, జూలై 3, (ఆంధ్రప్రత్రిక):** విజయవాడ మిల్క్ ఫ్యాక్టరీ సమీపంలో ఉన్న సి వి ఆర్ ఫ్లై ఓవర్ బ్రిడ్జి పక్కనున్న శివశక్తి నగర్ వాసులు బుధవారం ఉదయం స్థానిక విద్యుత్తు శాఖ ఏ ఈ రామలింగేశ్వరరావు కి తాము ఎదుర్కొంటున్న ఇబ్బందులు తొలగించాలని వినతిపత్రం అందజేశారు. కాస్త వేగంగా గాలి వీచినా శివశక్తి నగర్ ప్రాంతంలో ఉన్న సాయి అమరావతి హైట్స్,అస్త్ర అపార్ట్మెంట్, విఘ్నేష్ హైట్స్ అపార్ట్మెంట్స్ లో విద్యుత్తు సరఫరా కి అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు. అలాగే విద్యుత్తు సరఫరా లో హెచ్చు తగ్గులు వల్ల టీవీ లు, మిక్సీలు ,బల్బులు కాలిపోతున్నాయని తెలిపారు.వేళాపాళా లేకుండా విద్యుత్తు సరఫరా అంతరాయం వల్ల వృద్ధులు, చిన్నారులు, అసౌకర్యానికి గురై నిద్రలేమి రాత్రుళ్ళు గడపాల్సి వస్తోందన్నారు. కాగా సమస్య తీవ్రతను అర్థం చేసుకొన్న ఏ ఈ రామలిగేశ్వర రావు సానుకూలంగా స్పందించారు.

ఉన్నత అధికారులతో మాట్లాడి సకాలంలో సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో సాయి అమరావతి హైట్స్ అసోసియేషన్ కార్యదర్శి కంచు శ్రీనివాసరావు, జాయింట్ సెక్రటరీ కే వెంకట్రావు, విఘ్నేష్ హైట్స్ అపార్ట్మెంట్ అసోసియేషన్ కార్యదర్శి జమ్ము శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## రాజకీయ దాడులకు పాల్పడుతున్నవారిపై కఠినచర్యలు తీసుకోవాలి

### పోలీస్ కమిషనర్‌కు వైసీపీ నాయకుల వినతి



**విజయవాడ పశ్చిమ, జూలై 3, (ఆంధ్రప్రత్రిక):**ఎన్టీఆర్ జిల్లాలో ఎన్నికల తర్వాత జరుగుతున్న రాజకీయ దాడులకు పాల్పడుతున్న వారిపై చట్టపరంగా కఠినమైన చర్యలు తీసుకోవాలని విజయవాడ నగర పోలీస్ కమిషనర్ రామకృష్ణ కి వైసీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు వెల్లంపల్లి శ్రీనివాసరావు, విజయవాడ నగర అధ్యక్షు లు మల్లాది విష్ణు, నగర మేయర్ భాగ్యలక్ష్మి, నందిగామ ఎమ్మెల్సీ మొండితోక అరుణ్ కుమార్, షేక్ ఆసిఫ్, స్వామి దాసు, కైలే అనిల్ కుమార్, తిరుపతిరావు, పోతిన వెంకట మహేష్, పలువురు న్యాయవాదులు వినతి పత్రం అందజేయడం జరిగింది.

## ఉచిత ఇసుక విధానం పట్ల మంత్రి రవీంద్రకు లారీ ఓనర్స్ నాయకుల అభినందన



**విజయవాడ పశ్చిమ, జూలై 3, (ఆంధ్రప్రత్రిక):** ఈ నెల 8వ తేది నుండి రాష్ట్రంలో ఉచిత ఇసుక విధానాన్ని తీసుకువచ్చినందుకు మైనింగ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్రకి లారీఓనర్స్ అసోసియేషన్ నాయకులు అభినందనలు తెలియచేసారు.

బుధవారం మంత్రి రవీంద్రను మర్యాదపూర్వకంగా కలసిన నాయకులు వడ్లమూడి వెంకటేశ్వరరావు, గంగవరపు మురళి మోహన రావు, మాలిశెట్టి శ్రీనివాసరావు, వేమూరి తిరుపతిరావు ,రావేళ్ల నాగేశ్వరరావు ,అల్లు రోశయ్య ,రావేళ్ల రమేష్ ,అంజిరెడ్డి, నాగుల్ మీరా ,ఆడుసుమిల్లి నరేంద్ర తదితరులు మంత్రి రవీంద్రకు కృతజ్ఞతలు తెలియచేసారు. పేదప్రజల సమస్యల పరిష్కారం కోసం తెలుగుదేశం ప్రభుత్వం చేస్తున్న కృషికివారు మంత్రికి తమ కృతజ్ఞతలు తెలిపారు. ఉచిత ఇసుక విధానం వల్ల ప్రజలు, ముఖ్యంగా పేదలు సొంతిల్లు కట్టుకునేందుకు మార్గం సులభమయ్యిందని వారు తెలిపారు.

## శాసనసభ్యులు బోడే ప్రసాద్ విజయోత్సవ ర్యాలీ



**పెనమలూరు, జూలై 3( ఆంధ్రప్రత్రిక):** పెనమలూరు నియోజకవర్గం లోని కుందేరు గ్రామంలో స్థానిక శాసనసభ్యులు బోడే ప్రసాద్ విజయోత్సవ ర్యాలీ కార్యక్రమం నిర్వహించారు. కుందేరు గ్రామంలో ఉన్న తెలుగుదేశం పార్టీ జెండాను ఆవిష్కరించి కేక్ కట్ చేసి కార్యకర్తలకు, నాయకులకు పంచిపెట్టి సంబరాలు చేసుకున్నారు.అనంతరం కుందేరు గ్రామంలో ఉన్న సచివాలయాన్ని సందర్శించి, స్థానిక ప్రజల సమస్యలను తెలుసుకుని, సచివాలయ సిబ్బందికి పరిష్కారం దిశగా ఆదేశాలు ఇవ్వడం జరిగింది.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నాయకులు మాదిగాని గురునాథం, అబీద్ హుస్సేన్, రాజు స్థానిక గ్రామ పార్టీ నాయకులు,మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఫిజియోథెరపిస్టు పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

**బాపట్ల జులై 3 (ఆంధ్రప్రత్రిక) :** బాపట్ల జిల్లాలో ప్రత్యేక అవసరాలు గల విద్యార్థుల కొరకు భవితా కేంద్రాల్లో ఖాళీగా ఉన్న మూడు ఫిజియోథెరపిస్టుల పోస్టుల భర్తీకి దరఖాస్తులు చేసుకోవాలని అడిషనల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎం.వి. సుధాకర్ కోరారు .అద్దె ప్రాతిపదికన పోస్టుల నియామకాలు జరుగుతాయన్నారు.బిపిటి లేదా ఎంపీటీ అర్హత కలిగిన ఆసక్తి గల అభ్యర్థులు అభ్యర్థులు అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ సమగ్ర శిక్ష బాపట్ల కార్యాలయం నందు ఆఫీస్ దరఖాస్తులు పొంద వచ్చు అన్నారు. ఈ నెల 4 నుంచి 8 వరకు కార్యాలయంలో దరఖాస్తులు పొందవచ్చు అని తెలిపారు. పూర్తి చేసిన దరఖాస్తులు అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ సమగ్ర శిక్ష బాపట్ల కార్యాలయం నందు 11 వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు సమర్పించాల్సిందిగా కోరారు.ఎంపికైన అభ్యర్థులకు మూడు మండలాల్లో సేవలు అందించవలసి ఉంటుందని తెలిపారు. పూర్తి వివరాల కోసం సహిత విద్యా విభాగం కోఆర్డినేటర్ సమగ్ర శిక్ష బాపట్ల సంప్రదించాలని అన్నారు.ఇతర వివరాలకు కింది నెంబర్ కు 8500856985 సంప్రదించవలసిందిగా కోరారు.

## సైబర్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



**బాపట్ల జూలై 3 (ఆంధ్రప్రత్రిక) :**సోషల్ మీడియా వేదికల ద్వారా ఆన్‌లైన్ లో పరిచయమయ్యే స్నేహితులను నమ్మి మోసపోవద్దని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ప్రజలకు సూచించారు. సైబర్ స్టాకింగ్ నేరాల గురించి, వాటికి గురికాకుండా ఉండడానికి తీసుకోవలసిన జాగ్రత్తలను గురించి మంగళవారం ఎస్పీ తెలిపారు సైబర్‌స్టాకింగ్ నేరాల పట్ల జిల్లా ప్రజలు అప్రమత్తంగా వుండాలనారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ఒక వ్యక్తిని (లేదా) వ్యక్తుల సమూహాన్ని వేధించడానికి ఫోటోలు, వీడియోలు ఇతర అభ్యంతరకర సందేశాలను ఇ-మెయిల్, ఫేస్ బుక్, ఇన్స్టాగ్రామ్ వంటి ఇతర సోషల్ మీడియాల ద్వారా పంపడం, పంపిస్తామని బెదిరించడం వంటివి సైబర్‌స్టాకింగ్ నేరాల క్రిందికి వస్తాయన్నారు. సైబర్ స్టాకింగ్ అనేది ముఖ్యంగా మహిళలపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. చాలామంది మహిళలు వారి కీర్తి ప్రతిష్టలను, పరువును పోగొట్టుకుంటున్నారన్నారు. సోషల్ మీడియా ఖాతాలను యాక్సెస్ చేయడం ద్వారా ఆన్‌లైన్ కార్యకలాపాలు, వ్యక్తిగత సమాచారాన్ని నేరగాళ్లు తెలుసుకుంటున్నారన్నారు. జీపీఎస్, (లేదా) కొన్ని స్పైవేర్ లను ఉపయోగించి లొకేషన్ ను ట్రాక్ చేస్తున్నారన్నారు. ఏదైనా సోషల్ మీడియాను ఉపయోగిస్తున్నప్పుడు ప్రైవసీ సెట్టింగ్‌ను సెట్ చేసుకోవడం మంచిదని సూచించారు. స్నేహితుల అభ్యర్థనను అంగీకరించే ముందు సోషల్ మీడియాలో ఆ వ్యక్తి యొక్క ప్రామాణికతను తనిఖీ చెయ్యడం మంచిదని తెలిపారు. అవసరం అయినప్పుడే మాత్రమే మొబైల్ లోని జీపీఎస్ వినియోగించాలని, మిగిలిన సందర్భాలలో ఎల్లప్పుడూ జీపీఎస్ ను ఆపివేయడం వల్ల స్టాకర్ మీ లొకేషన్ ను కనుగొనలేరన్నారు.సోషల్ మీడియాలో పరిచయమయ్యే ఆన్‌లైన్ స్నేహితులను నమ్మవద్దన్నారు.ఆన్‌లైన్ లో పరిచయమైన స్నేహితులు మీ ఫొటోలు, వ్యక్తిగత సమాచారం ఇవ్వవలసిందిగా డిమాండ్ చేసిన మీ ఫోటోలు/వీడియో లు ఇతర సమాచారం వారితో పంచుకోవద్దని తెలిపారు. వ్యక్తిగత సమాచారం / ఫోటోలు / వీడియోలను సోషల్ మీడియాలో ఇతరులతో పంచుకోవద్దని తెలిపారు. మీ కార్యకలాపాలను ఆన్‌లైన్‌లో పోస్ట్ చేస్తున్నప్పుడు మీ లొకేషన్ ని ఎవరికి షేర్ చెయ్యవద్దన్నారు.ఎవరైన సైబర్ స్టాకింగ్ నేరాలకు పాల్పడుతున్నా, పాల్పడతారని అనుమానం వచ్చిన ఆలస్యం చెయ్యకుండా వెంటనే మీ దగ్గరలో ఉన్న పోలీస్ స్టేషన్ కి వెళ్ళి ఫిర్యాదు చేయాలని, లేదా సైబర్ హెల్ప్ లైన్ నెంబర్ 1930 కు కాల్ చెయ్యాలని, లేదా నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ www.cybercrime.gov.in లో ఫిర్యాదు చేయాలని ఎస్పీ తెలిపారు.

## గాంధీ బ్యాంక్ ఛైర్మన్ వివక్షతో వ్యవహరిస్తున్నారు

### డైరక్టర్ కళ్ళే నాగేశ్వరరావు ఆరోపణలు



**విజయవాడ పశ్చిమ, జూలై 3, (ఆంధ్రప్రత్రిక):** గాంధీ కో-ఆపరేటివ్ బ్యాంక్ ఛైర్మన్ వేమూరు వెంకట్రావు(చిన్ని) తన పట్ల పూర్తిగా వివక్షత వ్యవహరిస్తున్నారని డైరెక్టర్ కళ్ళే నాగేశ్వరరావు ఆరోపించారు. తాను తెలుగుదేశం పార్టీ రాజకీయాల్లో క్రియాశీలకంగా ఉండటమే ఇందుకు కారణం ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన చేస్తూ తాను గతంలో టిడిపి నేత బుద్దా వెంకన్న సహకారంతో గాంధీ కోపరేటివ్ బ్యాంకు డైరెక్టర్‌గా ఎన్నికైనట్లు ఆయన తెలిపారు. అయితే బ్యాంకు డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన కొద్దికాలంలోనే అక్కడ జరిగే కొన్ని విషయాలపై తనకు అనేక అనుమానాలు, సందేహాలు కలిగాయని చెప్పారు. వీటన్నింటిపై జిల్లా సహకార రిజిస్ట్రార్‌కు ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు. అయితే తనకు కనీస సమాచారం లేకుండానే విచారణ జరిపిన డిఆర్ వాళ్లకి అనుకూలంగా నివేదిక ఇచ్చారని పేర్కొన్నారు. దీనిని తాను తీవ్రంగా వ్యతిరేకించినట్లు నాగేశ్వరరావు పేర్కొన్నారు. బ్యాంకులో వివిధ సబ్ కమిటీలకు డైరెక్టర్లకు చోటు కల్పిస్తారని, అయితే అందరికీ అవకాశం ఇచ్చినప్పటికీ తనకు మాత్రం ఇవ్వడం లేదని ఆయన పేర్కొన్నారు. అదేమంటే నువ్వు తెలుగుదేశం పార్టీ వ్యక్తి అని అంటున్నారని అన్నారు. బ్యాంకు వరకు డైరెక్ట్ గా వ్యవహరించడం తప్ప బయట రాజకీయాల్లో నాకు నచ్చిన పార్టీ లో తిరిగే హక్కు నాకు ఉందని ఆయన చెప్పారు. నూజివీడు హనుమాన్‌జంక్షన్ వంటి చోట్ల బ్యాంకు పేరిట స్థలాలు కొన్నప్పటికీ కనీసం తనకు సమాచారం ఇవ్వడం గానీ, చూపడం గాని లేదన్నారు. అసలు బ్యాంకు సమావేశాలకే తనకు సమాచారం ఇవ్వడం లేదని నాగేశ్వరరావు ఆవేదన వ్యక్తంచేసారు. విశాఖపట్నంలో కొత్తగా ఏర్పాటు చేస్తున్న బ్రాంచ్‌కి రిజర్వ్ బ్యాంక్ అనుమతి లేకుండానే అద్దెకు తీసుకొని చెల్లించడాన్ని తాను తప్పు పట్టినట్టు ఆయన చెప్పారు. అప్పటినుండి పాలకమండలి సమావేశాలకు తనకు సమాచారం ఇవ్వడం లేదన్నారు. గతంలో తన తల్లిగారైన కళ్ళే సీతారావమ్మ పేరిట బ్యాంకు రుణం తీసుకున్నట్లు, ఆమె మరణం తర్వాత బ్యాంకు అప్పు చెల్లించడంతోపాటు ఆమె మరణానికి సంబంధించిన అన్ని డాక్యు మెంట్లు బ్యాంకుకు అందజేసినప్పటికీ ఇప్పటివరకు ఇంటి దస్తావేజులు ఇవ్వడం లేదని తెలిపారు. వీటన్నింటినీ ప్రశ్నిస్తున్నాననే కోపంతో మూడు రోజుల కిందట జరిగిన బ్యాంకు సర్వజనసభలో నేరుగా తనను చంపుతానంటూ ఛైర్మన్ చిన్ని బహిరంగ హెచ్చరికలు జారీ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఛైర్మన్ నుంచి తనకు ప్రాణహాని ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం జోక్యం చేసుకొని బ్యాంకులో జరుగుతున్న అవకతవకలను సరిదిద్దడంతో పాటు తనకు భద్రత కల్పించాలని ఆయన కోరారు.

## డాక్టర్ కామినేని శ్రీనివాస్‌ని మర్యాదపూర్వకంగా కలిసిన మేడెం సత్యనారాయణ

**కలిదిండి జూలై 3( ఆంధ్రప్రత్రిక):**ఏలూరు జిల్లా కైకలూరు నియోజకవర్గం స్థానిక వరహాపట్నం గ్రామంలో తన నివాసం వద్ద డాక్టర్ కామినేని శ్రీనివాస్ గారిని మర్యాదపూర్వకంగా మేడెం సత్యనారాయణ విలేజ్ ఫిషరీస్ అసిస్టెంట్ ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. డెమోక్రటిక్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ గ్రామ వార్డు సచివాలయం ఎంప్లాయిస్ 69/21 ఏలూరు జిల్లా అధ్యక్షుడైన సత్యనారాయణ గౌరవనీయులైన డాక్టర్ ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ గారిని కలిసి , వారి యొక్క సమస్యలను వివరంగా తెలియజేయడం జరిగినది.

దీనిపై స్పందించి వెంటనే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ చైర్మన్ వల్లభనేని శ్రీనివాస్ చౌదరి (నాని ) గ్రామ సర్పంచ్ గూడవల్లి శ్రీనివాసరావు, కురెళ్ళ శ్రీనివాసరావు, మారగా ని శ్రీనివాసరావు, దేశి నాగబాబు, తాతరాజు ఎన్డీఏ కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు .


## బహిరంగ వేలం ప్రకటన

### బాపట్ల పురప్రజలకు విజ్ఞప్తి

బాపట్ల పురపాలక సంఘమునకు సంబంధించిన ఇందిరా గాంధీ మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్సు నందలి షాపు నెం. 13, రాజీవ్ గాంధీ మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్సు నందలి షాపు నెం.4,11,14 మరియు 17 యన్.టి.ఆర్.కూరగాయల మార్కెట్ లోపలి స్టాల్స్ 1 నుండి 76 వరకు రోజువారి అద్దెలు వసూలు చేసుకొనుట లేదా స్టాల్స్ వ్యక్తిగతముగా మూడు సంవత్సరముల కాలమునకు లీజుకు ఇచ్చు నిమిత్తం ది.06.07.2024వ తేదిన శనివారం ఉదయం గం// 11.00లకు పురపాలక సంఘ కార్యాలయములో కమీషనరు గారిచే కాని, లేదా వారి అనుమతి పొందిన అధికారిచే కాని, బహిరంగ వేలం పాట నిర్వహింపబడును. ఇతర వివరముల కొరకు కార్యాలయము పని చేయు వేళలలో సంబంధిత విభాగము వారిని సంప్రదించి తెలుసుకొనగలరు.

కమీషనరు
బాపట్ల పురపాలక సంఘం

# వైసిపి ఉప్పుదప్పుడు ఉపన్యాసాలతో పాలన

– మండల స్థాయి అధికారుల సమీక్ష సమావేశం



**ఎమ్మిగనూరు, జూలై 3 (ఆంధ్రపత్రిక):** గత వైసిపి ప్రభుత్వంలో మౌలిక సదుపాయాలు అత్యంత తాగునీరు. శుభ్రత పరిశుభ్రత కావల్సిన కేవలం ఉప్ప దుప్పుడు ఉపన్యాసాలతో ప్రజలకు పాలనను అందించారు. పరిశుభమైన నీటి అందించే దశలో తాత్కాలికంగా వున్న నిధులతో శాశ్వత పరిష్కారం రెండేళ్లలో సరిదిద్దుతానని ఎమ్మెల్యే బివి జయ నాగేశ్వర రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల పరిషత్ సమావేశ భవనం నందు యంపిడిఓ ఎ. కొండన్న ఆధ్వర్యంలో ఎమ్మెల్యే బివి జయ నాగేశ్వర రెడ్డి నేతృత్వంలో మండల స్థాయి అధికారులతో మండల గ్రామాల్లో అభివృద్ధి పనులు. తాగునీటి. పరిశుభ్రత జరిగిన వాటిపై క్లుప్తంగా సమీక్ష సమావేశం నిర్వహించారు. ముందుగా ఆర్డబ్ల్యుఎస్ ఏఈ ప్రేమ్ కుమార్ మాట్లాడుతూ జల జీవన్ మిషన పథకం కింద మంజూరైన 48 వర్కులకు సుమారుగా 24 కోట్ల 74 లక్షల రూపాయలు మంజూర య్యాయి. అందులో 23 వర్కులకు టెండర్లు ద్వారా పైపులైన్లు పూర్తి చేసినట్లు తెలిపారు. మిగిలిన 16 వర్కులు కాంట్రాక్టర్లు సరిగా పనులు ప్రారంభం చేయలేక నిలిపివేశామని తెలిపారు. 28 వర్కుల కు ప్రతిపాదనలు సిద్ధం చేసి ఉన్నతాధికారులు పంపడం జరుగు తుందని తెలిపారు. పిఆర్ ఏఈ శివశంకర్ మాట్లాడుతూ మండలం లో ఉపాధి హామీ పథకం కింద గ్రామ సచివాలయాలు. రైతుబోరసా కేంద్రాలు. హెల్త్ క్లీనిక్ మొత్తం 46 భవన నిర్మాణా పనులు చేపట్టా మన్నారు. అందులో గ్రామ సచివాలయాలు 23 గాను 16 పూర్తి స్థాయిలో నిర్మాణ పనులు చేపట్టామన్నారు. రైతు భరోసా కేంద్రాలు 22 గాను 11 భవనాలు పూర్తిగా చేశామన్నారు. హెల్త్ క్లీనిక్ కేంద్రాలు 21 మంజూరు అందులో 8 భవనాలు పూర్తి చేశామన్నారు. మిగిలిన వాటిని పూర్తి చేసేందుకు అనుమతి కోసం ఎదురు చేస్తున్నామన్నారు. అలాగే రోడ్డు పనులకు 65 లక్షల ఐదు వర్కులకు మంజూరు అయ్యాయి. వాటిని పూర్తి చేయడం జరిగింది. గడప గడపకు జీజీఫ్ కింద 104 వర్కులకు 3 కోట్ల రూపాయల మంజూరు. అందులో 66 వర్కులు పూర్తి చేశామన్నారు. మిగిలిన 38 వర్కులు వున్నాయి. వివిధ గ్రామా ల్లో పనులు చేపట్టారు మిగిలిన పనులకు తదుపరి పనులు అనుమతి తర్వాత చేపట్టనున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడు తూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జలజీవన్ మిషన్ పథకం కింద గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న మంచినీటి సరఫరా చేయాలని ఉద్దేశంతో ప్రతి ఇంటికి కొళాయి తెచ్చే ప్రాజెక్టు వున్నా ప్రయోజనం లేకుండా పోయింది. తాగడానికి నీరు లేక గ్రామాల్లో ప్రజలు ఎంత ఇబ్బందులు పడుతున్నారు. ఎక్కడ గ్రామంలో చూసి నా ఒక చుక్క నీరు లేకపోవడానికి కారణం ఇష్టారాజ్యంగా చేశారని తెలుస్తోంది. తుంగభద్ర కాలవ ద్వారా తప్పా నిల్వ చేసుకోవడానికి దుస్థితి నెలకొందన్నారు. జల జీవన్ మిషన్ పథకం ద్వారా కనీస ఆలోచన విధానం లేకుండా కేవలం డబ్బులు దండు కోవడానికి ఇష్టం వచ్చినట్లు చేశారన్నారు. సంబంధం లేని పరిస్థితుల్లో ఇష్టారాజ్యంగా పనులు వ్యవహరించి చేతికి అందనంత దోచుకొని అధికారులు సమాధానం చెప్పడానికి నీళ్లు నములుతున్నారన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం జవాబుదారితనంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సారథ్యం లో కూటమిని ప్రజలు ఆశీర్వాదించారు. నన్ను ఎమ్మెల్యేగా ఆశీర్వాదించారు. అత్యంత ప్రథమ ముఖ్య కర్తవ్యం నియోజకవర్గ పరిధిలోని ఎమ్మిగనూరు. గోనెగండ్ల. నందవరం మండలాల్లో మంచినీటి కోసం ఎదుర్కొంటున్న ప్రతి ఒక్కరికీ పరిశు భమైన నీటిని అందించేందుకు కృషి చేస్తానన్నారు ఈ కార్యక్రమంలో ఆర్డబ్ల్యుఎస్ డిఈఈ సాంబయ్య. ఈఓ ఆర్డీ విజయ లక్ష్మి. ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ రఘువీర. సిడిపిఓ సపర్నబేగమ్. వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు

### విద్యాసంస్థల బంద్‌ను

# జయప్రదం చేయాలి



**పొన్నూరు, జులై 03 ఆంధ్ర పత్రిక :** దేశ వ్యాప్తంగా విద్యాసంస్థల బంద్ జయప్రదం చేయాలని కోరుతూ ఒక ప్రకటలో తెలి పారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం కిరణ్ మాట్లాడుతూ నీట్ పరీక్ష లో జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణ చేపట్టి నిందితులను కఠినంగా శిక్షించాలని అన్నారు. నీట్ పరీక్షలు రద్దుచేసి రాష్ట్రాలే పరీక్షలు నిర్వహించుకునే విధంగా ఆదేశాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. జీవో నెంబర్ 77 నీ వెంటనే రద్దు చేయాలి. ప్రభుత్వ పాఠశాలలకు పాఠ్య పుస్తకాలు అందించాలి. విద్యార్థుల భవిష్య త్తును దృష్టిలో పెట్టుకొని వెంటనే టీచర్ పోస్టులను ఖాళీలను తాత్కాలిక పద్ధతిలో భర్తీ చేయాలి కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలి. ఇటీవల నీట్ నెట్ పరీక్షలు రాసిన విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం న్యాయం చేయాలి. దేశవ్యాప్తంగా పాఠశాల మూసివేతను ఆపివేయాలి నీట్ పరీక్ష విధానాన్ని రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో తీర్మానం చేయాలి. ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజులు నియంత్రణ చట్టం చేయాలి అని డిమాండ్ చేస్తూ ఈ బంద్ దేశ వ్యాప్తంగా జరుగుతుందని ఈ బంద్ ని పొన్నూరు పట్టణంలోని పాఠశాలకు కళాశాలలకు నోటీసులు ఇవ్వడం జరిగింది. విద్యార్థులు యాజమాన్యాలు తల్లిదండ్రులు సహకరించి బందును జయప్రదం చేయాలని కోరారు.

### నారా లోకేష్‌ను కలిసిన

# టిడిపి యువనేత ఎన్ పి విక్రమ్ బృందం



**బంగారుపాళ్యం–జూలై 3(ఆంధ్రపత్రిక):** చిత్తూరు జిల్లా పూతలపట్టు నియోజకవర్గం బంగారుపాళ్యం మండలం నలగాంపల్లి గ్రామానికి చెందిన ఎన్నారై టిడిపి యువనేత ఎన్.పి.విక్రమ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం లో కూటమి ప్రభుత్వం రావడం నారా లోకేష్ మంత్రి అయిన సందర్భంగా బుధవారం ఆయన్ని కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బెజవాడ నవీన్,చందు,భార్గవ్,దుర్గ చౌదరి, సాయిగణేష్,పూర్ణ తదితరులు పాల్గొన్నారు.

# మృతి చెందిన విలేఖరు కుటుంబానికి లక్ష ఆర్థిక సహాయం



**కొయ్యలగూడెం, జూలై 4 ఆంధ్రపత్రిక:** కామ వరపుకోట మండలంలో విశాలాంధ్ర విలేఖరిగా విధులు నిర్వహిస్తున్న తాడిగడప రాము ఈ మధ్యకాలంలో అనారోగ్యానికి గురై మృతి చెంద డం జరిగింది. ఈ విషయం తెలుసుకున్న కొయ్యలగూడెం మండలం బయ్యన్నగూడెం గ్రామానికి చెందిన నాటకశాల వెంకటరాజు విషయం తెలుసుకుని వెంటనే స్పందించి కుటుంబ సభ్యులను పరామర్శించి లక్ష రూపా యలు ఆర్థిక సహాయంగా అందించడం జరిగింది అంతేకాకుండా మృతి చెందిన రాముకి ఒక కుమార్తె ఒక కుమారుడు ఉండగా వారు చదువుకునేందు అయ్యే ఖర్చులను అందిస్తానని హామీ ఇవ్వడంతో పుట్టెడు దుఃఖంలో ఉన్న ఆ కుటుంబంలో వెలుగులు నింపిన వెంకటరాజును ఎంతగానో ప్రజలు అభినందించారు.

# పారిశుద్ధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివి

–గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్



**గూడూరు, జూలై 3, ఆంధ్రపత్రిక:** పారిశుద్ధ కార్మికుల సేవలు వెలకట్టలేనివని గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ పేర్కొన్నారు. బుదవారం గూడూరు పట్టణంలోని పురపాలక సంఘ కార్యాలయం అవరణంలో పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులు, చెప్పులు, కొబ్బరి నూనె, సబ్బులు, గ్లౌజులు, తదితర వస్తువులను అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికులు రాత్రనక పగలన క ప్రజల కోసం సేవలు అందిస్తున్నారు అన్నారు. కార్మికులకు ఎంత చేసినా తక్కువేనని పేర్కొన్నారు. కార్మికుల సమస్యలను ఎప్పటికప్పుడు తన దృష్టికి తీసుకు వస్తే పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. స్వచ్ఛ గూడూరు కి సహకరించాలని పారిశుద్ధ కార్మికులను విజ్ఞప్తి చేశారు. గత పాలకుల నిర్లక్ష్యం వలన గూడూరు మున్సిపాలిటీ కుంటుపడిపోయింది అన్నారు. మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పురపాలక కమిషనర్ వెంకటేశ్వర్లు, పులిమి శ్రీనివాసులు, వెంకటేశ్వర రాజు, శీలం కిరణ్ కుమార్, పిట్టి నాగరాజు వాటం బెడు శివ కుమార్, చాన్ బాషా, ఇజ్రాయిల్ కుమార్, గాయం రమణయ్య, రవీంద్ర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ద్రౌపది కల్యాణోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే



**బంగారుపాళ్యం–తవణంపల్లి–జూలై 3(ఆంధ్రపత్రిక):** చిత్తూరు జిల్లా తవణంపల్లి మండలం దిగువ మోఘం పంచాయతీలో జరుగుతున్న మహాభారత యజ్ఞంలో భాగంగా బుధవారం ద్రౌపధమ్మ కల్యాణో త్సవం నిర్వహించడం జరిగింది. ఈ కల్యాణోత్సవానికి ముఖ్య అధితిగా స్థానిక ఎమ్మెల్యే కలికిరి మురళీ మోహన్ పాల్గొని అమ్మవారిని దర్శించుకోవడం జరిగింది. గ్రామస్తులు ఎమ్మెల్యేకి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో దిగువమోఘం పంచాయతీ ప్రజలు, చుట్టుపక్కల గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# స్థిరంగా శ్రీశ్రీశ్రీ సిద్ధేశ్వరానందభారతీ స్వామి ఆరోగ్యం

**విజయవాడ, జులై 03 ఆంధ్రపత్రిక :** పరమహంస, పరివ్రాజకాచార్యులు, కుర్తాళం శంకరాచార్యులు, నడిచే దైవం, మంత్ర స్వరూపులు, పూజ్య శ్రీశ్రీశ్రీ సిద్ధేశ్వరానందభారతీ మహాస్వామి వారికి 02/07/2024 తేదీన చెన్నైలోని కావేరీ వైద్య సంస్థలో ఆరోగ్య పరీక్షలను నిర్వహించారు. అందులో భాగంగా Coronary Angiography నిర్వహించిన వైద్య నిపుణులు పరమపూజ్య స్వామివారికి Elective Angioplasty చికిత్సను అందించారు. ప్రస్తుతం పరమపూజ్య స్వామివారు ఆరోగ్యం స్థిరంగా (Hemodynamically stable) ఉన్నదని వైద్యులు తెలిపారు. పరమపూజ్య స్వామి వారు వైద్యుల పర్యవేక్షణలో పూర్తి విశ్రాంతిలో ఉన్నారు. దయచేసి భక్తులెవరూ ఈ విషయం గురించి వ్యక్తిగతంగా / ఫోన్ కాల్స్ ద్వారా పీఠమును మరియు పీఠ సిబ్బందిని యిబ్బంది కలిగించవద్దని మనవి.

# ఐసిడిఎస్ పీడీగా నాగమల్లేశ్వరి

**హిందూపురం, జులై 3 (ఆంధ్రపత్రిక) :** శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ వారి ఆదేశాల మేరకు మహిళా భివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా ఎం.నాగమల్లేశ్వరి పూర్తి అదనపు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా నాగమల్లేశ్వరి పీడీగా బాధ్యతలు స్వీకరించడం జరిగింది. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది వారికి పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పిడి మాట్లాడుతూ అందరం కలిసికట్టుగా పనిచేసి జిల్లాకు మంచి పేరు తెచ్చే విధంగా కృషి చేస్తారని తెలియజేశారు.

### కర్ణాటక మంత్రి శ్రీరాములుని

# కలిసిన కొత్తపల్లి మహేంద్ర



**బంగారుపాళ్యం–జూలై 3(ఆంధ్రపత్రిక):** చిత్తూరు జిల్లా పూతలపట్టు నియోజకవర్గం బంగారుపాళ్యం మండలం తగ్గువారిపల్లి పంచాయతీకి చెందిన వైసిపి జిల్లా యువత ఉపాధ్యక్షుడు కొత్తపల్లి మహేంద్ర కర్ణాటక రాష్ట్ర ఆరోగ్య రవాణాశాఖ మంత్రి శ్రీరాములుని బుధవారం బెంగుళూరులోని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలవడం జరిగింది. ఈ కార్యక్రమంలో మహేంద్ర స్నేహితుల బృందం పాల్గొన్నారు

### అచ్చుతాపురంలో

# నీటి సమస్యకు తాత్కాలిక పరిష్కారం



**గోకవరం, జూన్ 3 ఆంధ్రపత్రిక :** గోకవరం మండలం అచ్చుతాపురం గ్రామంలో త్రాగునీటి సమస్యపై జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ జోక్యంతో సమస్య తాత్కాలిక పరిష్కార చర్యలు తీసుకున్నారు. నీరు లేక ప్రజలు చాలా ఇబ్బంది పడుతున్నారని, నీరు కలుషితమవుతున్నదని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లడంతో, ఎమ్మెల్యే నెహ్రూ స్థానిక ఎంపీపీ సుంకర శ్రీవల్లి వీరబాబుకు సమస్య పరిష్కారం కోసం సూచనలు చేశారు. దీంతో బుధవారం ఎంపీపీ సుంకర శ్రీవల్లి వీరబాబు, ఎండిఓ గోవింద్, ఆర్డబ్ల్యుసి జేఈ, ఎస్సీ పేట సందర్శించిగా అక్కడున్న ప్రజలు స్థానిక నాయకులు వాటర్ ట్యాంక్ నిర్మించవలసింది గా విజ్ఞప్తి చేశారు. శాశ్వత పరిష్కారం అయ్యేవరకు, ప్రస్తుతం ప్రజలకు ఇబ్బంది లేని విధంగా, బోరు కొట్టి పైపులైను కనెక్షన్ ఇవ్వవలసిందిగా ఎంపీపీ అధికారులను ఆదేశించారు. రెండు రోజుల్లో ఈపనులు ప్రారంభిస్తామని వారు హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ బత్తుల వెంకట రామకృష్ణ, ఎంపీటీసీ కొత్తపల్లి చిన్నబాబు, టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షుడు కోలా వెంకటేశ్వరరావు, గ్రామ టిడిపి నాయకులు పిట్టా అరుణ్, కొత్తపల్లి సత్యనారాయణ, లంక పెదవంకన్న, పెనుముచ్చ అచ్చయ్య, ఆర్డబ్ల్యుసి జేఈ హరే రామ్, పంచాయతీ కార్యదర్శి గోపన్న దొర, సచివాలయం సచివాలయ కార్యదర్శి ప్రణవ్, పంచాయితీ, సచివాలయ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### విద్యుత్ షాక్‌తో

# అడపా ప్రేమ్ కుమార్ (జీవన్) మృతి

**అయినవిల్లి,జూలై 3(ఆంధ్రపత్రిక):** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అయినవిల్లి మండలం వీరవల్లిపాలెం గ్రామంలో నిరుపేద కుటుంబం కు చెందిన అడపా ప్రేమ కుమార్(29) (జీవన్) విద్యుత్ షాక్ వలన మరణించినారు. ప్రేమ కుమార్ కు వివాహమై ఐదు సంవత్సరములు అయినది. భార్య ఇద్దరు మగ పిల్లలు పైగా నాలుగు సంవత్సరంలోపు పిల్లలు. వారి కుటుంబమునకు జీవనాధారం ఏమి లేదు అగమ్య గోచనముగా ఉన్నది. అయినవిల్లి ఎస్సై రాజేష్ కి ఫిర్యాదు చేసి అమలాపురం ఏరియా ఆసుపత్రికి శవ పంచ నామ నిమిత్తం తీసుకుని వెళ్ళినారు. పోస్టుమార్టం ఆసుపత్రి వద్ద సర్పంచ్ సలాది బుచ్చిరాజు మరియు మండల వైస్ ప్రెసిడెంట్ అడపా వెంకట నాగభూషణం వీఆర్వో ఎస్.సీతాదేవి గ్రామ పెద్దలు ఉన్నారు. మృతుడి యొక్క జీవనాధారం కూలి పని.

### రామమోహనరావు ఆధ్వర్యంలో

# విశ్వనట చక్రవర్తి యస్వీఆర్ జయంతి వేడుకలు



**విజయవాడ, జులై 03 ఆంధ్రపత్రిక :** బేతు రామమోహనరావు మాట్లాడుతూ విశ్వ నట చక్రవర్తి, విశ్వ విఖ్యాత నట సార్వభౌముడు, విదేశాల్లో గుర్తింపు పొందిన తొలి తెలుగు నటుడు, కాపు జాతి అణిముత్యం రంగారావు జయంతి సందర్భంగా ఆ మహానటుడ్ని స్మరించుకుంటూ..నాయకుడి పాత్రకు దీటుగా ప్రతి నాయకుడి పాత్ర పోషిస్తూ.. మంచి ఆరోగ్యకరమైన పోటీతో, సినిమాను రక్తికట్టిస్తూ..రంగారావు గారు లేనిదే ఈ సినిమాలో జీవం లేదు అనే స్థాయికి తెచ్చి.. ప్రేక్షక హృదయాల్లో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుని వారిచేత జేజేలు కొట్టించుకున్న నట యశస్వి బిరంగారావుకి పూల మాల వేసి ఘన నివాళులు సమర్పించు కుంటు న్నాము.ఎస్ వీ ఆర్ నిలువెత్తు విగ్రహం, గంభీరమైన స్వరం, స్పష్టమైన డైలాగ్ డెలివరి అద్భుతమైన నటన బిరంగారావు సొంతం.ఎటువంటి పాత్రలోకైనా పరకాయ ప్రవేశం చేసి విశ్వనట చక్రవర్తిగా తెలుగు ప్రజల హృదయాలలో నిలిచిన మహానటుడు. "అడవిలో ఉన్నా, బోనులో ఉన్నా పులి, పులేరా డోంగ్రీ" అని ఆయన చెప్పిన డైలాగ్ ఇప్పటికీ గుండెల్లో మోగు తోంది.ఆయన కృష్ణా జిల్లా లోని నూజివీడులో 1918 జూలై 3వ తేదీన లక్ష్మీ నరసాయమ్మ, కోటీశ్వరనాయుడులకు ఎస్వీ రంగారావు జన్మించాడు. ఆ మహానటునికి శతసహస్ర అభివందనములు. అంతర్జాతీయ స్థాయి కీర్తి పొందిన మన ఎస్వీఆర్ పేరున భారత ప్రభుత్వం 2013లో 500 పోస్టల్ స్టాంపు విడుదల చేసింది.అటువంటి మహానటుడు యస్వీఆర్ జయంతికి శుభాకాంక్షలు తెలియ చేస్తున్నాము అని బేతు రామమోహనరావు అన్నారు.ఈ కార్యక్రమంలో కాపు నాయకులు చలమలశెట్టి శ్రీనివాస్,వెలుగంటి లక్ష్మణరావు,ఉమ్మడిశెట్టి కృష్ణమూర్తి, అల్లమళ్ళ సుబ్రహ్మణ్యం, భూపతి మహేష్,వివిధ సంఘాల నాయకులు డీవీ ఎస్ ఎన్ మూర్తి, మల్లెంపూటి శంకర్,భీమరావు తదితరులు పాల్గొన్నారు.

### మల్లపరాజుగూడెం హైస్కూల్ నందు

# విద్యార్థులకు కిట్స్ పంపిణీ



**బంటుమిల్లి, జూలై 3(ఆంధ్రపత్రిక):** మండలంలోని మల్లప రాజు గూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశా ల నందు విద్యార్థులకు గ్రామ సర్పంచ్ దూసనపూడి అవతారం మరియు జడ్పీటీసీ మలిశెట్టి వెంకటర మణ మరియు గ్రామ పెద్దల చేతుల మీదుగా రాష్ట్ర ప్రభుత్వం ద్వారా సరఫరా చేయబడిన స్టూడెంట్స్ కిట్స్,పుస్తకాల పంపిణీ కార్యక్రమం జరిగింది. కార్పొరేట్ మరియు ప్రైవేట్ పాఠశాలల్లోని విద్యార్థుల వసతులకు దీటుగా ప్రభుత్వ బడుల్లో చదివే విద్యార్థిని విద్యార్థులు నేడు పొందుతున్నారని, పదవ తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణత విషయంలోనూ ప్రభుత్వ బడులు ముందంజలో ఉన్నాయని ఈ కార్యక్రమంలో ప్రసంగించిన పెద్దలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో దూసనపూడి అవతారం, దూసనపూడి రమేష్, దూసనపూడి సుబ్బయ్య, దూసనపూడి దేశికర్. మలిశెట్టి రాజబాబు, మలిశెట్టి వెంకటరమణ జెడ్ పి టి సి, పాలడుగు బాబూరావు, గెడ్డం మల్లికార్జునరావు, పుప్పాల రాజమోహన్ రావు, ఉమ్మడిశెట్టి వీర వెంకటేశ్వరరావు, మెండు సత్యనారాయణ, గుండాబత్తుల రామకృష్ణ, మరియు విద్యార్థులు వారి తల్లిదండ్రులు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

### సీజనల్ వ్యాధుల నివారణకు

# ఆసుపత్రి వైద్యులతో సమీక్ష



**కోరుకొండ, జూలై 3 (ఆంధ్రపత్రిక) :** జిల్లా అదనపు వైద్యాధికారిణి, జిల్లా కుష్టు, క్షయ, ఎయిడ్స్ నివారణాధికారిణి డాక్టర్ వసుంధర కోరుకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆసుపత్రి డాక్టర్ సిబ్బందితో వివిధ అంశాలపై సమీక్షించారు. సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గ్రామాలలో ఓవర్ హెడ్ ట్యాంకులు జిఎల్ఆర్ ట్యాంకులు శుభ్రం చేయించి, క్లోరినేషన్ చర్యలు తీసుకోవాలన్నారు. డయేరియా, ఫీవర్ కేసులను సకాలంలో క్షేత్రస్థాయి సిబ్బంది గుర్తించి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించాలన్నారు. ఈనెల 18 నుండి ఆగస్టు రెండు వరకు జరిగే లెప్రసీ కేసుల (ఎల్ సిడిసి) సర్వే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. అనుమానిత చర్మవ్యాధులు, లెప్రసీ, ఎయిడ్స్ కేసులను ప్రత్యేక శ్రద్ధతో చూడాలన్నారు. డాక్టర్ వసుంధర అడిగి తెలుసుకున్నారు. హాస్టల్ విద్యార్థులకు అందుతున్న వైద్య సదుపాయాలపై వివరాలు, ఆరోగ్య పరిస్థితులపై అడిగి తెలుసుకున్నారు. ఈకార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ ప్రజ్ఞ, డాక్టర్ జ్ఞానచంద్ర, డాక్టర్ సునీల్, హెల్త్ సూపర్వైజర్స్ భారతీ, లక్ష్మీకాంతం, సిబ్బంది పాల్గొన్నారు.

# కృషి పట్టుదల విజయానికి తొలిమెట్టు

## సెయింట్ జాన్స్ పూర్వ విద్యార్థి ఇప్పుడు పెడన నియోజకవర్గానికి శాసనసభ్యుడు: ఎం.ఎల్.ఎ. కాగిత కృష్ణ ప్రసాద్





**బంటుమిల్లి జూలై 3 (ఆంధ్రపత్రిక):** బంటుమిల్లి సెయింట్ జాన్స్ హైస్కూల్ లో చదివిన పూర్వ విద్యార్థి కాగిత కృష్ణ ప్రసాద్ ను బంటుమిల్లిలోని సెయింట్ జాన్స్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ యాజమాన్యం, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కాగిత కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ తాను సెయింట్ జాన్స్ హైస్కూల్ లో 10 వ తరగతి వరకు చదువుకున్న రోజుల్లో తాను సరిగా చదవక పోతే ఉపాధ్యాలు తనను మందలించేవారని వారు ఆవిధంగా చేయడంవల్లనే తాను ఇంతవాడను అయ్యానని చెప్పారు. క్రమశిక్షణ, కృషి పట్టుదల, గురువుల దీవెనల వల్ల మనం ప్రయోజకులు అవుతామని అన్నారు. తన తండ్రి దివంగత కాగిత వెంకటరావు ఎం.ఎల్. ఏ.గా పనిచేశారని ఆయన ఉన్నత పదవులలో రాణించారని పేర్కొన్నారు. తాను గత ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా ఓటమి చెందినప్పటికీ ఏమాత్రం నిరుత్సాహం చెందలేదని, ప్రజలతో మమేకం అయి వారి అభిమానాన్ని పొందానని, ప్రస్తుత ఎన్నికలలో గెలుపొందానని చెబుతూ తన విజయానికి కృషి చేసిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. పెడన నియోజక వర్గంలో ప్రజాసమస్యలు పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సెయింట్ జాన్స్ హైస్కూల్ యాజమాన్యం సాబు జాన్, ఆయన సతీమణి జాన్సీ, ఉపాధ్యాయులు శాసన సభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్ ను సన్మానించారు. ఈ సందర్భంగా జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను అలరించాయి. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విశ్వనాథ్, షౌకత్, తిరుమల, శేషగిరి, రాంబాబు, మౌళీ, రాజేశ్వరీ మేడం, మరియు స్కూల్ విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

### ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును మర్యాదపూర్వకంగా కలిసిన ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు



**తిరువూరు జూలై 3( ఆంధ్రపత్రిక):** ముఖ్య మంత్రి నారాచంద్రబాబు నాయుడును సచివాలయంలోబుధవారం తిరువూరుఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు నేతృత్వం లో మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియచేసిన దివంగత కంచి రామారావు తనయుడు,టిడిపి యువనేత కంచి రఘు ప్రవీణ్, టిడిపి సీనియర్ నాయకులు చెరుకూరి రాజేశ్వరరావు.

### నియోజకవర్గంలో డ్రైనేజీ వ్యవస్థను అభివృద్ధి చేయండి...

#### తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే నసీర్



**గుంటూరు , జులై 3 ( ఆంధ్రపత్రిక ):** గుంటూరు తూర్పు నియోజకవర్గం లో డ్రైనేజీ వ్యవస్థ అధ్వాన స్థితిలో ఉందని, దీనిని పూర్తిగా మెరుగుపరచవలసిన అవసరం ఉందని ఎమ్మెల్యే నసీర్ అన్నారు. బుధవారం బాలాజీ నగర్ లోని రాజీవ్ గృహకల్ప పరిసర కాలనీలను పర్యటించి అక్కడ డ్రైనేజీ వ్యవస్థ అధ్వానంగా ఉన్న తీరుని తెలుసుకున్నారు. వెంటనే మొండిగేటు రైల్వే ట్రాక్ క్రింద ఉన్న డ్రైనేజీ వాగు ఇరుకుగా ఉన్నందువల్ల మురుగనీటి పారుదల సక్రమంగా జరగట్లేదని మొండి గేటు వాగుని నగరపాలక సంస్థ అధికారులతో కలసి పరిశీలించారు. వెంటనే ఈ డ్రైనేజీ కాలువ అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధంచేయ వలసిందిగా సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రతిపాదనలు సిద్ధమైన వెంటనే మున్సిపల్ శాఖ మంత్రి మరియు రైల్వే అధికారులతో కలిసి నిధులు మంజూరు చేయించి అభివృద్ధి పనులు చేపడతామని ఎమ్మెల్యే నసీర్ తెలిపారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ అధికారులు ఈఇ కోటేశ్వరరావు, ఏఈ సునీల్ తెలుగుదేశం పార్టీ జనసేన బిజెపి నాయకులు కార్యకర్తలు ఎమ్మెల్యే నసీర్ వెంట ఉన్నారు.

### బంటుమిల్లిలో ఘనంగా మెకానిక్ డే వేడుకలు

#### పాల్గొన్న పెడన శాసనసభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్



**బంటుమిల్లి ,జులై 3 ( ఆంధ్రపత్రిక ):** బంటుమిల్లి గ్రామంలో యువ గణేష్ మోటర్ సైకిల్ మెకానికల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మెకానిక్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో పెడన నియోజకవర్గ శాసనసభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి మనిషి దైనందిన జీవితంలో మోటార్ సైకిల్ లేనిదే పని జరగని పరిస్థితి ఈ రోజు నెలకొందని, మోటార్ సైకిల్ మెకానిక్ ల న్యాయపరమైన డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటిని పరిష్కరిస్తానని, ఈ బంటుమిల్లిలో మోటార్ సైకిల్ మెకానిక్ ల కొరకు ఒక కమ్యూనిటీ హాల్ ఏర్పాటుకు కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆయన హామీ ఇచ్చారు. ఈ సందర్భంలో యువ గణేష్ మోటార్ సైకిల్ మెకానికల్ గౌరవ సలహాదారుగా రాజేష్ ను నియమించి ఆ నియామక పత్రాన్ని కాగిత కృష్ణ ప్రసాద్ చేతుల మీదుగా అందించడం జరిగింది.

ఈ కార్యక్రమంలోఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ ని శాలువా మరియు పూలమాలతో సత్కరించిన యూని యన్ నాయకులు మరియు కార్యవర్గ సభ్యులు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు కూనపురెడ్డి వీరబాబు, రేవు గోపాలకృష్ణ, రేవు శ్రీనివాస రావు, బొర్ర కాశి, సూజ్ఞానం నాగేశ్వర రావు, మైనారిటీ సెల్ నాయకుడు భజాన్ ఖాన్, సన్నాల ప్రసాద్, వనేంరెడ్డి కొండ, బదుగు వంశీ , తెలుగుదేశం, జనసేన, బిజెపి ముఖ్య నాయకులు కార్యకర్తలు, బంటుమిల్లి మండలంలోని మోటా ర్ సైకిల్ మెకానిక్‌లు పాల్గొన్నారు.

## పశ్చిమ నియోజకవర్గంలో పారిశుధ్యానికి తొలి ప్రాధాన్యం

### పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి



**గుంటూరు : జులై 3 ( ఆంధ్రపత్రిక ):** గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని పారిశుధ్యానికి తొలి ప్రాధాన్యం ఇస్తున్నాని, అధికారులు తనకు సహకరించాలని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యురాలు తెలిపారు. బుధవారం గుంటూరు పశ్చిమ నియోజకవర్గం 18వ డివిజన్ లో రామ నామక్షేత్రం శ్రీనివాస్ రావు పేట,వెంగళ్ శెట్టి వారి వీధి, అడపా బజార్, మొహిద్దీన్ పాలెం, వడ్డే గూడెంలో ఉదయం 6.00 గంటలకే డివిజన్ పర్యటనకు గళ్ళా మాధవి శ్రీకారం చుట్టారు. స్వయంగా ద్విచక్ర వాహనమును నడుపుతూ, డివిజన్ లోని ప్రధాన వీధులతో పాటు, సందులలో పర్యటించి ప్రజాసమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భముగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ 18 డివిజన్ లో ప్రధానంగా తనకు డ్రైనేజి, వీధి దీపాలు, మంచి నీటి పైపుల లీకులురోడ్లు వంటి ప్రజాసమస్యలు తన దృష్టికి వచ్చాయని, క్షేత్ర స్థాయిలో దీనిని పరిశీలించుటకు తాను వచ్చినట్లు తెలిపారు.మంచి నీటి పైపు లైన్ లో మురుగు నీరు కలవటం వలన డయేరియా వంటి ప్రాణాంతక రోగాలు ప్రబలిన ఘటనలను గత ప్రభుత్వంలో చూశామని, ఇప్పుడు అటువంటి ఘటనలు జరగటానికి వీలు లేదని, అధికారులు వీటి మీద దృష్టి పెట్టాలని వర్షాకాలం దృష్ట్యా డ్రైనేజి నీరు రోడ్ల మీద పొంగకుండా మురుగు నీటి కాలువలను వెంటనే శుభ్రపరచాలని మాధవి ఆదేశించారు. ప్రజాసమస్యల విషయంలో నిర్లక్ష్యం వీడాలని, ప్రజలకు జవాబుదారీతనంగా ఈ ప్రభుత్వానికి మంచి పేరు తెచ్చే విధముగా అధికారులు పనిచేయాలని గళ్ళా మాధవి కోరారు. ఎమ్మెల్యే గళ్ళా మాధవి వెంట సానిటరీ ఇన్స్పెక్టర్, వాటర్ ఏ.ఈ మరియు ఇతర అధికారులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో వనమా నరేంద్ర, ఉప్పుదల సాంబ, సానం రమేష్,మల్లె నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

## సామాజిక చైతన్యం నింపిన "సూర్యోదయం" లఘు చిత్రం

### మండల ప్రజా పరిషత్ సభ్యురాలు ఉప్పుటూరి సుజాత




**గుంటూరు : జులై 3 ( ఆంధ్రపత్రిక ) :** గ్రామీణ కుటుంబాలలో మహిళల విద్య ప్రాధాన్యాన్ని చాటి చెప్పే విధంగా గన్నే వాసుదేవరావు స్వీయ కథ, స్క్రీన్ ప్లే, దర్శకత్వంలో తీసిన లఘు చిత్రం సూర్యోదయం తమ గ్రామంలో తొలిసారిగా ప్రదర్శించటం సామాజిక చైతన్యాన్ని పెంపొందిస్తుందని మండల ప్రజాపరిషత్ సభ్యురాలు ఉప్పుటూరి సుజాత పేర్కొన్నారు. గన్నె వాసు ఆర్ట్స్ సమర్పణలో మహిళా విద్య ప్రాధాన్యాన్ని తెలియజేస్తూ తీసిన లఘు చిత్రం సూర్యోదయం బుధవారం ఇంజనంపాడు పోతినేని కోటేశ్వరరావు ఇంటి ఆవరణలో ప్రదర్శించారు. ఈ సందర్భంగా చిత్ర దర్శకులు గన్నే వాసుదేవరావు మాట్లాడుతూ తాను ప్రభుత్వ ఉన్నత పాఠశాల డ్రాయింగ్ మాస్టర్ గా పదవి విరమణ చేసిన అనంతరం తన తమ పాఠశాల విద్యార్థులు వివిధ గ్రామాల్లోని ప్రజలతో ఇప్పటికీ 11 పైగా సందేశాత్మక లఘు చిత్రాలను నిర్మించి యూట్యూబ్లో ఉంచానన్నారు. యూట్యూబ్ లో గన్నే వాసు ఆర్ట్స్ ద్వారా వీక్షించవచ్చని తెలియజేశారు. విశ్వసంకీర్తనచార్య తుర్లపాటి శంబయాచార్య ఆశీర్వ పూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. లఘు చిత్ర నిర్మాణంలో కెమెరా యు అశోక్ బాబు ఎడిటింగ్ ఎం మల్లికార్జునాచారి, నేపద్య సంగీతం బి శ్రీలక్ష్మి, సుధారాణి, సాహితి లు అందించగా కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ జి చంపరయ్య, ఉప్పుటూరి సాంబశివరావు, ఎం జానకి రామయ్య, హరినాధ బాబు, కే ఆంజనేయులు, డాక్టర్ హనుమంతరావు, పి కోటేశ్వరరావు, సిహెచ్ సూర్యప్రకాష్ చిత్రంలో నటించిన నటీనటులు తదితరులు పాల్గొన్నారు.

## జి.ఎస్.టి ఉద్యోగుల సక్సెస్ మీట్ కమీషనర్‌ను సత్కరించిన ఉద్యోగులు



**గుంటూరు , జులై 3( ఆంధ్రపత్రిక ):** జీఎస్టీ దినోత్సవాన్ని వినూత్న పద్దతిలో అత్యంత వైభవంగా నిర్వహించిన సెంట్రల్ జీఎస్టీ కమీషనర్ సాధు నరసింహారెడ్డి ని ఆ శాఖ ఉద్యోగులు సత్కారించారు. బుధవారం కన్నవారి వారితోటలోని జి.ఎస్.టీ భవన్ లో జరిగిన సక్సెస్ మీట్ కార్యక్రమంలో జిఎస్టి శాఖకు చెందిన పలు ఉద్యోగ సంఘాల నేతలు కమిషనర్ కు అభినందనలు తెలిపారు. జీఎస్టీ వచ్చి ఏడు సంవత్సరాలు అయినా గుంటూరులో ఇప్పటి వరకు లేని విధంగా పెద్ద ఎత్తున వార్షికోత్సవాన్ని కమీషనర్ నిర్వహించటం పట్ల ఉద్యోగులు సంతోషాన్ని వ్యక్తం చేస్తారు. సోషల్ వర్కర్లను, ఆరోగ్య వీరులను గుర్తించి వారిని సత్కరించటం, ప్రతిభ చూపిన ఉద్యోగులకి, రిటైర్డ్ ఉద్యోగులు చేసిన సేవలకి గుర్తింపుగా ప్రశంసా పత్రాలు అందచేయడం, జిఎస్టి అత్యధికంగా కట్టిన పారిశ్రామిక వేత్తలను సన్మానించడం వంటి కార్యక్రమాలను నిర్వహించినందుకు కమీషనర్ నరసింహారెడ్డి నీ ఉద్యోగులను కొనియాడారు. సక్సెస్ మీట్ లో ఉద్యోగ సంఘాల నాయకులు గాదె శ్రీనివాసరెడ్డి సిహెచ్. జవహర్ బాబు, శాఖమూరి శ్రీనివాస్, బిల్లా ప్రశాంత్ కుమార్, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## టిట్కో ఇళ్లను సందర్శించిన ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు



**తిరువూరు జూలై 3(ఆంధ్రపత్రిక):** తిరువూరు పట్టణ శివారు పీటీ కొత్తూరులో తెలుగుదేశం పార్టీ ప్రభుత్వంలో పేదల కోసం నిర్మించిన టిట్కో ఇళ్లను బుధవారం ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు సందర్శించి పరిశీలించారు .తెలుగుదేశం ప్రభుత్వంలో 80. శాతం టిట్కో ఇళులను పూర్తి చేసిందని వైసిపి ప్రభుత్వం రాగానే జగన్మోహన్ రెడ్డి టిట్కో భవన నిర్మాణాన్ని ఆపేశాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ ముఖ్యమంత్రి అయిన వెంటనే ఈ భవనాల నిర్మాణంలను ఆపేశాడని అందుకే ప్రజలు సార్వత్రిక ఎన్నికల్లోసరైన బుద్ధి చెప్పారని పేర్కొన్నారు. ఈ టిట్కో నిర్మాణం గురించి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో మాట్లాడి టిట్కో ఇళ్లు అందే విధంగా బాధితులందరికీ న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు.

## సకాలంలో జీతాలు, పెన్షన్ల చెల్లింపులు సంతోషదాయకం

### ఎంజి జీవో సంఘ రాష్ట్ర అధ్యక్షుడు,జేపసీ చైర్మన్ కె.వి శివారెడ్డి

**విజయవాడ , జూలై 3, (ఆంధ్రపత్రిక):** ఆంధ్రప్రదేశ్లో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు, పెన్షనర్లకు ఈ మధ్యకాలంలో ఎన్నడు లేనివిధంగా జీతాలు పెన్షన్లు సకాలంలో జమ అవటం ఆనందదాయకమని ఏపీ ఎన్జీవో సంఘ రాష్ట్ర అధ్యక్షుడు శివారెడ్డి, ప్రధాన కార్యదర్శి పురుషోత్తం నాయుడు తెలియజేశారు. గత ఐదు సంవత్సరా లుగా ఉద్యోగులు ఉపాధ్యాయులు మరియు కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులు సకాలంలో జీతాలు రాక, జీతాలు ఎప్పుడు పడతాయో తెలియక, పెన్షన్లు జమ అవక తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొన్నా రనీ శివారెడ్డి తెలిపారు. సమర్థుడైన అనుభవశాలి అయిన ముఖ్యమంత్రి ఉండటంవల్లనే దీని మీద దృష్టి సారించి జీతాలు సకాలంలో చెల్లించారని తెలిపారు. ఒకప్పుడు కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు బడ్జెట్ కేటాంపులు ద్వారా జీతాలు చెల్లించేవారని కానీ 2016లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు ఒకటో తారీఖున జీతాలు చెల్లించే విధంగా 010 పద్దు ద్వారా చెల్లించే విధంగా ఉత్తర్వులు జారీ చేశారని తద్వారా కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగు లు ఒకటో తారీఖున జీతాలు పొందుతున్నారని, కానీ గత ఐదు సంవత్సరాలుగా వారికి సకాలంలో జీతాలు ఎప్పుడు రాలేదని ప్రభుత్వం వారి మీద కూడా దృష్టి సారించి వారికి ప్రాధాన్యత క్రమంలో జీతాలు వచ్చేలాగా శ్రద్ధ వహించాలని కోరారు. గత ప్రభుత్వంలో కొన్ని నెలలుగా జీతాలు రాని ఉద్యోగుల సమస్యలన్నిటిని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి త్వరలోనే పరిష్కారం చేస్తామని తెలిపారు.అంగన్వాడీ ఆశా వర్కర్లు లాంటి చాలీచాలని జీతాలతో ఇబ్బంది పడే ఉద్యోగులకు కూడా సకాలంలో ప్రాధాన్యత పరంగా జీతాలు చెల్లించాలని కోరారు. ఈ ప్రభుత్వం మీద పెట్టుకున్న నమ్మకానికి అనుగుణంగానే, సామాజిక పెన్షన్లు పరముగా రెట్టింపు చెల్లింపులు జరిగినప్పటికీ, ప్రభుత్వం ఉద్యోగులకు కూడా చెల్లింపులలో ఉద్యోగులు పెట్టుకున్న నమ్మకానికి అనుగుణంగా చర్యలు చేపట్టడం హర్షదాయకం అని తెలిపారు.

## అనుమతి లేకుండా పథకం ప్రకారం ధర్నా నిర్వహిస్తూ వారిపై చర్యలు తీసుకోవాలి



**విజయవాడ , జూలై 3, (ఆంధ్రపత్రిక):** కొలనుకొండ శివాజీ, గంగిశెట్టి ఉమాశంకర్ తమకు వ్రాయించి ఇచ్చు ఫిర్యాదు. అనగా 03-07-2024 న సుమారు 11.00 గంటల నుండి 12.30 గంటల వరకు బీజేపీ రాష్ట్రా పార్టీ నాయకుల ఆధ్వర్యంలో గంటల కొద్దీ ట్రాఫిక్ అంతరాయము కలుగచేస్తూ, విజయ వాడ నగర పౌరులను భయ భ్రాంతులకు గురిచేస్తూ, హాస్పటల్‌కు వేళ్ళు పేషేంట్స్ ను ఇబ్బందులు కలుగచేస్తూ, పోలీసు వారి అనుమతి లేకుండా పథకం ప్రకారం కుట్ర పూరితంగా, ధర్నా నిర్వహిస్తూ, ప్రశ్నించిన పౌరులపై దౌర్జన్య పూరితంగా ఇబ్బందులకు గురి చేసి,భారతదేశ ప్రతిపక్ష నేత గౌరవనీయులైన రాహుల్ గాంధి గారి దిష్టి బొమ్మను ఊరేగించి, చెప్పులతో కొట్టి, దహనం చేసి రాహుల్ గాంధి గారి పరువు, ప్రతిష్టాలు దెబ్బతినెలా చేసిన బీజేపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్, బీజేపీ యువజన మోర్చ రాష్ట్రా అధ్యక్షుడు మిట్ట వంశీ కృష్ణా, రాష్ట్ర జనరల్ సెక్రటరీ నవనీత్ రెడ్డి, విశ్వహిందూ పరిషత్ సిటీ అధ్యక్షులు సనా శ్రీనివాస్, బొల్లపల్లి శ్రీధర్ మరియు బీజేపీ కార్యకర్తలు, నాయకులుపై చట్టపరమైన కేసు నమోదు చేసి చట్టప్రకారం శిక్షించవలసిందిగా తమను ప్రార్థిస్తూన్నాము.

## వివిఐటి కళాశాలలో పర్డ్యూ యూనివర్శిటీ "ఎపిక్స్" కార్యక్రమం



**గుంటూరు : జులై 3( ఆంధ్రపత్రిక ):** అమెరికాకు చెందిన ప్రతిష్టాత్మక పర్డ్యూ యూనివర్శిటీ నందు ప్రారంభించిన " ఎపిక్స్" కార్యక్రమాన్ని వివిఐటి కళాశాలలో నిర్వహించారు. ఎపిక్స్ కార్యక్రమంలో భాగంగా పర్డ్యూ యూనివర్శిటీ డైరెక్టర్ ప్రొఫెసర్ డాఎం విలియమ్ వోక్స్ వివిఐటి కళాశాలను సందర్శించి విద్యార్థులు మరియు అధ్యాపకులతో ఇంటరాక్షన్ నిర్వహించారు. ఈ సంధర్బంగా విలియమ్ వోక్స్ విద్యార్థులకు ఎపిక్స్ కార్యక్రమం గురించి వివరించారు. ఇంజనీరింగ్ విదార్థుల ప్రతిభను ప్రపంచ వ్యాప్తంగా కమ్యునిటీలలో మంచికోసం వినియోగించేలా ఈ కార్యక్రమం రూపొందించబడినదని తెలిపారు. సాంకేతిక వినియోగం ద్వారా ప్రపంచ సవాళ్లు అధిగమించేలా విద్యార్థులలో నైపుణ్యాలను పెంపొందించడం ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశం అని అన్నారు. ఈ కార్యక్రమానికి దేశ వ్యాప్తంగా 10 విద్యాలయాలు ఎంపిక కాగా వివిఐటి కళాశాల ఒకటి కావడం విశేషం అని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా వివిఐటి విద్యార్థులు, పర్డ్యూ యూనివర్శిటీ విద్యార్థులు కలసి పర్యావరణం, మానవసేవలు, విద్యా సంభందిత అంశాల సమస్యల పరిష్కారానికి డిజైన్ థింకింగ్ ద్వారా పరిష్కారాలను రూపొందిస్తారని తెలిపారు. విద్యార్థులలో సేవాగుణం, మంచిని పెంచే " ఎపిక్స్" కార్యక్రమంలో భాగమైన విలియమ్ వోక్స్ను వివిఐటి చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డా? వై. మల్లికార్జున రెడ్డి. అకడమిక్ డీన్ డా. కె. గిరిబాబు, అధ్యాపకులు పాల్గొన్నారు.

## చంద్రబాబు పరిపాలనతో రాష్ట్రంలో మైనారిటీలకు సువర్ణయుగం

### మైనారిటి హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షులు మొహమ్మద్ ఫారూఖ్ శుబ్లీ.



**గుంటూరు , జులై 3( ఆంధ్రపత్రిక ):** ప్రభుత్వాలు మైనార్టీలకిచ్చిన హామీలను అమలు పరచేందుకు మైనారిటి హక్కుల పరిరక్షణ సమితి నిర్విరామ పోరాటం చేస్తునే ఉంటుందని మైనారిటి హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షులు మొహమ్మద్ ఫారూఖ్ శుబ్లీ పేర్కొన్నారు. మైనారిటి హక్కుల పరిరక్షణ సమితి మహిళా విభాగ వర్కింగ్ ప్రెశిడెంట్ గా డాక్టర్ షమ సుల్తానా నియమితులైన సందర్బంగా గుంటురు ఎం కన్వెన్షన్ లో జరిగిన ఆత్మీయ అభినందన సభలో అయన ముఖ్య అతిధిగా పాల్గొన్న ఫారూఖ్ శుబ్లీ మాట్లడుతూ మైనారిటిల హక్కుల కోసము అనేక ఏళ్ళుగా అంశాల వారీగా ఆయా ప్రభుత్వాలను ప్రశ్నిస్తునే కొనసాగమన్నారు. ఈ ప్రయాణంలో అనేక ప్రతిబంధకాలు ఎదుర్కున్న వెనుకడుగు వేయలేదన్నారు. గత ప్రభుత్వ హాయంలో మైనార్టీలపై జరిగిన ప్రతి దాడిని ప్రశ్నించా మన్నారు. వైసిపి ప్రభుత్వము షాదీతోఫా, విదేశీవిద్య పథకాలను అమలు చేయకుండా పట్టించుకునే పరిస్తుతుల్లో న్యాయపోరాటం పోరాటం ద్వారా సాధించింది మైనారిటి హక్కుల పరిరక్షణ సమితి అని చెప్పడానికి గర్వముగా వుందన్నారు.

ప్రస్తుతం అదికారంలోకి వచ్చిన టిడిపి మైనారిటీల పక్షపాతి అని పెర్కొన్నారు. చంద్రబాబు పరిపాలనలో మైనారిటీలకు సువర్ణయుగం ప్రారంభ మయిందన్నారు. చంద్రన్న పాలనలో ముస్లింలు సంతొషంగా, సుభిక్షంగా ఉన్నారని ఫారూఖ్ శుబ్లీ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో గుంటూరు ఈస్ట్ ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అహమ్మద్ మాట్లడుతూ టిడిపి ప్రభుత్వనికి మంచి మెజారిటీనిచ్చిన అందరికీ ధన్యవాదాలన్నారు. కేవలం ప్రజల అభిలాషల మేరకే టిడిపి ప్రభుత్వము తన పరిపాలన కొనసాగిస్తుందని పెర్కొన్నారు. చంద్రన్న సుపరిపాలనలో అందరూ అభివృద్ధి పథంలో అన్ని వర్గాల ప్రజలు నడుస్తున్నారన్నారు. బిజెపితో దోస్తీలో ఉన్న టిడిపి ప్రభుత్వ హాయాంలో ముస్లింలు సురక్షింతంగా ఉంటారన్నారు. ముస్లింలు ఎవరు అధైర్య పడాల్సిన పరిస్తుతులిప్పుడు లేవని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో హోప్ విన్స్ హస్పిటల్స్ అదినేత నజిరుద్దీన్ , ప్రముఖ న్యాయవాది సలీం పాషా తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలోనే అతిపెద్ద పారిశ్రామిక వాడలు తీర్చిదిద్దుతాం

## పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్





**గన్నవరం/బాపులపాడు, జూలై 3 (ఆంధ్రపత్రిక):** మల్లవల్లి, వీరపనేనిగూడెం పారిశ్రామిక వాడల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని, అతిపెద్ద పారిశ్రామిక వాడలుగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖామంత్రి టీజీ భరత్ అన్నారు. బుధవారం మంత్రి గన్నవరం శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు, జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, ఏపీఐఐసీ, పరిశ్రమల శాఖ, రెవెన్యూ అధికారులతో కలిసి గన్నవరం మండలం మల్లవల్లి, బాపులపాడు మండలం వీరపనేని గూడెం పారిశ్రామిక వాడలను సందర్శించి పారిశ్రామికవేత్తలతో సమావేశమై వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మంత్రి మాట్లాడుతూ ఈ రెండు పారిశ్రామిక వాడల్లో విద్యుత్తు కోతల వల్ల ఆయా పరిశ్రమల్లో ఉత్పత్తికి ఆటంకం కలుగుతున్నదని, తద్వారా నష్టం వాటిల్లుతున్నదని పారిశ్రామికవేత్తలు మంత్రికి వివరించారు. వెంటనే మంత్రి విద్యుత్ అధికారులను పిలిచి సమస్య కారణాలు అడిగి తెలుసుకున్నారు. సబ్ స్టేషన్లో సిబ్బంది కొరత సమస్య పరిష్కరించాలని, విద్యుత్తు నిర్వహణ పక్కాగా నిర్వహించి కోతలు లేకుండా చూడాలని ఆదేశించారు. విద్యుత్ సమస్య పునరావృతం కారాదని హెచ్చ రించారు. పరిశ్రమలకు విద్యుత్తు సరఫరా చాలా ముఖ్యమని పారిశ్రామికవేత్తగా పరిశ్రమ దారుల సమస్యలు తనకు తెలుసని అన్నారు. అశోక్ లేలాండ్ వంటి పెద్ద పారిశ్రామిక బ్రాండెడ్ సంస్థ లు వస్తున్నాయని తెలిపారు. పారిశ్రామి వాడలలో బస్సు షెల్టర్, పోలీస్ పికెట్ వంటి కనీస వసతులు లేకపోవడం శోచనీయమని, వెంటనే ఏర్పాటు చేయాలని పారిశ్రామికవేత్తలను భాగస్వామ్యం చేయా లని అన్నారు. నీటి సమస్య పరిష్కరించాలన్నారు. ఏపీని అభివృద్ధి రోల్ మోడల్ గా చేయాలని ముఖ్య మంత్రి సంకల్పం అన్నారు. మల్లవల్లి, వీరపనేని గూడెం పారిశ్రామిక వాడల గుర్తింపునకు ప్రవేశ ద్వారాలను నిర్మించాలని, సెక్యూరిటీ ఏర్పాటు చేయాలని, పారిశ్రామిక వాడల చుట్టూ కంచె/ ప్రహరీ నిర్మించాలని, డ్రైనేజీ వ్యవస్థ పక్కాగా ఏర్పాటు చేయాలని, గ్రీన్ జోన్ ఏర్పాటు చేసి గ్రీనరీ అభివృద్ధి చేయాలని జిల్లా కలెక్టర్ కు, అధికారులకు సూచించారు. గన్నవరం శాసనసభ శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ మల్లవల్లి పారిశ్రామిక వాడ ముఖ్యమంత్రి, పరిశ్రమల మంత్రి సహకారంతో రాష్ట్రంలోనే అతిపెద్ద పారిశ్రామిక వాడగా తీర్చిదిద్దేందుకు తమ వంతు కృషి చేస్తామన్నారు. జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ మాట్లాడుతూ పారిశ్రామిక వాడల్లో భూ సమస్యలు కనీస వసతుల కల్పన, తదితర అంశాలపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం మంత్రి, శాసనసభ్యులు జిల్లా కలెక్టర్ అశోక్ లేలాండ్ ప్రతినిధులతో కలిసి అశోక్ లేలాండ్ లేఔట్ సందర్శించారు. గుడివాడ ఆర్డీఓ పి పద్మావతి, ఏపీఐఐసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వివేక్, జోనల్ మేనేజర్ సీతారాం, జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ ఆర్ వెంకట్రావు, విద్యుత్తు ఆర్డబ్ల్యూఎస్ అధికారులు పాల్గొన్నారు.

# అక్షర యోధుడు రామోజీరావుకు నివాళులు అర్పిద్దాం



**గుంటూరు ,జూలై 3 (ఆంధ్రపత్రిక):** అక్షర యోధుడు కీర్తిశేషులు రామోజీరావు సంస్మరణ సభ ఈనెల 7వ తేదీ ఆదివారం ఉదయం 10 గంటలకు వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో జరిగే సభకు హాజరై నివాళులు అర్పిద్దామని శాసన మండలి సభ్యులు కె.యస్.లక్ష్మణరావు పిలుపునిచ్చారు. జన చైతన్య వేదిక మరియు ఠాగూర్ మెమోరి యల్ థియేటర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈనెల 3వ తేదీన జన చైతన్య వేదిక హాలులో జరిగిన మీడియా సమావేశంలో శాసనమండలి సభ్యులు కె.యస్.లక్ష్మణరావు తోపాటు మాజీ మంత్రివర్యులు డొక్కా మాణిక్య వరప్రసాద్, జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి, ఠాగూర్ మెమోరియల్ థియేటర్ ట్రస్ట్ కార్యదర్శి పి. రామచంద్ర రాజు, ప్రముఖ విద్యావేత్త కన్నా మాస్టర్, ప్రవేట్ విద్యా సంస్థల రాష్ట్ర కో చైర్మన్ మేకల రవీంద్రబాబు, మానవత వ్యవస్థాపక కార్యదర్శి రమణబాబు తదిత రులు ప్రసంగించారు. శాసన మండలి సభ్యులు కె.యస్. లక్ష్మణరావు ప్రసంగిస్తూ రామోజీరావు కృష్ణా జిల్లాలోని పెదపారుపూడి గ్రామంలో సామాన్యమైన రైతు కుటుంబంలో జన్మించి, అంచల ంచలగా ఎదిగి, 25 వేల మందికి ప్రత్యక్షముగాను, మరో 25 వేల మందికి పరోక్షముగా ఉపాధి కల్పించిన ధన్యజీవి రామోజీరావు అని అన్నారు. ప్రపంచంలోనే అరుదైన ఫిల్మ్ సిటీ గా రామోజీ ఫిల్మ్ సిటీ ని నిర్వహించటం శ్లాఘ నీయమన్నారు. మాజీ మంత్రివర్యులు డొక్కా మాణిక్య వరప్రసాద్ ప్రసం గిస్తూ పద్మ విభూషణ్ రామోజీరావు తెలుగుజాతికి, తెలుగు భాషకు చేసిన కృషి అమోఘమైనది అని తెలి పారు. అన్నదాత పత్రిక ద్వారా వ్యవసాయ రంగంలో వినూత్నమైన మార్పులకు శ్రీకారం చుట్టార న్నారు. రామోజీ సంస్మరణ సభకు ఆహ్వాన సంఘ అధ్యక్షులు, జన చైతన్య సభ అధ్యక్షులు వల్లం రెడ్డి లక్ష్మణరెడ్డి ప్రసంగిస్తూ రామోజీరావు తాను నమ్మిన ఆశయాలను, గమ్యాలను సాధించడానికి, నిబద్ధత తో, నిజాయితీతో మహోన్నతమైన కృషిచేసిన మహనీయులు రామోజీరావు తెలుగు ప్రజలకు రోల్ మోడల్ అని పేర్కొన్నారు. గత ఐదు సంవత్సరాలుగా ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఎదుర్కొంటున్న ఆర్థిక, రాజకీయ, సామాజిక సమస్యలపై నిరంతరం అక్షర యోధుడుగా పోరాడి, ప్రజా విజయాన్ని ఆస్వాదిం చి ,తుది శ్వాస వీడినారని, తెలుగు ప్రజల విజయాన్ని రామోజీరావు చివరి రోజులలో వారితో పంచు కోవటం నాకు ఆనందముగా ఉందన్నారు. 1990లో జన విజ్ఞాన వేదిక నిర్వహించిన సంపూర్ణ అక్షరా స్యత ఉద్యమం, సారా వ్యతిరేక ఉద్యమానికి రామోజీరావు అందించిన తోడ్పాటును గుర్తు చేసుకు న్నారు. ప్రముఖ విద్యావేత్తలు కన్నా మాస్టారు, మేకల రవీంద్రబాబు లు ప్రసంగిస్తూ గుంటూరు నగరం లోని, గుంటూరు జిల్లాలోని ఉపాధ్యాయులు జులై 7వ తేదీ ఆదివారం ఉదయం పది గంటల కు గుంటూరులోని శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో జరిగే రామోజీరావు సంస్మరణ సభలో అధిక సంఖ్యలో పాల్గొని నివాళులు అర్పించాలని కోరారు.

# ఇచ్చిన హామీ అమలు చేసి పెన్షన్లు పంపిణీ చేసిన ఘనత కూటమి ప్రభుత్వానిదే



**మచిలీపట్నం ,జూలై 3 (ఆంధ్రపత్రిక):** ఇచ్చిన హామీని 18 రోజుల్లోనే అమలు చేస్తూ పింఛన్ల పంపిణీపై తెలుగుదేశం రాష్ట్ర అధికార ప్రతినిధి మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ గొర్రెపాటి గోపీచంద్ హర్షం వ్యక్తం చేశారు. దేశ చరిత్రలో ఎక్కడా లేని విధంగా చంద్రన్న పింఛన్లు పంపిణీ గతంలో వాలంటీర్ల వంకతో ఎండలో వృద్ధులను తిప్పారన్నారు. ఆ శాపమే జగన్మోహన రెడ్డికి తగిలి 11 సీట్లకు పరిమితం చేసిందన్నారు. పెంచిన పింఛన్ బకాయిలతో రూ. 7000, వికలాంగులకు 6000 లు నేరుగా ఇంటివద్దకే ఇవ్వడం గొప్ప విషయం అన్నారు. అలాగే చంద్రబాబు మార్క్ చూపేలా 1వ తారీఖునే ఉద్యోగులకు జీతాలు అందించారన్నారు. రాబోయే రోజుల్లో రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం, జోడెద్దులలా పరిగెత్తుతోందన్నారు. కూటమి ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ ప్రజల భరోసాకు, బాగుకు, సంక్షేమానికి కట్టుబడి ఉందన్నారు. ఇచ్చిన హామీని 18 రోజుల్లోనే అమలు చేసి దేశ చరిత్రలో నిలిచిపోయేలా పింఛన్ల పండుగ కు శ్రీకారం చుట్టిన కూటమి ప్రభుత్వం, చంద్రబాబు సమర్థతపై హర్షాతి రేకాలు వ్యక్తం చేశారు. జగన్మోహన్ రెడ్డికి 1000 రూపాయలు పెంచడానికి ఐదేళ్లు పడితే చంద్రబాబు అధికారం చేపట్టిన 18 రోజుల్లోనే పెంచిన వెయ్యితో బాటు ఇస్తానన్న బకాయిలతో ఇంటివద్దకే 7000 రూపాయలు, వికలాంగులకు 6000 లు తెచ్చి ఇచ్చి పండుటాకులకు పండుగ తెచ్చారని తెలిపారు. ఒక్క ఛాన్స్ అంటే జనం, ఉద్యోగస్తులు మోసపోయి అధికారం ఇచ్చారని అధికారం ఇచ్చిన జనానికే జగన్మోహన్ రెడ్డి వాత పెడితే వారు మళ్లీ చంద్రన్న పాలనను కోరుకుని అఖండ మెజార్టీని అందించారని తెలియజేశారు. నేడు రాష్ట్రంలో పింఛన్ల పంపిణీ ఒక పండుగ వాతావరణంలా జరిగిందన్నారు. సచివాలయ ఉద్యోగులు, ఇతర ఉద్యోగులతో పింఛన్ల పంపిణీ చేశాం. పెంచిన పింఛన్ల పంపిణీ చారిత్రాత్మకమైన విషయం. రౌతు కొద్ది గుర్రం అన్నట్లు రాష్ట్రంలో పాలనను చంద్రబాబు గాడిలో పెట్టి సంక్షేమ పాలనకు శ్రీకారం చుట్టారన్నారు. పింఛన్ దారులకు నేడు చంద్రబాబు దేవుడిగా ఉన్నారు. పెంచిన పింఛన్ లో మిగిలిన వారందరూ కేవలం 1200 వరకు మాత్రమే పెంచితే చంద్రన్న ఒక్కడే రూ. 2,845 పింఛన్ ను పెంచారన్నారు. గత ప్రభుత్వం పదో తారిఖు, 20వ తారిఖు వచ్చినా జీతాలు ఇవ్వకుండా ఉద్యోగస్తు లను ఇబ్బంది పెట్టారన్నారు. 1వ తారిఖునే జీతాలు ఇచ్చే మార్క్ చంద్రబాబుకు ఉందన్నారు. మరోవైపు కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు కూడా 1వ తారీఖునే జీతాలు ఇచ్చేందుకు కృషి చేయడం ఈ రాష్ట్రానికి మంచి రోజులు రాబోతున్నాయని తెలుస్తుందనడానికి సంకేతం అన్నారు. కూటమి ప్రభుత్వంలో ఉపాధి అవకాశాలు మెరుగుబడబోతున్నాయన్నారు. అమరావతి రాజధానితో సంపద సృష్టించి ఏవిధంగా సంక్షేమానికి పంచాలో చంద్రబాబుకు తెలుసన్నారు.

జగన్ పాలన రుచి చూశాక చంద్రబాబు పాలనను కోరుకున్నారు. చిత్తూరు నుండి శ్రీకాకుళం వరకు ఒకే మ్యాండేట్ ఇచ్చింది చరిత్రలో ఏనాడు లేదన్నారు.

జగన్ రెడ్డిని నమ్మి నష్టపోయిన వారు చాలా ఎక్కువ మంది ఉన్నారన్నారు. అందరికన్నా భావితరం ఎక్కువగా నష్టపోయిందన్నారు. రాబోయే రోజుల్లో రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం జోడెద్దులలా పరిగెత్తుతుందన్నారు . 18 రోజుల్లో పింఛన్ హామీని అమలు చేసిన చంద్రబాబును అభినందిస్తున్నాం అన్నారు .కూటమి ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ ప్రజల భరోసాకు, బాగుకు, సంక్షేమానికి కట్టుబడి ఉంద న్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ ప్రచార కార్యదర్శి పివి ఫణికుమార్ పాల్గొన్నారు.

# కొనసాగుతున్న సర్టిఫికెట్ల పరిశీలన

**నూజివీడు,జూలై 3 (ఆంధ్రపత్రిక):** ఆర్జీయూకేటి- నూజివీడు, ఆరేళ్ల సమీకృత బిటెక్ ఇంజనీరింగ్ కోర్సులో ప్రవేశాలకు సంబంధించి ప్రత్యేక కేటగిరి అభ్యర్థుల దరఖాస్తుల పరిశీలనలో భాగంగా ఈరోజు క్యాప్ (CAP) విభాగములో 57 మంది భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ విభాగంలో 49 ఎన్సిసి విభాగంలో 101 మంది, క్రీడా విభాగంలో 180 మంది, దివ్యాంగులు విభాగంలో 249 మంది విద్యార్థులు సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిమిత్తం హాజరయ్యారు. 4/7/2024 తారీకున ఎన్సిసి (NCC), మరియు క్రీడా (sports) కేటగిరీలో సర్టిఫికెట్స్ వెరిఫికేషన్ జరగనున్నట్లు ఆర్జీయూకేటీ అడ్మిషన్స్ కన్వీనర్, ఆచార్య ఎస్. అమరేంద్ర కుమార్ తెలియజేశారు.

# నిజమైన కార్యకర్తలకు జనసేనలో ఎప్పుడు న్యాయం జరుగుతుంది

## కృష్ణా జిల్లా కార్యదర్శి కూనసాని నాగబాబు



**బంటుమిల్లి ,జూలై 3( ఆంధ్రపత్రిక ):** జనసేనపార్టీ అధినేత, ఉప-ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కి గత 10 సంవత్సరాలుగా మీడియా, రాజకీయ కార్యదర్శిగా పనిచేసిన పిడుగు హరిప్రసాద్ ని ఎమ్మెల్సీకి ఎంపిక చేయడం హర్షణీయంఅని,ఆయన నియామకాన్ని జనసేన పార్టీ కోసం నిజాయితీగా పనిచేసే వారికి గుర్తింపుగా భావిస్తున్నానని ఉమ్మడి కృష్ణాజిల్లా జనసేన కార్యదర్శి కూనసాని నాగబాబు అన్నారు. ఈ సందర్భంగా వారికి పెడన జనసేనపార్టీ తరపున శుభాకాంక్షలు తెలియ జెసి వారు మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని నాగబాబు ఆకాంక్షించారు.

# అత్యుత్తమ సేవలకు రోటరీకి 11 అవార్డులు



**మచిలీపట్నం,జూలై 3 (ఆంధ్రపత్రిక):** మచిలీపట్నం రోటరీ క్లబ్ ను 11 అవార్డులు వరించాయి. అత్యుత్తమ సేవలందించిన మచిలీపట్నం రోటరీ క్లబ్ కు పదకొండు అవార్డులు లభించినట్లు రోటరీ క్లబ్ డైరెక్టర్ జ్యోతి తెలియజేశారు. రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ ఎల్. మోజెస్, కార్యదర్శి కె.అనుపమ ముఖర్జీ, జిల్లా పోలియో చైర్పర్సన్ సాయిప్రసాద్ పబ్లిక్ రిలేషన్ చైర్మన్ అజ్మతున్నీసా రొటేరియన్ సాయి సుధాకర్ అవార్డులను మీడియా ముందు ప్రదర్శించారు. ఉత్తమ ప్రెసిడెంట్ గా మోజెస్ ఎన్నికయ్యారు. ఉత్తమ సెక్రటరీ అవార్డును అనుపమ ముఖర్జీ దక్కించుకున్నారు. సిహెచ్ సాయిప్రసాద్ పోలియో వారియర్ అవార్డును పొందారు. రోటరీ పల్స్ పోలియో కార్యక్రమానికి కంతేటి అనిల్ ఏ జ్యోతి సాయిప్రసాద్ లు 3 లక్షల రూపాయలు అందజేశారు. రాఫెల్ టికెట్ ద్వారా వచ్చిన బహుమతి 2 లక్షల రూపాయలు రోల్డ్ గోల్డ్ కార్మికుడికి దక్కిందన్నారు. ఈనెల ఏడవ తేదీ రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య సేవా శిబిరాన్ని నిర్వహిస్తున్నామని తెలియజేశారు.

# పలు సమస్యల గురించి ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్‌ను కలిసిన ఉల్లిపాలెం యానాదులు



**కోడూరు జూలై 3 (ఆంధ్రపత్రిక):** కోడూరు మండలం పరిధిలో పలు యానాది కాలనీలో ఉన్న సమస్యలు అవనిగడ్డ శాసనసభ్యులు మండలి బుద్ధ ప్రసాద్ దృష్టికి ముందుకు తీసుకొచ్చారు కోడూరు మండల పరిధిలోని శ్రీరాంపురం కాలనీలో 20 గృహాలు స్లాపులు పగిలిపోయి పెచ్చులు రాలిపోతున్నాయి ,ఉల్లిపాలెం పరిధిలోని హరిపురం ఎస్టీ యానాది కాలనీలో వీధిలైట్లు లేవు , వాళ్ల గృహాలు కూడా కరెంట్ లైన్స్ పంచాయతీ ఇవ్వలేదు , స్తంభాలు కూడా లేవు ఎన్టీ రామారావు యోజన పథకంలో కట్టవలసిన గృహాలు కూడా గత ప్రభుత్వం కట్టలేదు ఉల్లిపాలెం ఎస్టీ యానాది కాలనీలో ఎన్టీ రామారావు యోజన పథకంలో సగము కట్టి నిలిపివేసిన 20 గృహాలు కట్టవలసినవి ఆరు నెలలుగా మాకు వచ్చే మంచినీళ్లు కూడా సరిగ్గా రావటంలేదనీ మా యానాది కాలనీ మొత్తంలో ఒక లైటు వెలుగుతుంటా ఉంటది సార్ గత ప్రభుత్వంలో ఎన్ని సార్లు మొరపెట్టుకున్నా మమ్మల్ని పట్టించుకోలేదు మా యందు దయ ఉంచి మా యానాది కాలనీలో మౌలిక సౌకర్యాలు మంచినీళ్ల సమస్య గృహ సమస్య కరెంటు సమస్య పరిష్కరించాలని తమకు మనవి చేసుకుంటూ వారి సమస్యలను వారి సమస్యలను ఎం శ్రీనివాసరావు యానాది మహానాడు జిల్లా అధ్యక్షుడు కోడూరు మండలం ఉల్లిపాలెం అవనిగడ్డ నియోజకవర్గం శాసనసభ్యులు మండల బుద్ధ ప్రసాద్ దృష్టికి తీసుకువెళ్లారు తక్షణమే మీ సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని భరోసా ఇచ్చారు.

# ఉచిత వైద్య మరియు స్వచ్ఛంద రక్తదాన శిబిరం





**కైకలూరు జూలై 3( ఆంధ్రపత్రిక ):** ఏలూరు జిల్లా కైకలూరు నియోజకవర్గం మండవల్లి మండలం లోకమూడి గ్రామం దత్తాశ్రమంలో బిఎస్సార్ ఆక్వా ట్రేడర్స్ అధినేత, దినేష్ ఇన్ ఫ్రా మేనేజింగ్ పార్టనర్ బూరుబోయిన శ్రీనివాసరావు జన్మదినోత్సవం సందర్భంగా ఏర్పాటుచేసిన ఉచిత వైద్య శిబిరం మరియు స్వచ్ఛంద రక్తదాన శిబిరాలనుసందర్శించి కైకలూరు నియోజక వర్గ శాసన సభ్యులు డాక్టర్ కామినేని శ్రీనివాస్ , బి ఎస్ ఆర్ కి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కామినేని శ్రీనివాస్ మాట్లాడుతూ పుట్టినరోజు సందర్భంగా ఇలాంటి సేవా కార్యక్రమాలు చేయడం చాలా సంతోషకరం గా ఉందని, ఇలాంటి కార్యక్రమాల వల్ల చాలా మంది నిరుపేద కష్టాలు తీరుతాయని, ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకుని పేద ప్రజల కు సేవ చేయాలని కోరారు. మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా చేస్తున్న సేవా కార్యక్రమాలకు మెచ్చి కామినేని సభ్యత్వం తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎన్డీఏ కూటమి నాయకులు ప్రజా ప్రతినిధులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# నేడే మామిడి రైతుల సమావేశం

**నూజివీడు,జూలై 3 (ఆంధ్రపత్రిక):** నూజివీడులో మామిడి మార్కెట్ ఏర్పాటుకు సంబంధించి రైతులు, వ్యాపారులు, సంబంధిత అధికారులతో ఈ నెల 4వ తేదీ గురువారం ఉదయం 10.30 గంటలకు ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నట్టు వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు తెలిపారు. సమావేశానికి రాష్ట్ర గృహ నిర్మాణ,సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి ముఖ్య అతిథిగా హాజరవుతారని, ఏలూరు జిల్లా నూజివీడు, ఆగిరిపల్లి, చాట్రాయి, ముసునూరు మండలాలతో పాటు ఎన్టీఆర్ జిల్లా విస్సన్నపేట, తిరువూరు, మైలవరం, రెడ్డిగూడెం, ఏ.కొండూరు పరిసర ప్రాంతాల మామిడి రైతులు సమావేశానికి హాజరు కావాలని ఆయన కోరారు.

# భర్తను దారుణంగా హత్య చేసిన భార్య



**బంటుమిల్లి ,జూలై 3( ఆంధ్రపత్రిక ):** పెడన నియోజకవర్గం బంటుమిల్లి మండలం చిన్న తుమ్మిడి గ్రామంలో రాత్రి 11 గంటల ప్రాంతంలో చోటు చేసుకుంది. భార్యాభర్తల కి మధ్య ఏర్పడిన ఘర్షణలో క్షణిక ఆవేశంలో భార్య తన భర్తని హతమార్చింది. వివరాల్లోకి వెళితే గుసిమి అప్పారావు(30) తన మేన మామ కుమార్తె కీర్తన తో 9 సంవత్సరాల క్రితం పెళ్లి జరిగినది. వీరికి ఏడు సంవత్సరాల కుమారుడు ఉన్నాడు. హత్య కాబడిన వ్యక్తి తండ్రి తాతారావు ఇచ్చిన సమాచారం మేరకు రాత్రి 11 గంటల సమయంలో తన కోడలు కీర్తన తన దగ్గరకు వచ్చి మీ అబ్బాయి పడిపోయాడు లేవట్లేదు అని చెప్పింది. సంఘటన స్థలంలోకి వెళ్లి చూడగా తన కుమారుడు రక్తమడుగుల్లో ఉన్నాడని వెంటనే గ్రామ పెద్ద అయినటువంటి బొల్లా హరిబాబు కి సమా చారం అందించగా హరిబాబు వెంటనే 108కి సమాచారం అంది ంచగా 108 సిబ్బంది వచ్చి అప్పారావు అప్పటికే చనిపోయినట్టుగా నిర్ధారించారు. వెంటనే పోలీసులకు సమాచారం తెలియ జే యగా పోలీసులు అక్కడికి చేరుకొని హత్య జరిగిన ప్రాం తాన్ని పరిశీలించి విచారణ మొదలుపెట్టారు . హత్య చేయటానికి ఉప యోగించిన ఆయుధాన్ని( స్క్రూ డ్రైవర్) పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మృతుని భార్య కీర్తన తనే స్క్రూ డ్రైవర్ ను ఆయు ధంగా వాడుకుని మెడపై గాయపరిచి హత్య చేసినట్లుగా పోలీసులు ముందు అంగీకరించింది. బంటుమిల్లి ఎస్ఐ వాసు, సి ఐ కె.నాగేంద్ర ప్రసాద్, గ్రామ విఆర్ఓ మరియు పోలీసుల సమ క్షంలో క్లూస్ టీం వేలిముద్రలు, బ్లడ్ శాంపిల్స్ సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం మచిలీపట్నం ప్రభుత్వ ఆసు పత్రికి తరలించారు. మృతుడి అప్పారావు సోదరి తెర్లాపు అచ్చుమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ హత్య వివాదాల కారణంగా జరిగిం దా? వివాహేతర సంబంధం కారణంగా జరిగిందా? ఈ హత్య వెనక ఇంకా ఎవరైనా ఉన్నారా? అనే కోణంలో దర్యాప్తు ప్రారంభించారు.

# మహానటుడు ఎస్వీ రంగారావుకు ఘన నివాళి



**విజయవాడ పశ్చిమ, జూలై 3, (ఆంధ్రపత్రిక):** నటసార్వభౌమ స్వర్గీయ ఎస్వీ రంగారావు జయంతి సందర్భంగా ఆయనకు జనసేనపార్టీ నాయకులు తిరుపతి అనూష సురేష్ ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా అనూష మాట్లాడుతూ సినిమా, నాటక రంగంలో ఎలాంటి పాత్ర చేయాలన్న సింగల్ టేక్‌లో చేయగల మహానటుడు స్వర్గీయ ఎస్వీ రంగారావు అని కొనియాడారు. అలాంటి మహోన్నతమైన వ్యక్తి జయంతి వేడుకల్లో నేను పాల్గొనడం నా అదృష్టంగా భావిస్తున్నా అని అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు తిరుపతి సురేష్,దాసి రామ్మోహన్, ఆదిత్య రెడ్డి, గణేష్, మణికంఠ, వెంకటేశ్వరరావు, శ్రీనివాస్,తదితరులు పాల్గొన్నారు.

# వైసీపీ నాయకుడు మైలవరపు దుర్గారావుపై దాడికి నిరసన





**విజయవాడ పశ్చిమ, జూలై 3, (ఆంధ్రపత్రిక):** వైసీపీ నాయకుడు మైలవరపు దుర్గారావుపై తెలుగుదేశం, జనసేన నాయకుల దాడిని నిరసిస్తూ బుధవారం 44వ డివిజన్ చెరువుసెంటర్ వద్ద వైసీపీ నాయకులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. చెరువుసెంటర్‌లో వైసీపీ శిలాఫలకం ధ్వంసం చేస్తున్నవారిని అడ్డుకునేందుకు వెళ్లిన 44వ డివిజన్ కార్పొరేటర్ మైలవరపు రత్నకుమారి భర్త దుర్గారావుపై అక్కడివారు దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. మంగళవారం సాయంత్రం జరిగిన ఈ సంఘటనలో తలపై, చేతులపై, కాళ్లపై గాయాలైన దుర్గారావును బంధువులు వెంటనే ఆసుపత్రికి తరలించడంతో వైద్యులు సత్వరచికిత్సను అందచేసారు. ఈనేపథ్యంలో దుర్గారావును మాజీమంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు, వైసీపీ నాయకులు షేక్ ఆసిఫ్, పోతిన మహేష్ తదితరులు ఆస్పత్రిలో పరామర్శించి దాడి ఘటనను తీవ్రంగా ఖండించారు. దాడికి పాల్పడిన వారిని వెంటనే అరెస్టుచేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్‌చేసారు. ఈ నేపథ్యంలో బుధవారం చెరువుసెంటర్‌లో వైసీపీనాయకులు ఆసిఫ్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని అక్కడి మహాత్మాగాంధీ విగ్రహానికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు దుర్గారావును పరామర్శించారు. కాగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులు చెరువుసెంటర్‌లో పికెట్‌ను ఏర్పాటుచేసారు.

## ఎపిలో మళ్ళీ ఉచిత ఇసుక విధానం..!

(మొదటిపేజీ తరువాయి)

తీసుకున్నారు. ఐదేళ్ల క్రితం టిడిపి ప్రభుత్వ హయాంలో అమలు చేసిన ఉచిత ఇసుక పంపిణీ పథకాన్ని మళ్లీ ఇప్పుడు కొనసాగించాలని చంద్రబాబు నిర్ణయించారు. ఈ మేరకు ఉచిత ఇసుక పంపిణీ విధానాన్ని జులై 8వ తేదీ నుంచి అమల్లోకి తీసుకురావాలని చంద్రబాబు నిర్ణయించారు. ఈ మేరకు అవసరమైన చర్యలు చేపట్టాలని రాష్ట్ర గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్రకు సీఎం చంద్రబాబు ఆదేశాలు జారీ చేశారు. ఈ పథకానికి సంబంధించి ఇసుక లోడింగ్, రవాణా చార్జీలు నిర్ణయిం చేందుకు కలెక్టర్ల అధ్యక్షతన కమిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నారు. జగన్ ఇసుక పాలసీతో ప్రజలు నష్టపోయారు నిన్న సుదీర్ఘంగా ఇసుక విధానంపైన సమీక్ష నిర్వహించిన చంద్రబాబు జగన్ పరిపాలన సమయంలో ఇసుక పాలసీ వల్ల పేద ప్రజలు తీవ్రంగా నష్టపోయారని, గృహ నిర్మాణరంగం కుదేలైందని ఆవేదన వ్యక్తం చేశారు. వైసిపి నేతలు ఇసుక మాఫియాగా ఏర్పడి భారీగా ధరలను పెంచి, ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని గుర్తించినట్టు చంద్రబాబు పేర్కొన్నారు. ఉచిత ఇసుక విధానంపై చంద్రబాబు గ్రీన్ సిగ్నల్ తక్షణమే ఇసుక ధరలు ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని స్పష్టం చేయడంతో పాటు ఇసుక రీచ్‌లు, స్టాక్ పాయింట్ల వద్ద ఎంత ఇసుక అందుబాటులో ఉందో లెక్క చెప్పాలని అధికారులను ప్రశ్నించారు. దీంతో ప్రస్తుతం 40 లక్షల టన్నులు ఇసుక అందుబాటులో ఉందని లెక్క చెప్పారు అధికారులు. ఇక తాజాగా ఉచిత ఇసుక విధానం అమలుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు.మంత్రి కొల్లు రవీంద్ర ఇక తాజాగా చంద్రబాబు జులై 8వ తేదీ నుంచి ఉచిత ఇసుక విధాన అమలులోకి తీసుకురావాలని నిర్ణయం తీసుకోవటం పట్ల మంత్రి కొల్లు రవీంద్ర స్పందించారు. ఏపీలో మళ్లీ ఉచిత ఇసుక విధానం ప్రవేశ పెట్టడం శుభ పరిణామం అని ఆయన పేర్కొన్నారు. గత ఐదేళ్లు ఇసుక పేరుతో వైసిపి నేతలు దోపిడీ చేశారని ఆరోపించారు. ఇకపై ఎవరికి ఇసుక కావాలన్నా సులభంగా అందేలా చూస్తామని పేర్కొన్నారు.

## భక్తులకు టిటిడి హెచ్చరిక..

(మొదటిపేజీ తరువాయి)

వాడకాన్ని నిలిపివేసి.. గతంలో వినియోగించే బియ్యాన్ని వాడాలని తితిదే నిర్ణయించినట్లు సోషల్ మీడియాలో ఓ వార్త వైరల్ అవుతోందని.. అది పూర్తిగా అసత్యమని స్పష్టం చేసింది. ఇటీవల అర్చకులు, ఆలయ అధికారులతో ఈవో శ్యామలరావు నిర్వహించిన సమావేశంలో స్వామివారికి నివేదించే అన్నప్రసాదాలు, వాటి దిట్టం గురించి సుదీర్ఘంగా చర్చించారని తెలిపింది. అయితే దీనిపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని వెల్లడించింది. కానీ.. అన్నప్రసాదాల తయారీలో మార్పులు చేసినట్లు కొంతమంది దుష్ప్రచారం చేస్తున్నారని పేర్కొంది. ఇలాంటి తప్పుడు ప్రచారాలు నమ్మవద్దని భక్తులకు తితిదే సూచించింది.

## ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపిక లాంచనమే..

(మొదటిపేజీ తరువాయి)

రెండు నామినేషన్లు మాత్రమే దాఖలు అయ్యాయి. స్క్రూటినీ పక్రియ పూర్తి చేసిన ఈసీ వాటిని ఆమోదించింది. నామినేషన్ల ఉపసంహరణకు ఈనెల 5వ తేదీ తుది గడువుగా ప్రకటించింది. టీడీపీ తరఫున సి.రామచంద్రయ్య, జనసేన తరఫున పి.హరిప్రసాద్ ఎన్నిక ఏకగ్రీవం అయే అవకాశం ఉంది. మంగళవారం నామినేషన్లు వేసే సమయంలో రామ చంద్రయ్యతోపాటు మంత్రులు పయ్యావుల కేశవ్, ఎన్ఎండీ ఫరూక్ పాల్గొన్నారు. అలాగే హరిప్రసాద్‌తోపాటు మంత్రులు నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేశ్, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ పాల్గొన్నారు. అయితే వైసీపీ అరాచకాలు భరించలేకనే ఎమ్మెల్సీ పదవీ కాలం ఇంకా మూడేళ్లు ఉన్నప్పటికీ రాజీనామా చేసినట్లు రామచంద్రయ్య తెలిపారు. టీడీపీ అధినేత చంద్రబాబు ఏపీకి మంచి చేస్తారనే ఉద్దేశంతోనే పార్టీలో చేరానని, చేరిన వెంటనే ఎమ్మెల్యే పదవికి పోటీ చేసే అవకాశం కల్పించారని చెప్పారు. గతంలో పాత్రికేయుడిగా పనిచేసిన తనకు ప్రజా సమస్యలపై పూర్తి అవగాహన ఉందని జనసేన ఎమ్మెల్సీ అభ్యర్థి హరిప్రసాద్ అన్నారు. ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు ప్రజాప్రతినిధిగా ఇప్పుడు అవకాశం దక్కనుందని, శాసనమండలిలోకి అడుగుపెట్టి జీవితాన్ని ప్రజలకు అంకితం చేస్తానని చెప్పుకొచ్చారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అభివృద్ధిలో పరుగులు పెడుతుందని, ఎన్డీయే ప్రభుత్వంలో తాము భాగం కాబోతున్నందుకు సంతోషంగా ఉందని హరిప్రసాద్ తెలిపారు.

## ఎన్టీఆర్ భవన్‌పై దాడి కేసు..

(మొదటిపేజీ తరువాయి)

ఒక్క ఎమ్మెల్సీ ప్రధాన సూత్రధారి అని పోలీసులు నిర్ధారణకు వచ్చారు. దాడిలో తాడేపల్లికి చెందిన 7 మంది మాజీ ఎమ్మెల్యే ఆర్కే అనుచరులు పాల్గొన్నట్లు నిర్ధారించారు. సీసీ టీవీ ఫుటేజ్ ఆధారంగా నిందితులను పోలీసులు గుర్తించారు. ఈ ఘటనకు సంబంధించి 150 మందిపై కేసులు నమోదు చేసే అవకాశం ఉంది. గుణదల, రాణిగారితోట, కృష్ణలంక, తాడేపల్లి, గుంటుపల్లి, గుంటూరుకు, చెందిన వారే ఎక్కువ మంది దాడిలో ఈ ఘటనలో పాల్గొన్నట్లు గుర్తించారు. దాడిలో పాల్గొన్న నిందితుల కదలికలపై పోలీసులు దృష్టి సారించారు. వైసీపీ నాయకులు అవినాష్, ఎమ్మెల్సీ అప్పిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఆర్కే అనుచరులే టీడీపీ ఆఫీస్‌పై దాడి జరిపినట్లు పోలీసుల విచారణలో బయటపడింది. కాగా.. 2021 సంవత్సరం అక్టోబరు 19న మంగళగిరి సమీపంలోని టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి జరిగిన విషయం తెలిసిందే. రాడ్లు, కర్రలు, రాళ్లతో వచ్చిన వైసీపీ కార్యకర్తలు... టీడీపీ కార్యాలయ గేట్లు విరగొట్టి మరీ లోపలకు వచ్చారు. కార్యాలయంలో ఉన్న కుర్చీలు, టేబుల్లు, అద్దాలు విరగగొట్టి విధ్వంసం సృష్టించారు. వారిని అడ్డుకోవడానికి ప్రయత్నించిన టీడీపీ కార్యకర్తలు, కార్యాలయ సిబ్బందిని తీవ్రంగా కొట్టారు. ఈ దాడిలో ఇద్దరికి గాయాలయ్యాయి. అయితే ఈ ఘటనపై అప్పట్లో టీడీపీ నేతలు ఫిర్యాదు చేసినప్పటికీ పోలీసులు పట్టించుకోలేదు. తాజాగా టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఈ కేసు దర్యాప్తును పోలీసులు ముమ్మరం చేశారు.

## నదుల అనుసంధానంతోనే నీటి సమస్యకు చెక్

(మొదటిపేజీ తరువాయి)

అనుసంధానం సాకారమన్నారు. పట్టిసీమ ఎత్తిపోతల పథకం ద్వారా కృష్ణా డెల్టాకు సాగు, తాగునీటిని మంత్రి విడుదల చేశారు. 4, 5, 6 పంపుల ద్వారా 1,050క్యూసెక్కుల నీటిని విడిచిపెట్టారు. అక్కడ యంత్రాలు, మోటార్లకు పూజలు నిర్వహించారు. అనంతరం పట్టిసీమ ఎత్తిపోతల పథకానికి సంబంధించిన ఛాయాచిత్ర ప్రదర్శనను మంత్రి పరిశీలించారు. అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడారు. పోలవరం ప్రాజెక్టు పూర్తయితే వృథా నీటిని అరికట్టవచ్చన్నారు. 'ముంపు మండలాలను తెలంగాణ నుంచి ఆంధ్రాకు బదిలీ చేయించడం చంద్రబాబు ముందుచూపునకు నిదర్శనం. పట్టిసీమ ద్వారా ఏటా 80 టీఎంసీల నీటి వినియోగం జరుగుతోంది. గతంలో పట్టిసీమను జగన్ ఒట్టిసీమ అన్నారు.. ఇప్పుడు అదే బంగారమైంది. కృష్ణా డెల్టాకు తాగు, సాగునీరు అందుతుందంటే అది పట్టిసీమ పుణ్యమే. తాగునీటి వ్యవస్థను జగన్ విధ్వంసం చేశారు. పట్టిసీమ నీటిని విడుదల చేయకపోతే లక్షలాది మంది దాహార్తిని ఎలా తీరుస్తారు?ఒక్క చుక్క నీటినీ వృథా చేయొద్దని సీఎం చెప్పారు. తాడిపూడి నుంచి 1.50లక్షల ఎకరాలకు సాగునీరందిస్తున్నాం. ఏలేరు రిజర్వాయర్‌లో నీరుంటే విశాఖకు తాగునీరు అందుతుంది. ఏలేరులో నీటి నిల్వకు ప్రయత్నం చేస్తున్నాం. ఒకే రోజు నాలుగు పథకాల ద్వారా నీటిని విడుదల చేయడం చరిత్ర. అధికారులతో సమన్వయం చేసుకుని నీటి నిర్వహణ సమర్థంగా చేపడుతున్నాం. పోలవరం ఫలాలు పట్టిసీమ ద్వారా కొంతమేర కృష్ణా డెల్టాకు అందుతున్నాయి' అని రామానాయుడు అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే చిర్రి బాలరాజు, ఏలూరు జిల్లా కలెక్టర్ వెట్రి సెల్వి, ఐటీడీఏ పీవో సూర్యతేజ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ హైకోర్టు కీలక ఆదేశాలు

(మొదటిపేజీ తరువాయి)

ఈడీ కేసులు లేని నేతను ఎన్నుకోవాలని ప్రజలు అనుకుంటున్నారని.. సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ కేసుల్లో నిందితుడైన జగన్ వరుస పిటిషన్లు వేసి విచారణలో జాప్యం చేస్తున్నారన్నారు. ఈ పిటిషన్ ను ఎన్నికలకు ముందే దాఖలు చేశారు. విచారణ జరిపిన హైకోర్టు.. జగన్ కేసులను రోజు వారీ విచారణ చేపట్టాలని ఆదేశించింది. ఈ క్రమంలో మాజీ సీఎం జగన్ అక్రమాస్తుల కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. జగన్ కేసులపై దాఖలైన పిటిషన్‌పై హైకోర్టు విచారణ చేపట్టింది. సీబీఐ కోర్టులో ఉన్న జగన్ కేసులను రోజువారీ విచారణ చేపట్టాలని హైకోర్టు ఆదేశించింది. దీనిపై వాదనలు వినిపించిన ప్రభుత్వ న్యాయవాది కోర్టులో దర్యాప్తు కొనసాగుతోందని తెలిపారు. తదుపరి విచారణను హైకోర్టు 3 వారాలకు వాయిదా వేసింది.

## 132 సీట్లతో కూడిన బస్సులు

(మొదటిపేజీ తరువాయి)

అన్వేషిస్తున్నామని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు.132 సీట్లతో కూడిన బస్సులను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు వెల్లడించారు. అందుకోసం నాగ్‌పూర్‌లో పైలట్ ప్రాజెక్ట్ కొనసాగుతుందని తెలిపారు. కాలుష్యం ముప్పును ఎదుర్కొనేందుకు దిగుమతి ప్రత్యామ్నాయం, కాలుష్య రహిత ఇంధనం, స్వదేశీ పరిజా?నం, తక్కువ ఖర్చు వంటి పరిష్కార మార్గాలు అవసరం అని అన్నారు. ఇప్పటికే దేశ వ్యాప్తంగా చాలా ప్రాంతాల్లో ఎలక్ట్రిక్ వాహనాలు అందుబాటులోకి వచ్చాయన్నారు. వందల సంఖ్యలో ఇథనాల్ పంప్‌లు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. అంతేకాకుండా రూ. 120 లీటర్ పెట్రోల్‌కు ఖర్చు పెట్టే బదులు రూ. 60తో ఇథనాల్ వాడవచ్చన్నారు. డీజిల్ బస్సు కిలోమీటర్ ప్రయాణానికి రూ. 115 ఖర్చు అవుతందని తెలిపారు. అదే ఎలక్ట్రిక్ బస్సు అయితే రూ. 50 నుంచి 60 ఖర్చు అవుతుందన్నారు. దీంతో టికెట్ ధర 15 నుంచి 20 శాతం తగ్గుతుందని తెలిపారు.చెక్ రిపబ్లిక్ వెళ్లినప్పుడు అక్కడ 3 బస్సులను కలిపి ఒకే ట్రాలీ బస్సు లాగా తయారు చేయడం చూశానని తెలిపారు. తర్వాత టాటా సహకారంతో నాగ్‌పూర్‌లో పైలట్ ప్రాజెక్టు ప్రారంభించినట్లు చెప్పారు. 132 మంది కూర్చునేలా బస్సును రూపొందిస్తున్నట్లు వెల్లడించారు. 40 కిలో మీటర్ల దూరం వెళ్లాక బస్సుకు ఛార్జింగ్ చేసుకోవాలని అన్నారు. 40 సెకన్ల పాటు చార్జింగ్ పెడితే మరో 40 కిలో మీటర్లు వెళ్లవచ్చన్నారు. దీంతో కిలో మీటర్‌కు రూ. 35 నుంచి రూ. 40 మాత్రమే ఖర్చు అవుతుందని తెలిపారు.

# ఐదేళ్ల పాలనలో అమరావతి విధ్వంసం..

(మొదటిపేజీ తరువాయి)

అమరావతి ఇప్పుడు దెబ్బతిన్నదన్నారు. అమరావతిలో అభివృద్ధి ఆగిపోయిందన్నారు. ఇప్పుడు ప్రజలు, పెట్టబడిదారుల విశ్వాసాన్ని పెంచుకుంటామన్నారు. అమరావతి అనేది ఆ కాలంలో ప్రముఖ నగరం. రాష్ట్ర విభజన జరుగు తుందని, అమరావతి రాజధాని అవుతుందని ఎవరూ ఊహించలేదు. రాజధానికి అమరావతి పేరు పెట్టాలని రామోజీగ్రూప్ సంస్థల ఛైర్మన్ రామోజీరావు సూచించారు. అమరావతి పేరును క్యాబినెట్‌లో వందశాతం అంగీకరించారు. ప్రతి గ్రామం నుంచి మట్టి నీరు తెచ్చి అమరావతిలో ఉంచాం. యమునా నది నీరు, పార్లమెంట్ మట్టిని ప్రధాని మోదీ తెచ్చారు. దేశంలోని ప్రముఖ దేవాలయాల పవిత్ర జలం, మట్టి తెచ్చాం. ఆ పవిత్ర జలం, మట్టి మహిమ అమరావతిలో ఉంది. అందుకే అమరావతిని ఎవరూ కదిలించలేకపోయారు. రాష్ట్రంలో ఎటుచూసినా సమదూరంలో ఉన్న ప్రాంతం ఇది. రాష్ట్ర భవిష్యత్తును ఆకాక్షించే ఎవరైనా అమరావతిని ఒప్పుకోవాలి. విజయవాడ, గుంటూరు మధ్యే రాజధాని ఉండాలని శివరామకృష్ణ కమిటీ కూడా చెప్పింది. హైదరాబాద్‌ను అభివృద్ధి చేసిన అనుభవం నాకు ఉంది. తొమ్మిదేళ్లలో సైబరాబాద్ ప్రాంతాన్ని అభివృద్ధి చేశాం. కృష్ణానది నుంచి నీళ్లు తెచ్చి సైబరాబాద్‌కు ఇచ్చాం. 29 వేల మంది రైతులు 34,400 ఎకరాలు రాజధాని కోసం ఇచ్చారు. రైతులు ఇచ్చిన భూమికి ఏటా పరిహారం ఇచ్చాం. పదేళ్ల వరకు పరిహారం ఇస్తామని రైతులకు చెప్పాం. రైతు కూలీలకు కూడా పరిహారం ఇచ్చాం. రైతులు ఇచ్చింది, ప్రభుత్వ భూమి కలిపి 53,745 ఎకరాలు సమకూరింది. రాజధాని రాష్ట్రానికి నడి మధ్యనే ఉండాలని ఆనాడు ప్రతిపక్షనేతగా జగన్ చెప్పారు. కానీ, అధికారంలోకి వచ్చాక జగన్ ఏం చేశారో ప్రజలే చూశారు. దేశంలో ఏ నగరానికి లేని సౌలభ్యత అమరావతికి ఉంది. ఇన్ని కిలోమీటర్ల రివర్ ఫ్రంట్ ఎక్కడా లేదు. ఒక వైపు గోదావరి, మరో వైపు కృష్ణా రెండు నదుల అనుసంధానంతో ఎప్పుడూ ఫ్రెష్ వాటర్ అందుబాటులో ఉంటుందని అన్నారు. విభజన సమయంలో మనకు లోటు బడ్జెట్‌ఉంది. ప్రాజెక్టు ఏదైనా విన్ విన్ పరిస్థితిలోనే ముందుకు తీసుకెళ్లా. అమరావతిలో పెట్టుబడులు పెట్టేందుకు అనేక మంది ముందుకొచ్చారు. సింగపూర్.. మనకు మాస్టర్‌ప్లాన్ ఇచ్చింది. తొమ్మిది విభాగాల్లో అమరావతి హబ్‌గా మారాలని ఆకాం క్షించాం. ఫైనాన్షియల్, నాలెడ్జ్, టూరిజం, ఎలక్ట్రానిక్, హెల్త్ సిటీ ప్రతిపాదించాం. పచ్చదనానికి ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చాం. దేశం లోని ఏ నగరానికీ అమరావతిలా సౌలభ్యం లేదు. జగన్ వచ్చాక అమరావతిలో జరుగుతున్న పనులను ఆపేశారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజావేదిక కూల్చేశారు. ఏ కట్టడం కట్టాలన్నా పదిసార్లు ఆలోచిస్తాం. అమరాతి రైతులను అనేక రకాలుగా అవమా నించారు. రాజధాని కోసం భూమి ఇచ్చిన రైతులు రోడ్డున పడ్డారు. శ్రీకాకుళం యాత్రకు వెళ్తే మధ్యలోనే అడ్డుకున్నారు. అమరావతి రైతుల త్యాగం చరిత్ర గుర్తు పెట్టుకుంటుందని అన్నారు. అమరావతి విధ్వంసం చేసి తెలుగు జాతికి ద్రోహం చేశారు. రాజధానిని మార్చిన వ్యక్తి గతంలో ఎవరూ లేరు. క్యాపిటల్ మార్పు జరిగితే ఏం జరుగుతుందో దేశానికిది కేస్ స్టడీ. ఇంతగా విధ్వంసం చేసిన వ్యక్తి రాజకీయాలకు అర్హుడేనా? కేసులు ఎదుర్కొంటున్న అమరావతి రైతులకు న్యాయం చేస్తాం. ఏం జరిగినా వెనక్కి చూడను.. ముందుకే వెళ్తా. న్యాయపరమైన చిక్కులు తొలగించి పనులు శరవేగంగా పూర్తి చేస్తాం. ఒకసారి నమ్మకం కోల్పోతే పెట్టుబడిదారులు మళ్లీ రారు. ఇప్పుడు పెట్టుబడి దారులను రప్పించాలంటే చాలా కష్టపడాలి. మళ్లీ ఇబ్బందులు రావని భరోసా ఏమిటని అడుగుతున్నారు? మన రాష్ట్రంలో అవకాశాలు లేవా.. ప్రజలకు తెలివితేటలు లేవా? మన రాష్ట్రం రైస్ బౌల్ అని దేశ వ్యాప్తంగా పేరుంది. మనకు మంచి భూములు ఉన్నాయి.. పండించే రైతులు ఉన్నారు. అమరావతికి బ్రాండ్ ఇమేజ్ ఎలా తేవాలనే ఆలోచిస్తున్నాం. ఈ శిథిలాల నుంచే బంగారు భవిష్యత్తుకు నాంది పలుకుతాం. ఇక్కడ సంపద సృష్టి, ఉపాధి కల్పన, పేదరిక నిర్మూ లన జరగాలి. అమరావతిలో పనులు మళ్లీ ప్రారంభమయ్యాయి. అంచెలంచెలుగా పూర్తి చేస్తాం అని చంద్రబాబు వివరించారు. చేపట్టిన ఏ ప్రాజెక్టు అయినా విన్-విన్ పద్ధతిలోనే ముందుకు సాగా మని అమరావతిని కూడా అలాగే ప్రారంభించామన్నారు. ప్రాజెక్టు నిర్మాణానికి భూములు ఇచ్చిన వారు కూడా సంతోషంగా ఉండాలన్నదే తన ఉద్దేశమన్నారు. శంషాబాద్ ఎయిర్ పోర్టు నిర్మించిన సమయంలో అలాగే చేశామని అమరావతిలోనూ అదే విధంగా ల్యాండ్ పూలింగ్ నిర్వహించామన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద ల్యాండ్ పూలింగ్ అమరావతిదే అన్నారు. వరల్డ్ బ్యాంక్ దీనిని ఓ కేస్ స్టడీగా చూపించిందన్నారు. ల్యాండ్ పూలింగ్‌లో భాగంగా రాజధానికి భూమి ఇచ్చిన ప్రతి ఒక్కరికీ ప్రయోజనం కలిగేలా వ్యవహరించామన్నారు.రాజధాని రాష్ట్రం మధ్యలో ఉండా లని జగన్ ఆనాడు చెప్పారని... ఇక్కడ ఇల్లు కూడా కట్టుకు న్నారని... కానీ ఆ తర్వాత ఆయన ఏం చేశారో అందరూ చూశారని విమర్శించారు. రాజధాని నిర్మాణానికి బ్యాంకులు ముందుకు వచ్చి... మన రాజధాని ప్రాజెక్టుకు మద్దతు ఇచ్చారన్నారు. రాజధాని నిర్మాణం కోసం సింగపూర్ మాస్టర్ ప్లాన్ ఇచ్చిందన్నారు. సింగపూర్‌తో ఎంవోయూ కూడా కుదుర్చుకున్నట్లు చప్పారు. సీడ్ క్యాపిటల్ ఏరియాతో పూర్తి వివరాలతో మాస్టర్ ప్లాన్ ఇచ్చినట్లు తెలి పారు. మొత్తం 9 నగరాలను అమరావతిలో ఏర్పాటు చేశామన్నారు. సెంటిమెంట్ , పవిత్రమైన లక్ష్యంతో రాజధానిగా అమరావతి నిర్మాణం ప్రారంభించామన్నారు. భవిష్యత్‌ను కాంక్షించే ఎవరూ రాజధానిగా అమరావతిని వ్యతిరేకించరని స్పష్టం చేశారు. కరు డుగట్టిన ఉగ్రవాది సైతం అమరావతికి ఒకే చెప్పి తీరాల్సిందేనని వ్యాఖ్యానించారు.

## ఉప్పాడ తీరం కోతలపై అధ్యయనం

(మొదటిపేజీ తరువాయి)

దాన్ని రక్షణకు అవసరమైన చర్యలు సూచిస్తుందని, తదనుగుణంగా తీర సంరక్షణ చేపడతామని హామీ ఇచ్చారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మూడో రోజు కాకినాడ జిల్లాలో పర్యటిస్తున్నారు. వాకతిప్ప ఫిషింగ్ హార్బర్, సూరప్ప తాగునీటి చెరువుతో పాటు ఉప్పాడలో కోతకు గురైన తీరప్రాంతాన్ని పవన్ బుధవారం పరిశీలించారు. తీర ప్రాంతం కోతకు గురికాకుండా తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో ఆయన చర్చించారు. అంతకు ముందు స్థానిక నేతలు, జనసేన కార్యకర్తలు డిప్యూటీ సీఎంకు ఘనస్వాగతం పలికారు. పలువురు ఆయన వాహనంపై పూలు చల్లి అభిమానం చాటారు.ఉప్పాడ తీరంలో ఏడాదిన్నర కాలంగా ఎకరం భూభాగం సముద్రపు కోతలో కలిసిపోయిందని. ఇలా ధ్వంసం కాకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాను పర్యాటకంగా అభివృద్ధి చేస్తామని స్పష్టం చేశారు. కేరళలో అధ్యయనం చేసిన తర్వాత కోనసీమలో కొబ్బరి ఉత్పత్తులను అభివృద్ధి చేస్తామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ నిధుల సాయంతో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో సైన్సు అండ్ టెక్నాలజీని అభివృద్ధి చేస్తామని తెలిపారు. అలాగే నన్నయ్య యూనివర్సిటీలో ఉన్న రీసెర్చ్ స్కాలర్లను తీసుకెళ్లి ఉప్పాడ తీర సంరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై అధ్యయనం చేస్తామని చెప్పారు. కేంద్రం ఇస్తున్న జలజీవన్ మిషన్ నిధులను పూర్తిస్థాయిలో వినియోగించుకుని అన్ని గ్రామాలకు రక్షిత తాగునీరందిస్తామని చెప్పారు. జనావాసాల్లో ఉన్న తాగునీటి సమస్యను పూర్తిగా పరిష్కరిస్తామని అన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఉమ్మడి తూర్పు గోదా వరి జిల్లాలో ఏడాదికి వెయ్యి కోట్ల ఇసుక వ్యాపారం జరిగిందని ఐదేళ్లలో రూ.5 వేల కోట్ల రాబడి వచ్చినా జగన్ ప్రభుత్వం మాత్రం పంచాయతీల నిధులకు గండి కొట్టిందన్నారు. గనుల సీనరేజీ నిధులు సైతం ఇవ్వ కుండా దారి మళ్లించారని వీటన్నింటిపై అధికారులను నివేదిక కోరినట్టు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చెప్పారు. తమ ప్రభుత్వంలో కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా ఇసుక తవ్వుకుని పంచాయతీలకు చిల్లిగవ్వ కూడా పన్ను చెల్లించలేదని పవన్ కల్యాణ్ అన్నారు. ఈ పరిస్థితిని మార్చి ఉమ్మడి జిల్లాలో అన్ని పంచాయతీలకు ఆర్థిక పరిపుష్టి కలిగేలా చేస్తామన్నారు. కాకినాడకు అతి సమీపంలో ఉన్న కోరంగి మడ అడవులను గత వైసీపీ ప్రభుత్వం ఇళ్ల స్థలాల పేరుతో ధ్వంసం చేసిందని, వేల టన్నుల కంకరతో మడ భూములను చదునుచేసిందని, దీనివల్ల మడ అడవుల్లో ఉండే జీవరాశులు మనుగడ కోల్పోయే ప్రమాదం వాటిల్లిందన్నారు. తిరిగి మడ అడవుల అభివృద్ధికి చర్యలు తీసుకునేలా అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్టు చెప్పారు. కోరంగిలో ఎకో టూరిజం అభివృద్ధి చేస్తామన్నారు. ఇందుకు సంబంధించి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని చెప్పారు. కాకినాడ సముద్ర తీరంలో ఉన్న హోప్ ఐలాండ్‌ను సంరక్షిస్తామని, అక్కడున్న జీవులను కాపాడేందుకు చర్యలు చేపడతామని తెలిపారు. పవన్ కల్యాణ్ మూడవ రోజు పర్యటనలో ఆసక్తికరమైన పరిణామం జరిగింది. ఉప్పాడలో కోతకు గురవుతున్న సముద్ర తీరాన్ని పరిశీలించేందుకు వెళ్తున్న కాన్వాయ్ ఒకచోట అకస్మాత్తుగా ఆగింది. అనూహ్యంగా పవన్ కల్యాణ్ కూడా కిందకు దిగడంతో అందరూ ఆశ్చర్యపోయారు. ఆసక్తికరమైన ఈ ఘటనకు ఒక చిన్నోడు కారణమయ్యాడు. అటుగా పవన్ కల్యాణ్ కాన్వాయ్ వెళ్తుండగా.. తన ఇంటి ముందు నిలుచొని ఆ బాలుడు ఉత్సాహంతో జనసేన జెండాను ఊపుతూ కనిపించాడు. బుడ్డోడిని గమనించిన డిప్యూటీ సీఎం వెంటనే కాన్వాయ్‌ని ఆపించారు. కారు దిగి బాలుడిని ఆప్యాయంగా దగ్గరికి తీసుకొని కాసేపు ముచ్చటించారు. స్థానికులు ఈ దృశ్యాన్ని తమ సెల్‌ఫోన్‌లలో చిత్రీకరించారు. దీంతో స్థానికులు అందరూ ఆశ్చర్యపోయారు. పవన్ చాలా సింప్లిసిటీని ప్రదర్శించారని, చాలా ఆశ్చర్యంగా ఆనందంగా ఉందని చెబుతున్నారు. కాగా ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

## మొక్కులు తీర్చుకున్న టిడిపి నేతలు

**తిరుమల తిరుపతి శ్రీ వెంకటేశ్వర స్వామి సన్నిధిలో దర్శించుకున్న టిడిపి నేతలు**



**ఎ. కొండూరు జూలై.3 (ఆంధ్రపత్రిక):** 2024లో జరిగినసార్వత్రికఎన్నికల్లో ఎన్డీయే కూటమి అధికారంలోకి వచ్చి చంద్రబాబు నాయుడు మళ్ళీ ముఖ్య మంత్రి కావాలని విజయవాడ పార్లమెంట్ ఎంపీగా కేశినేని శివనాద్ (చిన్ని) తిరువూరు నియోజకవర్గంలో కొలికపూడి శ్రీనివాసరావు ఎమ్మెల్యే గా విజయం సాధించాలని ఆకాంక్షిస్తూ తిరువూరులో తెలుగుదేశం పార్టీజెండా ఎగరాలని తిరుమల తిరుపతి శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని మొక్కుకోవడం జరిగినది ఇరువురు విజయం సాధించటంతో బుధవారం వెంకటేశ్వర స్వామి సన్నిధిలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు పిన్నమనేని శ్రీనివాసరావు గోగులమూడి రామ్ ప్రసాద్ రెడ్డి (లాయర్ ) షేక్ మొహియుద్దీన్ షేక్ జానీ షైదా ఎ కొండూరు మండల ఐటీడీపీ అధ్యక్షుడు షేక్ యాసిన్ పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు అనంతరం శ్రీ తిరుమల తిరుపతి దేవస్థాన అర్చకులు ప్రసాదాన్ని అందించారు.

## అభ్యర్థులకు సమయం కావాలి

**అమరావతి,జూలై 3 (ఆంధ్రపత్రిక):** ఆంధ్రప్రదేశ్‌లో టెట్, మెగా డీఎస్సీ పరీక్షలకు సంబం ధించి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ పరీక్షలకు సన్నద్ధమయ్యేందుకు అభ్యర్థుల కు సమయమివ్వాలని నిర్ణయించింది. అభ్యర్థుల విజ్ఞప్తి మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. త్వరలోనే టెట్, డీఎస్సీ పరీక్షల తేదీలను ప్రకటించనుంది. ఎన్నికల్లో హామీ ఇచ్చిన మేరకు సీఎంగా చంద్రబాబు ప్రమాణస్వీకారం చేసిన వెంటనే 16,347 టీచర్ పోస్టుల భర్తీకి మెగా డీఎస్సీ ఫైల్‌పై తొలి సంతకం చేసిన విషయం తెలిసిందే. ఈ మొత్తం పక్రియ 6 నెలల్లో పూర్తిచేసేలా కార్యాచరణ రూపొందించాలని మంత్రి నారా లోకేశ్ అధికారులను ఆదేశించారు. కొత్తగా బీఈడీ, డీఎడ్ పూర్తి చేసుకున్న వారికీ మెగా డీఎస్సీలో అవకాశం కల్పించనున్నారు. టెట్, మెగా డీఎస్సీ పరీక్షలకు సన్నద్ధమ య్యేందుకు మరింత సమయం కావాలని విద్యార్థి, యువజన సంఘాల నేతలు, పలువురు ఎమ్మెల్సీలు లోకేశ్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. ప్రిపరేషన్‌కు సమయం ఇస్తే బాగుంటుందని కోరడంతో వారి విజ్ఞప్తుల్ని పరిశీలించిన ఆయన.. విద్యాశాఖ ఉన్నతాధికారులతో సమీక్షించారు. అభ్యర్థులకు టెట్‌కు 90 రోజులు, మెగా డీఎస్సీకి 90 రోజుల సమయం ఇవ్వాలని నిర్ణయించినట్లు సమాచారం. త్వరలోనే టెట్, డీఎస్సీ నిర్వహణకు కొత్త తేదీలను ప్రభుత్వం ప్రకటించనుంది. మొత్తంగా ఈ ఏడాది డిసెంబర్‌లోగా ఉద్యోగాల భర్తీ పక్రియను పూర్తి చేసి 2025 జనవరి నాటికి ఉద్యోగాలు ఇచ్చేలా కార్యాచరణ సిద్ధం చేయాలని అధికారులను మంత్రి లోకేశ్ ఆదేశించినట్లు సమాచారం.

## తీర్మానాలతో హోదా అసాధ్యం

(మొదటిపేజీ తరువాయి)

శ్రీనివాస వర్మ అన్నారు. వైకాపా ప్రభుత్వ వైఫల్యం వల్ల పోలవరం సమస్యల్లో ఉంది. ఆ ప్రాజెక్టు నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వ సహకారం ఉంటుందని శ్రీనివాసవర్మ తెలిపారు. దిల్లీలో రాష్ట్ర ఎన్డీయే ఎంపీలతో సీఎం చంద్రబాబు సమావేశమవుతారని చెప్పారు. కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ కార్యాలయంలో 'అమ్మ' పేరుతో మొక్క నాటిన అనంతరం ఆయన మాట్లాడారు. దేశంలో పర్యావరణాన్ని కాపాడేందుకు మొక్క నాటాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చారని చెప్పారు. ఏపీకి ప్రత్యేక హోదా అంశంపై కేంద్రమంత్రి స్పందించారు. కేంద్ర, రాష్ట్రాల్లో ఒకే కూటమి ప్రభుత్వం ఉంది. ప్రత్యేక హోదా.. తీర్మానాలు చేస్తే ఇచ్చే అంశం కాదు. అలా అయితే దేశంలోని అన్ని రాష్ట్రాలూ చేస్తాయి. ఏపీకి ప్రత్యేక హోదా అంశంపై నేను చెప్పలేను. దీనిపై ప్రధాని నిర్ణయం తీసుకోవాలి. బిహార్‌కు కూడా ఇదే వర్తిస్తుంది. 'హోదా' ఎందుకు ఇవ్వడం లేదో గతంలో స్పష్టంగా చెప్పారు. ఆర్థిక సంఘం సిఫార్సుల మేరకు ప్రత్యేక హోదా స్థానంలో ప్యాకేజీ ఇచ్చారు. ఆ నిధుల ద్వారా రాష్ట్రాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉంటుంది. ఏపీలో ఎన్డీయే ప్రభుత్వం ఏర్పడటంతో ప్రత్యేక హోదాపై రాష్ట్ర ప్రజల్లో ఆశలు మళ్లీ చిగురించాయి. కూటమిలో కీలక పాత్ర ఉండటంతో ఎలాగైనా ప్రత్యేక హోదాకు ఒప్పించాలని టీడీపీ అధినేత చంద్రబాబుకు ఒత్తిళ్లు మొదలయ్యాయి. కానీ ఇలాంటి తరుణంలో ప్రత్యేక హోదా అనేది ముగిసిపోయిన అంశమే అని కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ మరోసారి పునరుద్ఘాటించారు.కేంద్రంలో, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వమే అధికారంలో ఉన్నంత మాత్రాన ప్రత్యేక హోదా ఇవ్వడం సాధ్యపడదని కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ తెలిపారు. బిహార్‌కి ప్రత్యేక హోదా ఇవ్వాలని ఆ రాష్ట్ర అసెంబ్లీలో చేసిన తీర్మానంపై కూడా ఆయన స్పందించారు. ప్రత్యేక హోదా ఇవ్వడమనేది తీర్మానాలు చేసి నిర్ణయించే అంశం కాదని తెలిపారు. ప్యాకేజీ నిధుల ద్వారా ఏపీ అభివృద్ధికి కేంద్రం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. పోలవరం జాతీయ ప్రాజెక్టు అని.. దాని నిర్మాణానికి కేంద్రం సహకారం ఉంటుందని తెలిపారు. ఈ ప్రాజెక్టును రాష్ట్ర ప్రభుత్వం నిర్మించాలా? లేదంటే కేంద్రం బాధ్యత తీసుకోవాలా? అనేది కేంద్ర జలవనరుల శాఖ నిర్ణయిస్తుందని చెప్పారు. ఏపీలో శాంతి భద్రతలు కొలిక్కి రావడానికి మరో రెండు మూడు నెలల సమయం పట్టవచ్చని మీడియా అడిగిన ప్రశ్నకు ఆయన బదులిచ్చారు.

## అవినీతిపై కఠినంగా ఉంటాం

**న్యూఢిల్లీ,జూలై 3 :** దేశాన్ని పట్టి పీడిస్తున్న నల్లధనం, అవినీతి భూతాన్ని నాశనం చేసేందుకు మరింత కఠినంగా వ్యవహరిస్తామని ప్రధాని నరేంద్ర మోదీ రాజ్యసభలో ప్రకటించారు. అందుకోసం తమ సర్కార్ కేంద్ర దర్యాప్తు సంస్థలకు పూర్తి స్వేచ్ఛను ఇచ్చిందన్నారు. ఎన్ని ప్రయత్నాలు చేసినా వీటి నుంచి అవినీతిపరులు తప్పించుకోలేరని హెచ్చరించారు. తమపై మోదీ సర్కార్ ఈడీ, సీబీఐలను ప్రయోగిస్తోందని ప్రతిపక్షాలు కొంతకాలంగా తీవ్ర ఆరోపించడంపై ప్రధాని మోదీ తీవ్రంగా స్పందించారు. దర్యాప్తు సంస్థలు నిజాయితీగా పని చేస్తాయి. ఏ అవినీతిపరుడు చట్టం నుంచి తప్పించుకోలేడు. ఇది మోదీ గ్యారంటీ. అవినీతి, నల్లధనంపై నిలువరించేందుకు కఠినచర్యలు తీసుకునేందుకు మా ప్రభుత్వం దర్యాప్తు సంస్థలకు పూర్తి స్వేచ్ఛనిచ్చిందని ఈ సందర్భంగా దేశ ప్రజలకు తెలియజేస్తున్నా. వాటి చర్యల్లో మా సర్కార్‌కు ఎలాంటి పాత్ర లేదు అని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఢిల్లీ మద్యం కుంభకోణాన్ని ప్రస్తావించిన మోదీ.. ఆమ్ ఆద్మీ పార్టీతో సహ కాంగ్రెస్‌పై మండపడ్డారు. 'ఆప్ అవినీతికి పాల్పడింది. మద్యం కుంభకోణానికి తెర తీసింది. పలు కుంభకోణాలతో పాటు మరెన్నో దుశ్చర్యలకు పాల్పడింది. ఆప్ చర్యలపై కాంగ్రెస్ కూడా ఫిర్యాదు చేసింది. కానీ, ఇప్పుడు ఆప్‌పై చర్యలు తీసుకుంటే మోదీపై ప్రతిపక్షాలు విమర్శలు గుప్పిస్తున్నాయి అని ప్రతిపక్షాల తీరును దుయ్యబట్టారు.నాడు ఆప్ కుంభకోణాలకు సంబంధించిన సాక్ష్యాలను కాంగ్రెస్ మీడియా ముందు పెట్టిందని గుర్తు చేశారు. 'ప్రస్తుతం ఆ రెండు పార్టీలు ఒక్కటయ్యాయి. ఆప్‌పై గతంలో హస్తం పార్టీ చెప్పినవి సత్యాలా లేక అసత్యాలా?దీనిపై కాంగ్రెస్ వివరణ ఇవ్వాలి అని ప్రధాని డిమాండ్ చేశారు. అవినీతి నిర్మూలనే ఎన్డీఏ లక్ష్యమని.. ఎన్నికల్లో గెలుపోటములు తమకు ముఖ్యం కాదని పేర్కొన్నారు. గత ఏడాది మేలో మణిపూర్ లో చెలరేగిన హింసాకాండ దేశవ్యాప్తంగా సంచలనంగా మారింది. మణిపూర్ అల్లర్లపై ప్రధాని వివరణ ఇవ్వాలని మంగళవారం లోక్ సభలో ప్రతిపక్షాలు డిమాండ్ చేశారు. బీజేపీ మణిపూర్ లో హింసను ప్రోత్సహిస్తున్నాయని ప్రతిపక్షాలు ఆరోపించాయి. దీనిపై మోదీ బుధవారం రాజ్యసభలో మాట్లాడారు. మణిపూర్ లో శాంతి నెలకొల్పడానికి మా వంతు ప్రయత్నం చేస్తున్నామని ప్రధాని మోదీ అన్నారు.11వేలకు పైగా ఎఫ్ ఐఆర్ హింసకు కారణమైన వారిపై నమోదు చేశామని, అందులో 500 మందిని అరెస్ట్ కూడా చేశామని ఆయన తెలిపారు. మణిపూర్ సమస్యను రాజకీయం చేయడం మానేయండని ప్రధాని విపక్షాలపై మండిపడ్డారు. చాలా ప్రాంతాల్లో ఇప్పుడు పరిస్థితులు చక్కబడ్డాయని మోదీ అన్నారు. హింసాత్మక సంఘటనలు తగ్గుముఖం పడుతున్నాయని వివరించారు. 2023 మేలో ఇంఫాల్ వ్యాలీకి చెందిన మెయిటీస్, కొండజాతి అయిన కుకీ వర్గాల మధ్య వర్గపోరు నడిచింది.

## కవిత కస్టడీ పొడిగింపు

(మొదటిపేజీ తరువాయి)

ఢిల్లీ మాజీ ఉపముఖ్యమంత్రి మనీష్ సిసోడియా జ్యూడిషిల్ కస్టడీ ముగిసింది. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కవిత, మనీష్ సిసోడియాను కోర్టు ముందు అధికారులు హాజరు పరిచారు. తదుపరి విచారణ జూలై 25వ తేదీకి కోర్టు వాయిదా వేసింది. జ్యుడీషియల్ కస్టడీలో భాగంగా గత మూడు నెలల నుంచి కవిత తీహార్ జైల్లో ఉంటున్నారు. ఢిల్లీ మద్యం విధానం కేసులో కస్టడీలో ఉన్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత బెయిల్ పిటిషన్‌ను ఢిల్లీ హైకోర్టు రెండు రోజుల క్రితం తిరస్కరించిన సంగతి తెలిసిందే. సీబీఐ, ఈడీ నమోదు చేసిన కేసుల్లో ఊరట ఇవ్వాలని, బెయిల్ మంజూరు చేయాలని కవిత దాఖలు చేసిన రెండు పిటిషన్లను న్యాయస్థానం తిరస్కరించింది. సీబీఐ, ఈడీ వాదనలతో న్యాయస్థానం ఏకీభవిస్తూ బెయిల్‌ను ఇవ్వలేమని చెప్పింది. హైకోర్టు బెయిల్ తిరస్కరించిన నేపథ్యంలో కవిత సుప్రీంకోర్టును ఆశ్రయించే అవకాశం ఉన్నది.



# రైతు లేనిదే రాజ్యం లేదు

- గెలిపించిన ప్రజలకు నిరంతరం సేవకుడిన్కై ఉంటా
- పిఠాపురంలోనే గృహాన్ని నిర్మించుకుంటాను
- డిప్యూటీ సీఎం పవన్

**పిఠాపురం, జూలై 3 (ఆంధ్రపత్రిక):** గత వైసీపీ ప్రభుత్వ దుష్ట పాలనకు వ్యతిరేకంగా ఆంధ్ర రాష్ట్ర ప్రజానీకాన్ని చైతన్య పరచి కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసామని జనసేనాని, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ మూడు రోజుల పర్యటనకు విచ్చేసిన ఆయన బుధవారం పిఠాపురంలో వారాహి సభలో మాట్లాడారు. టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీలు ఎన్డీఏ కూటమిగా ఏర్పడి తద్వారా ప్రజలను చైతన్య పరచుటకు శంఖారావం పూరించి, గత పాలకుల దమనకాండల నుండి ప్రజలను విముక్తి చేయుటకు మహోజ్వాల రాజకీయ పోరాటాలకు సిద్ధపడ్డామన్నారు. బడుగు, బలహీన, మధ్యతరగతి వర్గాలకు జీవన ఉపాధి మెరుగుపరచుటకోసం శ్రమిస్తామన్నారు. రైతు లేనిదే రాజ్యం లేదని, అన్నదాతలకు బాసటగా నిలిచి వ్యవసాయ రంగ సర్వతో ముఖాభివృద్ధికి అవసరమైన బహుళార్ధక సాధక నీటిపారుదల ప్రాజెక్టుల నిర్మాణానికి, ప్రకృతి సహసిద్ధమైన వనరులను రక్షించి, అమరావతి రాజధాని పునర్మించి మంచి పాలన ఇస్తామన్నారు. పారిశ్రామిక రంగ అభివృద్ధితోనే యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలు ప్రక్షాళన చేయుట ద్వారానే సాధ్యమని పేర్కొన్నారు. నిరంతరము శ్రమిస్తూ అన్ని శాఖల అధికారులతో సమీక్ష సమావేశాలు నిర్వహిస్తూ తనకు జన్మనిచ్చిన తల్లి సమానమైన పిఠాపురం నియోజకవర్గ అభివృద్ధి ప్రజా సంక్షేమధ్యేయంగా పనిచేస్తూ అన్ని మతాల దేవాలయాల సముదాయము గల పిఠాపురం నియోజకవర్గం అభివృద్ధి చేసి దేశంలోనే అత్యున్నత పట్టణముగా తీర్చిదిద్దుటకు అహర్నిశలు కృషి చేస్తానని పవన్ కళ్యాణ్ అన్నారు. తన రాజకీయ ప్రస్థానానికి ఆరాధ్యుల్కైనవారందరికీ కృతజ్ఞతా ప్రతిఫలాలు అందిస్తానన్నారు. పిఠాపురంలో నేడు నివాస స్థలం చేయించామని, త్వరలో గృహం నిర్మించుకుంటామని అన్నారు. గత ప్రభుత్వం వ్యవస్థలను నిర్వీర్యం చేసిందని, ప్రజా సంక్షేమంకు తాను కట్టుబడి ఉన్నానన్నారు. అందరికీ రెండు చేతులెత్తి శిరస్సు వంచి నమస్కరిస్తున్నాను అని పవన్ సభ ముగించారు. ఈ కార్యక్రమంలో కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, నియోజకవర్గ జనసేన ఇంచార్జ్ ఎం.శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే వర్మ, బీజేపీ కాకినాడ జిల్లా ఇంచార్జ్ కృష్ణంరాజు, జనసేన పార్టీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు తుమ్మల రామస్వామి తదితరులు పాల్గొన్నారు.



ఢిల్లీలోని ఇందిరా గాంధీ విమానాశ్రయంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్ర బాబు నాయుడుకి స్వాగతం పలికిన ఒంగోలు పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి, సహచర పార్లమెంట్ సభ్యులు




## ఆత్మీయ స్వాగతం...

ఉప్పాడ తీర ప్రాంత కోత సమస్యకు పరిష్కారం కనుగొనేందుకు అధికారులతో కలసి అధ్యాయనానికి వచ్చిన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కి పూల వర్షం కురిపించి, ఆత్మీయ స్వాగతం పలికి, హర్షాతిరేకాలు వ్యక్తం చేసిన ఉప్పాడ తీర ప్రాంత గ్రామాల ప్రజలు...



# గోవిందమ్మ తెగువ వీర మహిళలకు స్ఫూర్తి

### జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి కె.నాగబాబు



**విజయవాడ, జూలై 3 (ఆంధ్రపత్రిక):** గోవిందమ్మమ ఈ పేరు చాలా మంది జన సైనికులు, వీర మహిళల నోట్లో చాలాకాలం మారుమోగింది. 2022 అక్టోబర్ 15న విశాఖ పట్నం నోవాటెల్ హెూటల్లో పవన్ కళ్యాణ్‌ని కట్టడి చేసేందుకు ప్రయత్నించిన రోజు. దాదాపుగా 48 గంటల పాటు వేలాది మంది కార్యకర్తలు పవన్ కళ్యాణ్‌కి మద్దతుగా విశాఖ తీర ప్రాంతంలో నిరీక్షించారు. పార్టీ నాయకులను, కార్యకర్తలను, సిబ్బందిని అక్రమంగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్లో బంధించిన తరుణం. ఆ రోజు గోవిందమ్మ తన చంటి బిడ్డను ఒడిలో ఉంచుకొని జనసేన జెండా పట్టుకొని బీచ్‌లో కూర్చుని ఉండిపోయింది.

**గోవిందమ్మకు నాగబాబు ప్రత్యేక సత్కారం:**

అక్టోబర్ 15, 2022 విశాఖపట్నం నోవాటెల్ హోటల్ నందు పవన్ కళ్యాణ్‌ని కట్టడి చేసేందుకు ప్రయత్నించిన సందర్భంలో గంటల పాటు విశాఖ తీరప్రాంతంలో నిశ్శబ్ద నిరసన చేసిన వీర మహిళ నులక గోవిందమ్మను జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి కె.నాగబాబు మంగళవారం ప్రత్యేకంగా సత్కరించారు. మంగళగిరిలోని జనసేన పార్టీ కేంద్ర కార్యాలయానికి పిలిపించి ఆ రోజుగోవిందమ్మ భర్త నులక విజయ్ కుమార్, కుమార్తె వరలక్ష్మితో కలిసి నిరసన తెలిపిన విధానాన్ని కొనియాడారు.

# 3నెలల్లో 1.28 లక్షల గృహాలను పూర్తి చేయాలి

- వచ్చే మార్చి నాటికి నిర్మాణంలో ఉన్న8.02 లక్షల గృహాలను పూర్తి చేస్తాం
- నిర్మాణ దశలో ఉన్న 6.08 లక్షల ఇళ్ళ స్టేజ్ కన్వర్సన్కు నిర్ణయం
- లే అవుట్ల అభివృద్ధికి ఫ్లై యాష్ వినియోగించేందుకు చర్యలు
- ప్రతినెలా గృహ నిర్మాణ పథకాలపై అధికారులతో సమీక్ష
- రాష్ట్ర గృహనిర్మాణ,సమాచార శాఖామాత్యులు కె.పార్థ సారథి




**అమరావతి, జూలై 3 (ఆంధ్రపత్రిక):**రాష్ట్రంలో 100 రోజుల కార్యాచరణ ప్రణాళిక కింద వచ్చే మూడు మాసాల్లో లక్షా 28వేల గృహాలను పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్ణయించుకున్నట్టు రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార శాఖామాత్యులు కె.పార్థ సారథి వెల్లడించారు. ఈ మేరకు బుధవారం రాష్ట్ర సచివాలయంలో రాష్ట్ర గృహ నిర్మాణ శాఖపై అన్ని జిల్లాల ప్రాజెక్టు డైరెక్టర్లు,ఎస్ఇ,ఇఇలు ఆశాఖ ఉన్నతాధికారులతో మంత్రి సమీక్షించారు. అనంతరం రాష్ట్ర సచివాలయం నాల్గవ భవనంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు ఎన్.చంద్రబాబు నాయుడు అన్ని ప్రభుత్వ శాఖలు 100 రోజుల కార్యాచరణను రూపొందించుకోవాలన్న ఆదేశాలకు అనుగుణంగా గృహ నిర్మాణ శాఖకు సంబంధించి 100 రోజుల కార్యాచరణ కింద రానున్న మూడు మాసాల్లో 1.28 లక్షల గృహాలను పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్ణయించుకున్నట్టు పునరుద్ఘాటించారు. ఇందుకు గాను 2వేల 520 కోట్ల రూ.లన ఖర్చు చేయనున్నట్టు మంత్రి పార్థసారథి తెలిపారు. అంతేగాక రాష్ట్రంలో వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్న 8.02 లక్షల గృహాలను వచ్చే మార్చి నెలాఖరుకు నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్ణయించినట్టు మంత్రి పార్థసారథి చెప్పారు. అదే విధంగా నిర్మాణ దశలో ఉన్న 6.08 లక్షల గృహాల స్టేజ్ కన్వర్సన్ చేయాలని నిర్ణయించినట్టు పేర్కొన్నారు. గృహ నిర్మాణాలు జరిగే లేఅవుట్ల అభివృద్ధికి సంబంధించి విశాఖపట్నం, విజయవాడ,నెల్లూరు,రాయల సీమల్లోని ధర్మల్ పవర్ స్టేషన్ల నుండి వచ్చే ఫ్లై యాష్ వినియోగించేందుకు చర్యలు తీసుకోనున్నట్టు మంత్రి పార్థసారథి పేర్కొన్నారు.

అంతకు ముందు రాష్ట్ర సచివాలయం 5వ భవనంలో జరిగిన గృహ నిర్మాణశాఖ సమీక్షలో గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి పార్థసారథి మాట్లాడుతూ రాష్ట్రంలోని పేద ప్రజల సొంతింటి కలను సాకారం చేసేందుకు ప్రభుత్వం అన్ని విధాలా కట్టుబడి ఉందని ఆదిశగా అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అర్హులందరికీ గృహాలు నిర్మించి ఇవ్వాలని ప్రభుత్వం ధృడ సంకల్పంతో ఉందని కావున గృహ నిర్మాణాలను వేగవతంగా పూర్తి చేసేందుకు క్షేత్ర స్థాయిలో అధికారులంతా చిత్తశుద్ధితో పనిచేయాలని మంత్రి ఆదేశించారు. అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి లబ్ధిదారులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకోవాలని కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులు తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. గృహ నిర్మాణ శాఖలో ఉన్న ఖాళీలను ప్రస్తావిస్తూ పదోన్నతుల ద్వారా ఖాళీలను భర్తీ చేయాలని,క్రింది స్థాయి ఖాళీలను జిల్లాల నుంచి లేదా డిప్యుటేషన్ ద్వారా భర్తీ చేయాలని ఉన్నతాధికారులకు సూచించారు. గృహ నిర్మాణ పథకాల అమలుకు సిబ్బంది కొరత లేకుండా చూడాలని మంత్రి పార్థ సారథి అధికారులకు స్పష్టం చేశారు. ఈసమావేశంలో ఆశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్,ప్రత్యేక కార్యదర్శి మైదీన్ దివాన్,ఎండి గిరీషా,పిడిలు,ఎస్ఇలు, అధికారులు పాల్గొన్నారు.




# రాజధాని అమరావతిపై శ్వేతపత్రం




- ఉద్యోగ కల్పనకు నిలయంగా రాజధాని రూపకల్పన
- వ్యవస్థలు ఇంత పతనానికి చేరడాన్ని ఎప్పుడూ చూడలేదు
- బూడిద చేసిన ప్రాంతం నుండే బంగారు భవిష్యత్తుకు నాంది
- దెబ్బతిన్న రాష్ట్ర బ్రాండ్
- రాష్ట్ర నడిబొడ్డున అమరావతి రాజధాని
- సీఎం చంద్రబాబు నాయుడు






Printed and Published by KANCHARLA RAMAIAH on behalf of Nageswara Rao Estates Private Limited,Printed at Jagati Publications Limited, Sakshi Press, SY.No.481, Phase-2, Jawahar Autonagar, Vijayawada-520007 Andhra Pradesh,
and Published from D.NO.29-28-34, Dasari vari street, Suryaraopeta,Vijayawada-520002, KRISHNA DISTRICT-ANDHRA PRADESH, Editor : KANCHARLA RAMAIAH. Excutive editor V.VIJAYALAKSHMI. RNI no. 10721/65 Mobile:9849998069, Email:andhrapatrikadaily@gmail.com